

నీతిసుధానిధి ఆవిష్కరిస్తున్న గౌ॥ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు మరియు
కమిటీ గౌరవ అధ్యక్షులు శ్రీ అంబటి బ్రాహ్మణయ్య,
ఎం.పి., వ్యవస్థాపకులు శ్రీ కొమరగిరి

'నీతిసుధానిధి' ఆవిష్కరణ



"ప్రస్తుత తరుణంలో ముఖ్యంగా యువతలో, విద్యార్థులలో నైతిక, మానవతా విలువలను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. విలువలు దిగజారిపోతున్న ఈ సమయంలో ఈ మూడు **'నీతిసుధానిధి'** పుస్తకములు కొంతవరకైనా విద్యార్థులలో దేశభక్తిని, జాతీయ భావాలను ఇనుమడింప చేసేందుకు దోహదపడుతాయని అభిప్రాయపడుతున్నాను. నాకు చాలా సంతోషంగా ఉన్నది. మంచి పని చేస్తున్నారు. మీలాంటివారు యింకా చాలామంది తయారైతే తప్ప నీతినిజాయితీలను 'ప్రమోట్' చేయలేము. మీలాంటివారు యింకా ఎంతో మంది **Volunteer** (స్వచ్ఛందం)గా ముందుకు రావల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. నేను మీరు చేస్తున్న ఈ మంచి పనిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

ఒకసారి మనం ఆలోచిస్తే, ఏదైతే మన సంపద, ఆస్తులు అనుకుంటున్నామో, అవన్నీ మనకు ఆనందాన్ని యివ్వవు. మనం నమ్ముకున్న సిద్ధాంతం మాత్రమే మనకు ఆనందాన్ని యిస్తుంది. మంచి పని చేస్తున్నామనే తృప్తి మాత్రమే మనకు ఆత్మానందాన్ని యిస్తుంది. ఇంతకన్నా మించినది వేరొకటిలేదు. ఆ విధంగా మీరు (కొమరగిరి) ఒక మంచి **'శ్రీవాణి'** పత్రికను నడుపుతూ, సాయిబాబా గారిని నమ్ముకోవడం, నమ్ముకోవడమేగాక, వారి ప్రేరణతో **'నైతిక విద్య'** వ్యాప్తి కోసం ఇలాంటి మంచి పుస్తకాలను తీసుకొని రావడం, నాకు చాలా ఆనందంగా వున్నది. మీరు అనేక అమూల్యమైన విషయాలను సేకరించి, ఎంతో కృషి చేసి చాలా బాగా ఈ పుస్తకాలను తీసుకొని వచ్చారు. ఇంకా ఎక్కువ పుస్తకాలను తీసుకొని రావాలని ఆకాంక్షిస్తున్నాను. తీసుకొని రావడమేగాక టీచర్లకు మంచి శిక్షణ యిచ్చి, వారిని తీర్చిదిద్ది ముందుకు నడిపించాలని కోరుతున్నాను. ఏదైతే మీ జీవిత ఆశయం ఉందో, ఆ ఆశయంతో మీలాంటివారు కొన్నివేల మందిని తయారుచేస్తే, వాళ్ళు కొన్ని లక్షల మందిని తయారు చేస్తారు. దిగజారిపోతున్న విలువలను కొంతవరకైనా కాపాడుకోవడానికి ఉపకరిస్తుందని నేను అభిప్రాయ పడుతున్నాను. భగవంతుడు తమర్ని అన్ని విధాలా ఆశీర్వదించాలని ప్రార్థిస్తున్నాను.

Wish you all the Best. నేను చాలా సంతోషిస్తున్నాను. ఇంకా మీరు బాగా చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆ విధంగా చేస్తారని ఆశిస్తున్నాను. మీ అందరి సహకారంతో, నేను కొంతైనా ఈ సమాజంలో నీతిని, నిజాయితీని, విలువలను పెంచగలిగితే, మన దేశభవిష్యత్తు అత్యంత ఉజ్జ్వలంగా ఉంటుంది. ఈ మహత్తర ఆశయం కోసం మనమందరం కలిసి కృషి చేద్దాం.

(ది. 19-8-2002 తేదీన గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారు
'నీతిసుధానిధి' పుస్తకములను ఆవిష్కరించి చేసిన ప్రసంగం)

నీతి సుధానిధి

(MORAL EDUCATION BOOK)

తృతీయ భాగము

రచన - సంకలనం

శ్రీ కొమరగిరి కృష్ణమోహనరావు

ఎడిటర్ : 'శ్రీవాణి'

వ్యవస్థాపకులు : *E.H.V.L. CENTRE*

ప్రచురణ

నైతిక మానవతా విలువల అధ్యయన కేంద్రము

ETHICS & HUMAN VALUES' LEARNING CENTRE

(E.H.V.L. CENTRE)

24-52, Ramanaidupet, MACHILIPATNAM - 521 001.

✆ 08672 - 22818, 21137

ప్రథమ ముద్రణ : జూలై 2002

ప్రతులు : 2000

మూల్యము : రు. **35-00**

కవరు పేజీ డిజైన్

శ్రీ జి.ఎన్. రావు

విక్రమ్ పబ్లిషర్స్

విజయవాడ - 520 002.

ముద్రణ :

శ్రీవాణి ఆఫ్‌సెట్ ప్రింటర్స్

మచిలీపట్నం.

ప్రతులకు :

E.H.V.L. CENTRE

24-52, Ramanaidupet,

MACHILIPATNAM - 521 001.

మనసులో మాట

"సత్ప్రవర్తన, సద్బుద్ధి, సత్యనిరతి
భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనంబు
నేర్పునదే విద్య, అద్దాని విద్యార్థి నేర్వవలయు."

'విద్య' అంటే కేవలం చదవటం, వ్రాయటం మాత్రమే కాదు, డిగ్రీలు సంపాదించటమే కాదు. మార్కులు, ర్యాంకులు తెచ్చుకోవటమే కాదు. పై ఆరు సద్గుణములు నేర్పునదే సరియైన విద్య. కనుక ప్రతి విద్యార్థి అట్టి విద్యను అభ్యసించాలి.

వినయం లేని విద్య, వివేకం లేని విజ్ఞానం, సంస్కారంలేని చదువు ఉన్నా ప్రయోజనం లేదు. విద్యతో పాటు వినయం, వివేకం, సంస్కారం ప్రతి విద్యార్థిలో ఉండాలి. నీతి, నిజాయితీలు వీటికి తోడుకావాలి. ఈ ఐదు విద్యార్థికి పంచప్రాణములు.

సత్యం, అహింస; ప్రేమ, కరుణ; దయ, దాతృత్వం; సేవ, స్నేహం; శాంతం, సహనం - ఇవి మానవతా విలువలు. ఈ విలువలను ప్రతివిద్యార్థి పెంపొందించుకోవాలి.

ఈనాడు కులం పేరుతో క్రుమ్ములాడుకుంటున్నారు. మతంపేరిట మారణహోమాలు జరుగుతున్నాయి. 'అస్పృశ్యత' సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తుంటే, 'అసూయాద్వేషములు' వ్యక్తిని పతనం చేస్తున్నాయి. కనుక భావిభారత పౌరులు వీటికి ఎంత దూరంగా వుంటే అంత మంచిది.

దుర్గుణాలను దూరం గావించి, సద్గుణాలను నేర్పునదే సరియైన విద్య. అయితే ఇటువంటి ఉత్తమమైన, పవిత్రమైన విద్యను ఎప్పుడు? ఎవరికి? ఎవరు? నేర్పాలి. ఇదే ఈనాటి ప్రధాన సమస్య. ఇలాంటి విద్య వెల చెల్లిస్తే బజారులో దొరికేది కాదు, ఎప్పుడుపడితే అప్పుడు అబ్బేది కాదు.

'శైశవేభ్యస్త విద్యానామ్' విద్య బాల్యమునందే అభ్యసించాలి. అప్పుడే అది బాగా వంటపడుతుంది. అప్పుడు నేర్చుకున్నది, అలవరచుకున్నది మాత్రమే జీవితాంతం గుర్తువుంటుంది. మధ్యలో నేర్చుకున్నది మధ్యలోనే పోతుంది. కనుక అట్టి బాల్యదశను సద్వినియోగం అయ్యేట్లుగా చూడాలి పెద్దలు.

'నైతిక విద్యావ్యాప్తి' అనే సౌధానికి నాలుగు మూలస్తంభాలు. అవి పటిష్ఠంగా, దృఢంగా ఉన్నప్పుడే 'నైతిక విద్యావ్యాప్తి' జరుగుతుంది. ఆ మూలస్తంభాలే 1. అధ్యాపకులు 2. తల్లిదండ్రులు 3. విద్యాసంస్థల అధినేతలు 4. ప్రభుత్వం. ఈ నాలుగు స్తంభాలలో ఏ స్తంభం బలహీనంగా ఉన్నా ఆ సౌధం కూలిపోతుంది. నైతిక విద్యావ్యాప్తికే అవరోధం ఏర్పడుతుంది.

ఈ పవిత్ర ఆశయసాధనకు "నైతిక మానవతా విలువల అధ్యయన కేంద్రం" **Ethics & Human values' learning centre (E.H.V.L. Centre)** స్థాపించబడింది. ప్రారంభంలో ప్రధానంగా ఈ క్రింది మూడు అంశాలను గురించి బాలబాలికలకు బోధించాలని సంకల్పించటమైనది.

1. **నైతిక విలువల ప్రాముఖ్యతను, నైతికవిద్య ఆవశ్యకతను బోధిస్తూ, బాలబాలికలను సచ్ఛీల సంపన్నులుగా, విద్యా వినయ శోభితులుగా తీర్చిదిద్దటం.**
2. **మానవతా విలువలను బోధిస్తూ, బాలబాలికలలో మానవత్వాన్ని పెంపొందించటం.**
3. **కులమతాలకతీతంగా బాలబాలికలకు దేశభక్తి భావాలను బోధిస్తూ, వారిని ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దటం.**

పై ఆశయ ఆదర్శములను ఆచరణలో పెట్టడానికి ఒక కార్యాచరణ పథకము కూడా రూపొందించబడింది.

1. **ప్రతి జిల్లాలో 'విద్యా సదస్సులు' నిర్వహించడం.**
2. **అధ్యాపకులకు శిక్షణా తరగతులు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయటం.**
3. **ప్రతి తరగతిలో వారానికొక నీతితరగతి (Moral Class) నిర్వహించడం.**
4. **బాలబాలికలకు బోధించడానికి 'నీతి పుస్తకములు' (Moral Education Books) ముద్రించడం.**

విద్యా సంస్థలలో **'నైతికవిద్య ఆవశ్యకత'** అనే పుస్తకమును ముద్రించి,కొన్ని వేల కాపీలు రాష్ట్రం నలుమూలలా పంపిణీ చేయుటం జరిగింది. ఇంకా మరికొన్ని వేల కాపీలు పంపిణీ జరగాలి. సహృదయుల సహకారం ఎంతైనా అవసరం.

నైతికవిద్యను గురించి తరగతి గదులలో బాలబాలికలకు బోధించడానికి మూడు 'సిలబస్' పుస్తకములు కూడా అందిస్తున్నాము. దీని పేరు 'నీతిసుధానిధి' ఇప్పుడు తృతీయ,

చతుర్థ, పంచమభాగములు సమర్పించుకుంటున్నాము. ముఖ్యంగా ఈ మూడు పుస్తకములు హైస్కూల్, కాలేజీ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వ్రాయబడినాయి. 6, 7 తరగతుల విద్యార్థులకు అవసరమైన ప్రథమ, ద్వితీయ భాగములు త్వరలో అందించబడతాయి.

ప్రస్తుతం అందిస్తున్న 'నీతి సుధానిధి' మూడు భాగములలో ఒక్కొక్క పుస్తకంలో నాలుగు అంశములున్నాయి. 1. ప్రార్థనా శ్లోకములు - గీతములు 2. నీతి శ్లోకములు - పద్యములు 3. హితోక్తులు 4. మహనీయులు - త్యాగశీలురు

మొదటి అంశములోని 'ప్రార్థనా శ్లోకములు - గీతములు' పిల్లలందరిచేత కంఠస్థం చేయించాలి. మిగతా మూడు అంశములలో ఒక్కొక్క అంశములో పది విషయములు (Topics) చొప్పున ముప్పై విషయములు ఉన్నాయి. 'నీతివిద్య' (Moral Education) బోధించడానికి ప్రతి నెలా మూడు Periods కేటాయించుతే బాగుంటుంది. ఆ విధంగా పదినెలల పాటు మూడు తరగతుల వారికి బోధించవచ్చును. ముప్పై విషయాలు వరుసగా బోధించినా బోధించవచ్చును. లేక ఒక్కొక్క అంశములోని ఒక్కొక్క విషయాన్ని తీసుకొని ప్రతినెలా మూడు అంశములలోని విషయాలను బోధించవచ్చును. నిర్ణయాధికారము విద్యాసంస్థలవారికే వదిలివేయడమైనది. ఆ విధంగా బోధించి, విద్యా సంవత్సరాంతంలో వ్రాత పరీక్షలు పెట్టి ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణులలో ఉత్తీర్ణులైనవారికి బహుమతులు ప్రదానం చేస్తే బాగుంటుంది. నైతికవిద్య యెడల విద్యార్థులలో ఆసక్తి పెరుగుతుంది. మానసిక మార్పు వస్తుంది. వినయశీల సంపన్నులవుతారు. సంస్కారవంతులవుతారు.

తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యాసంస్థల అధినేతలు ముఖ్యంగా ప్రభుత్వం ఈ పవిత్ర ఉద్యమానికి సహాయ సహకారములు అందించి 'నైతిక విద్యావ్యాప్తి'కి తోడ్పడుతారని ఆశిస్తున్నాము.

"నైతిక విద్యావ్యాప్తి దేశ ప్రగతికి సోపానం"

ధన్యవాదములు

(కొమరగిరి కృష్ణమోహనరావు)
వ్యవస్థాపకులు : E.H.V.L CENTRE
ఎడిటర్ 'శ్రీవాణి'

మచిలీపట్నం,
ది. 20-7-2002

కృతజ్ఞతలు

'నీతి సుధానిధి' పుస్తకములు (Moral Education Books) ముద్రించే ముందు చాలా మంది అనుభవజ్ఞులైన, పెద్దలను సంప్రదించాను. వారి అమూల్యమైన సలహాలు స్వీకరించాను. వారి రచనలు కూడా నాకు సహాయపడినాయి. ముఖ్యంగా గత 17 సంవత్సరాలుగా **శ్రీవాణి మాసపత్రిక** రచనలు నాకు ఎంతగానో తోడ్పడినాయి.

సర్వశ్రీ ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం (వైస్‌ఛాన్సలర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్), జనమద్ది హనుమచ్ఛాస్త్రి (కడప), చర్ల రాధాకృష్ణశర్మ (తమిళనాడు), 'పద్మశ్రీ' తుర్లపాటి కుటుంబరావు (విజయవాడ), మన్నవ గిరిధరరావు (Ex. M.L.C. గుంటూరు), కీ॥శే॥ "కరుణశ్రీ" (గుంటూరు), ఆర్. సీతాలక్ష్మి (చీరాల), ఎన్.వి. ఆర్. సత్యనారాయణమూర్తి (బొబ్బిలి), రెడ్డి రాఘవయ్య (హైదరాబాద్)గార్ల రచనలు మరియు శతకములు, భర్తృహరి సుభాషితములు ఈ మహాప్రయత్నానికి తోడ్పడినాయి.

మచిలీపట్నంకు చెందిన డా॥ మాదిరాజు రామలింగేశ్వరరావు , సోమంచి రామం , డా॥ రేపర్ల జనార్ధనరావు , మల్లాది సూరిబాబు , డా॥ కాజ లక్ష్మీనరసింహారావు మరియు కె.వి నాయుడుగార్ల సలహాలు నాకు ప్రోత్సాహాన్ని యిచ్చాయి.

విక్రమ్ పబ్లిషర్స్ (విజయవాడ) అధినేత శ్రీ జి.యస్. రావుగారు కవరు పేజీని అందంగా తీర్చిదిద్ది అందించారు.

'నైతిక మానవతా విలువల అధ్యయన కేంద్రం' (E.H.V.L. Centre) కార్యనిర్వాహక కమిటీవారు ఈ పవిత్ర ఉద్యమానికి అండగా నిలిచి ప్రోత్సహిస్తున్నారు.

ఇంకా... ఇంకా... ఎందరో మహానుభావుల సలహాలు మరియు ఎన్నో రచనలు ఈ ప్రయత్నానికి తోడ్పడినాయి.

ఈ మహత్తర ప్రయత్నానికి తోడ్పడినవారందరికీ నా కృతజ్ఞతాభివందనములు.

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు, నాలో కలిగించిన ప్రేరణ, అనుగ్రహించిన ఆశీస్సుల ఫలితమే ఈ **'నీతిసుధానిధి'**. ఆ మహనీయునికి నా శతకోటి ప్రణామములు.

ధన్యవాదములు

(కొమరగిరి కృష్ణమోహనరావు)
వ్యవస్థాపకులు : E.H.V.L CENTRE
ఎడిటర్ 'శ్రీవాణి'

మచిలీపట్నం,
ది. 20-7-2002.

విషయసూచిక

ప్రార్థనా శ్లోకములు - గీతములు

1.	వందేమాతరం	3
2.	జనగణమన	4
3.	మా తెలుగుతల్లి	6
4.	ఏ దేశమేగినా....	7
5.	ప్రార్థన	8
6.	విఘ్నేశ్వర ధ్యానము	9
7.	సరస్వతీ ధ్యానము	10
8.	దైవ ప్రార్థన	11
9.	గురు ప్రార్థన	12
10.	మహ్మదీయ ప్రార్థనా శ్లోకములు	13
11.	క్రైస్తవ ప్రార్థనలు	14
12.	ప్రతిజ్ఞ	16

నీతిశ్లోకములు - పద్యములు

1.	విద్య - వినయం	19
2.	విద్యయే అలంకారము	20
3.	విద్యలేనివారు శోభించరు	21
4.	కొబ్బరిచెట్టు	22
5.	ఉపకారం - అపకారం	23
6.	దుర్జనుడు	24
7.	మిత్రుడి లక్షణాలు	25
8.	తేనెటీగ వలె....	26

9. మహనీయులు 27
10. కార్యశూరులు 28

హితోక్తులు

1. మాతృభక్తి 31
2. పితృభక్తి 35
3. గురుభక్తి 38
4. ఐకమత్యము 44
5. పట్టుదల 46
6. స్నేహం 48
7. సోమరితనం 51
8. పరోపకార బుద్ధి 53
9. దూరదృష్టి 55
10. వివేకం - విచక్షణ 58

మహనీయులు - త్యాగశీలురు

1. మహాత్మా గాంధీజీ 63
2. బాబూ రాజేంద్ర ప్రసాద్ 66
3. పండిత జవహర్‌లాల్ నెహ్రూ 68
4. టంగుటూరి ప్రకాశం పంతులు 72
5. భగత్సింగ్ 75
6. కందుకూరి వీరేశలింగం 78
7. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు 82
8. లాల్‌బహుదూర్ శాస్త్రి 85
9. వల్లభాయ్ పటేల్ 89
10. డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య 92



ప్రార్థనా శ్లోకములు - గీతములు

వందేమాతరం

వందేమాతరం!.... వందేమాతరం !....
సుజలాం సుఫలాం మలయజ శీతలామ్
సస్య శ్యామలాం మాతరం ॥ వందేమాతరం ॥ 1

శుభ్రజ్యోత్స్నాం పులకిత యామినీం
పుల్ల కుసుమిత ద్రుమదల శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం ॥ వందేమాతరం ॥ 2


కోటి కోటి కంఠ కలకల నినాద కరాలే
కోటి కోటి భుజైర్ధృత ఖరకరవాలే
అబలా కేనో మాఁఎతో బలే
బహుబల ధారిణీం నమామి తారిణీం
రిపుదల వారిణీం మాతరం ॥ వందేమాతరం ॥ 3

తుమి విద్యా తుమి ధర్మ
తుమి హృది తుమి మర్మ
త్వం హి ప్రాణాః శరీరే
బాహుతే తుమి మాఁ శక్తి
హృదయే తుమి మాఁ భక్తి
తోమారయి ప్రతిమాగడి మందిరే మందిరే ॥ వందేమాతరం ॥ 4
త్వం హి దుర్గా దశప్రహరణధారిణీ
కమలా కమలదళ విహారిణీ
వాణీ విద్యాదాయినీ, నమామిత్వాం, నమామి కమలాం
అమలాం, అతులాం, సుజలాం, సుఫలాం, మాతరం ॥ వందేమాతరం ॥ ...5

శ్యామలాం, సరలాం, సుస్మితాం, భూషితాం
ధరణీం, భరణీం, మాతరం ॥ వందేమాతరం ॥ ...6

- బంకించంద్ర చటర్జీ

జనగణమన గీతము




జనగణమన అధినాయక జయ హే
భారత భాగ్యవిధాతా
పంజాబు సింధు గుజరాత మరాటా
ద్రావిడ ఉత్కళ వంగా
వింధ్య హిమాచల యమునా గంగా
ఉచ్ఛల జలధి తరంగా
తవ శుభ నామే జాగే
తవ శుభ ఆశిష మాగే
గాహే తవ జయ గాథా
జనగణ మంగళ దాయక జయ హే
భారత భాగ్య విధాతా
జయ హే జయ హే జయ హే
జయ జయ జయ జయ హే ...1

అహర హతన ఆహ్వాన ప్రచారిత
శుని తవ ఉదారవాణీ
హిందూ బౌద్ధ సిఖ జైన పారసిక
ముసల్మాన క్రిస్తానీ
పూరబ పశ్చిమ ఆసే
తవ సింహాసన పాసే
ప్రేమహార హయగాథా
జనగణ ఐక్య విధాయక జయ హే
భారత భాగ్య విధాతా ॥జయ హే॥ ...2

పతన అభ్యుదయ బంధుర పంథా
యుగ యుగ ధావిత యాత్రీ
తుమి చిర సారథి తవరథ చక్రే
ముఖరిత పథ దిన రాత్రీ

దారుణ విప్లవ మాఘే
తవ శంఖ ధ్వని బాజే
సంకట దుఃఖ త్రాతా
జనగణ పథ పరి చాయక జయ హే
భారత భాగ్య విధాతా ॥జయ హే॥ 3



ఘోర తిమిర ఘన నిబిడ నిషేధే
పీడిత మూర్ఛిత దేశే
జాగృత భిలతవ అవిచల మంగళ
నతనయనే అనిమే షే
దుస్వప్నే అతంకే
రక్షాకరివే అంకే
స్నేహమయీ తుమి మాతా
జనగణ దుఃఖ త్రాయక జయ హే
భారత భాగ్య విధాతా ॥జయ హే॥ 4

రాత్రి ప్రభాతిల ఉదిల రవిచ్ఛవి
పూర్వ ఉదయగిరి భాలే
గాహే విహగమ పుణ్య సమీరణ
నవ జీవన రస ఢాలే
తవ కరణారుణ రాగే
నిద్రిత భారత జాగే
తవ చరణే నత మాథా
జయ జయ జయ హే జయ రాజేశ్వర
భారత భాగ్య విధాతా ॥జయ హే॥ 5

- 'విశ్వకవి' రవీంద్రనాధ టాగోర్

మా తెలుగు తల్లి

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్నతల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి
గలగలా గోదారి కదలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుపులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొర్లుతాయి
అమరావతి నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై నిఖిలమై నిలచియుండేదాక
రుద్రమ్మ భుజశక్తి! మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి! కృష్ణరాయలకీర్తి!
మా చెవులు రింగుమని మారుమ్రోగేదాక
నీ పాటలే పాడుతాం నీ ఆటలే ఆడుతాం

జై తెలుగుతల్లి! జై తెలుగుతల్లి!

- శంకరంబాడి సుందరాచార్య

ఏ దేశమేగినా....

ఏ దేశ మేఁగినా, ఎందుఁగాలిడినా
ఏ పీఠ మెక్కినా, యెవ రెదు రయిన
పొగడరా, నీ తల్లి భూమి భారతిని
నిలుపరా, నీ జాతి నిండు గౌరవము
లేదురా యిటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి పౌరు లింకెందు

ఏ పూర్వపుణ్యమో, ఏ యోగబలమొ,
జనియించినాడ వీస్వర్గలోకమున
ఏ మంచిపూవులన్ ప్రేమించినావొ
నిను మోసె నీ తల్లి కనక గర్భమున
సూర్యుని వెలుతురు సోకునందాక
ఓడల జెండాలు ఆడునందాక
నరుడు ప్రాణాలతో నడుచునందాక
అందాక గల యీ యనంతభూతలిని
మనభూమి వంటి కమ్మని భూమి లేదు

వెలిగిన దీ దివ్య విశ్వంబు పుత్ర
దీపించె నీ పుణ్య దేశంబు పుత్ర;
అవమానమేలరా, అనుమాన మేల
భరతపుత్రుఁడ నంచు భక్తిలోఁ బలుక

- రాయప్రోలు

ప్రార్థన

"అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ"

చెడునుండి నన్ను మంచిని చేర్చుము. అజ్ఞానము (చీకటి) నుండి నన్ను జ్ఞానము (వెలుగు)ను చేర్చుము. మృత్యువు నుండి నన్ను మోక్షమును చేర్చుము.

"ఓ దేవదేవా! నన్ను చెడుపనులకు ప్రోద్బలం చేయకుము. మంచిపనులు చేయడానికి శక్తిని ప్రసాదించుము, చీకటిలో పడి కొట్టుమిట్టాడుకుంటున్న నన్ను వెలుగులోనికి తీసుకొని రమ్ము. మృత్యుముఖం లోపడి నరకయాతనలు అనుభవిస్తున్న నాకు మోక్షమును ప్రసాదించుము" అని ప్రతి నిత్యమూ ప్రాతఃకాలమున భగవంతుని ప్రార్థించవలెను.



విఘ్నేశ్వర ధ్యానము

"శుక్లాంబరధరం విష్ణుం, శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్నవదనం ధ్యాయేత్, సర్వ విఘ్నోపశాన్తయే"

తెల్లని వస్త్రములను ధరించినవాడును, అంతటా వ్యాపించిన చంద్రుని కాంతివంటి తెల్లని కాంతి కలవాడును, నిర్మలమైన, స్వచ్ఛమైన ముఖము గలవాడు నగు విఘ్నేశ్వరుని సమస్త విఘ్నములు నశించుట కొఱకు ధ్యానము చేయవలెను.

"అగజాననపద్మార్కం, గజాననమహర్నిశమ్
అనేకదన్తం భక్తానాం, ఏకదన్తముపాస్మహే"

హిమవత్పర్వతము యొక్క పుత్రికయగు పార్వతీదేవి యొక్క పద్మమువంటి ముఖమునకు సూర్యునివలె సంతోషమును కలిగించు వాడును, భక్తులకు అనేక వరములను యిచ్చువాడును, ఒకే దంతము కలవాడునగు ఆ వినాయకుని పగలు, రాత్రియును (ఎల్లప్పుడునూ) సేవింతును.



సరస్వతీ ధ్యానము

"సరస్వతి! నమస్తుభ్యం
వరదే! కామరూపిణి!
విద్యారంభం కరిష్యామి
సిద్ధిర్భవతు మే సదా."

"ఓ సరస్వతీదేవీ! నీ కొఱకు నమస్కారము, వరములు యిచ్చెడిదానా! చక్కని రూపము గలదానా! విద్యను ప్రారంభించుటను చేయుదును. నాకు ఎల్లప్పడూ ఈ విద్య సిద్ధించుట అగుగాక!".

"పద్మపత్రవిశాలాక్షీ పద్మకేసరవర్ణినీ
నిత్యం పద్మాలయా దేవీ సా మాం పాతు సరస్వతీ"

పద్మము యొక్క రేకులవలె విశాలమైన కన్నులు కలదియును, పద్మము యొక్క కేసరములవంటి పసుపుపచ్చని రంగు కలదియును, పద్మమే నివాసముగా కలదియును, దేవతయునగు ఆ సరస్వతి ఎల్లప్పడూ నన్ను రక్షించుగాక!



దైవ ప్రార్థన

"త్వమేవ మాతాచ పితా త్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవదేవ."

"ఓ దేవ దేవా! నీవే తల్లివి, నీవే తండ్రివి, నీవే బంధువు, నీవే స్నేహితుడవు, నీవే నా చదువు, నీవే నా ధనము, నీవే నా సర్వము"

"నీవే తల్లివి తండ్రివి
నీవే నా తోడు నీడ నీవే సఖుఁడౌ
నీవే గురుఁడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా!"

"ఓ కృష్ణా! నిజముగా నాకు తల్లిదండ్రులును, సోదరులును, మిత్రుడును, గురుడును, దైవమును, ప్రభువును, దిక్కును అన్నిటికి నీవే, నా కితరులు ఆధారము లేదు."



గురు ప్రార్థన

"గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః
గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా
తస్మై శ్రీ గురవేనమః"

"గురువు బ్రహ్మదేవుడు, గురువు విష్ణువు, గురువు దేవుడగు ఈశ్వరుడు, గురువు ప్రత్యక్షముగానున్న ఆ పరమాత్మయే. అటువంటి తేజోవంతుడగు గురువు కొఱకు నమస్కారము".

"అజ్ఞానతిమిరాన్ధస్య
జ్ఞానాంజనశలాకయా
చక్షురున్మీలితం యేన
తస్మై శ్రీ గురవేనమః॥"

"అజ్ఞానము అను చీకటి యందు గ్రుడ్డివాని వలె వున్న నా యొక్క కన్ను 'జ్ఞానము' అను కాటుక పుల్లతో ఏ గురువుచే తెరిపింపజేయబడినదో, అటువంటి తేజోవంతుడగు గురువు కొఱకు నమస్కారము".

సూరయె ఫాతిహా

(మహమ్మదీయ ప్రార్థనా శ్లోకములు)

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

అమిత దయగలవాడును, ప్రేమించు వాడును అయిన అల్లాః పేరుతో

అల్హాందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్

సమస్త స్తోత్రములు అల్లాః కొరకే, ఆయన సర్వలోకములను పాలించు ప్రభువు

అర్రహామా నిర్రహీమ్

అమిత దయగలవాడును, ప్రేమించువాడును

మాలికి యౌమి ద్దీన్

తీర్పు దినమునకు సర్వాధికారి

ఇయ్యాక నఆబుదు వఇయ్యాక నస్తయీన్

మేము నిన్నే ఆరాధిస్తాము, సహాయం కొరకు నిన్నే అర్థిస్తాము

ఇహ్దినస్ సిరాతల్ ముస్తఖీమ్

మాకు సన్మార్గమును చూపుము

సిరాతల్ లజీన అన్ అమ్త అలైహిమ్

ఎవరిపైనయితే నీవు అనుగ్రహించి బహుమతులు కురిపించినావో

గైరిల్ మగ్జూబి అలైహిమ్, వలజ్జాల్లీన్ - ఆమీన్

ఎవరిపైనయితే నీ ఆగ్రహం వర్షించలేదో, మరెవరైతే మార్గ భ్రష్ఠులు కాలేదో వారి మార్గమును చూపుము - ఆమీన్ (తథాస్తు)



క్రైస్తవ ప్రార్థనలు

Lord, make me a channel of your **PEACE;**
Where there is hatred, let me sow **LOVE;**
Where there is injury, **PARDON;**
where there is doubt, **FAITH;**
whre there is despair, **HOPE;**
where there is darkness, **LIGHT;**
and where there is sadness, **JOY;**
O Master, grant that I may never seek
so much to be consoled as to console;
to be understood as to understand;
to be loved as to love with all my soul.
For it is in giving that we receive,
it is in pardoning that we are pardoned,
and it is in dying that we are born
to eternal life

- ST. FRANCIS

What a friend we have in jesus,
All our sins and griefs to bear !
What a privilege to carry
Everything to God in prayer !
O what peace we often forfeit,
O What needless pain we bear,
All because we do not carry
Everything to God in prayer !

Have we trails and temptations?
Is there trouble anywhere?
We should never be discouraged :
Take it to the lord in Prayer.
Can we find a friend so faithful,
Who will all our sorrows share?
Jesus knows our every weakness;
Take it to the Lord in prayer.

Are we weak and heavy - laden,
Cumbered with a load of care?
Jesus only is our refuge:
Take it to the Lord in Prayer.
Do thy friends despise, forsake thee ?
Take it to the Lord in prayer;
In His arms He'll take and shield thee;
Thou wilt find a solace there.

- JOSEPH SCRIVEN, 1820-'86

ప్రతిజ్ఞ

భారతదేశము నా మాతృభూమి, భారతీయులందరు నా సహోదరులు.


నేను నా దేశమును ప్రేమించుచున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణము. దీనికి అర్హుడనగుటకై సర్వదా నేను కృషి చేయుదును.

నా తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, పెద్దలందరిని గౌరవింతును. ప్రతివారితోను మర్యాదగా నడచుకొందును.

నా దేశముపట్లను, నా ప్రజలపట్లను సేవానిరతి కలిగి యుందునని ప్రతిజ్ఞ చేయుచున్నాను.

వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందమునకు మూలము.

భారతమాతాకీ జై!



నీతి శ్లోకములు - పద్యములు

విద్య - వినయం

"విద్యా దదాతి వినయం, వినయాత్ యాతి పాత్రతామ్
పాత్రత్వాత్ ధనమాప్నోతి, ధనాద్ధర్మం తతః సుఖమ్."

"విద్య వినయమును యిచ్చుచున్నది. అట్టి వినయము వలన యోగ్యతను లేక అర్హతను పొందుచున్నాడు. అట్టి యోగ్యత వలన ధనము (ఐహికసంపద)ను పొందుచున్నాడు. అట్టి సంపదవలన ధర్మమును, అట్టి ధర్మమువలన సుఖమును, ఆనందమును పొందుచున్నాడు".

'విద్యా వినయ సంపన్నః" అని మన పెద్దలు ఏనాడో చెప్పారు. విద్యా వినయములు రెండూ కలిగి ఉన్నవాడే రాణిస్తాడు, అభివృద్ధిలోనికి వస్తాడు. పూర్వకాలమున 'విద్య'ను నేర్చుకోవడానికి వెళ్ళేవాడికి "వినేయుడు" అని పేరు ఉండేది. అనగా వినయమును అభ్యసించేవాడని అర్థం. కనుక ప్రతి విద్యార్థి, విద్యతో పాటు విధిగా వినయమును కూడా అలవరచు కోవాలి.

"వినయము" (Humility) అంటే ఏమిటి? అణకువ, నమ్రత అని చెప్పుకోవచ్చును. ఈ వినయం ఉంటే అర్హత, యోగ్యత (Eligibility) లభిస్తుంది. దాని వలన ఐహిక సంపద (ధనము)ను పొందవచ్చును. అట్టి సంపదను దుర్వినియోగపరచక దానధర్మాలు చేయాలి. అనగా దాతృత్వబుద్ధిని అభివృదిపరచుకోవాలి దానినే Charity అంటారు. ఈ దాతృత్వబుద్ధి వలన మన Credibility పెరుగుతోంది. అనగా నమ్మదగిన మనిషి అని పేరుప్రతిష్ఠలు వస్తాయి. సమాజంలో గౌరవమర్యాదలు లభిస్తాయి. దానివలన మనం సుఖమును, ఆనందమును పొందుతాము. కనుక "Humility, Eligibility, Charity, Credibility" - ఈ నాలుగు సద్గుణములను ప్రతి ఒక్కరూ, ముఖ్యముగా ప్రతి విద్యార్థి పెంపొందించుకోవాలి, ఆచరణలో పెట్టాలి. అప్పుడే విద్యార్థి రాణిస్తాడు.

"విద్య యొసగును వినయంబు వినయమునను
బడయు బాత్రత, పాత్రత వలన ధనము
ధనము వలనను ధర్మంబు దాని వలన
ఐహికాముష్మిక సుఖంబులందు నరుడు".

విద్యయే అలంకారము

"సుందరోఽపి సుశీలోఽపి, కులీనోఽపి మహాధనః
శోభతే న వినా విద్యాం, విద్యా సర్వస్య భూషణమ్"

"అందమైనవాడైననూ, మంచి శీలవంతుడైననూ, మంచి వంశమున జన్మించినవాడైననూ, మహా ధనవంతుడైననూ విద్య లేకుండా ప్రకాశించడు. ఎందువలననగా విద్య అందరికీ అలంకారము".

'విద్యా విహీనః పశుః' అని చెప్పాడు భర్తృహరి. విద్యలేనివాడు వింత పశువు. విద్యలేని వాడు పశువుతో సమానం. 'పశ్యతీతి పశుః' బహిర్ దృష్టి కలది పశువు. అంతర్ దృష్టి కలవాడు మానవుడు. ఎక్కడ పచ్చగా కనిపిస్తే, అక్కడకు వెళ్ళి దానిని తినేస్తుంది పశువు. అది గడ్డా! లేక పైరా! అనే విచక్షణా జ్ఞానం దానికి ఉండదు. విద్యనభ్యసించిన మానవునికి కొద్దో! గొప్పో! విచక్షణా జ్ఞానం ఉంటుంది. అది లేనివాడు కూడా పశువుతో సమానమే. 'విద్య' అంటే కేవలం చదవటం, వ్రాయటం మాత్రమే కాదు. విచక్షణా జ్ఞానమును సంపాదించేదే సరైన విద్య. అట్టి విద్యను విద్యార్థి నేర్వాలి.

'విద్యా సర్వస్య భూషణం'. విద్యయే అందరికీ అలంకారము. భౌతికమైన అందం, వయస్సు, వంశములు కావు. ఈ భౌతిక అలంకారములు శాశ్వతం కావు. అవి కాలక్రమమున క్షీణించి, తరిగి, నశించి కాలగర్భంలో కలిసిపోతాయి. సరైన విద్య ఒక్కటే మానవునికి అలంకారము. అది ఒక్కటే సరైన భూషణం. అదే శాశ్వతమైన కీర్తి ప్రతిష్ఠలను తెచ్చి పెడుతుంది. దానికి నశింపు ఉండదు. ఒకవేళ పైపై అలంకారములను దొంగలు దొంగిలించుకొనిపోవచ్చు. కానీ శ్రమపడి శ్రద్ధతో, దీక్షతో, పట్టుదలతో అభ్యసించిన విద్యను మాత్రం ఎవరు, ఎప్పుడూ కాజేయలేరు. కనుక శాశ్వతమైన కీర్తిప్రతిష్ఠలను సముపార్జించి పెట్టేటటువంటి మంచి విద్యను శ్రద్ధగా అభ్యసించి వినయ, విధేయతలతోపాటు విచక్షణా జ్ఞానమును కూడా ప్రతి విద్యార్థి పెంపొందించుకోవాలి.

"భూషలు గావు మర్త్యులకు భూరిమయాంగదతారహారముల్
భూషిత కేశపాశమ్మృదు పుష్పసుగంధజలాభిషేకముల్
భూషలు గావు పూరుషుని భూషితుఁ జేయుఁ బవిత్ర వాణి వా
గ్భూషణమే సుభూషణము భూషణముల్ నశియించు నన్నియున్"

- భర్తృహరి

విద్య లేనివారు శోభించరు

"రూప యౌవన సంపన్నా విశుద్ధ కులసంభవాః
విద్యా హీనా నశోభన్తే నిర్గంధా ఇవ కింశుకాః"

'విద్యలేనివారు మంచిరూపము, యౌవనము కలిగియున్నప్పటికినీ, గొప్ప వంశమునందు జన్మించినప్పటికినీ, వాసన లేని మోదుగు పూవువలె శోభించరు'.

మోదుగు పూవు చూడటానికి చక్కగా, అందంగా వుంటుంది. కాని సువాసన ఏ మాత్రం ఉండదు. అట్టి వాసన లేని పూవును ఏ స్త్రీ పెట్టుకోవడానికి ఇష్టపడదు. అదేవిధంగా మేడిపండు పైకి చూడటానికి నిగనిగలాడుతుంటుంది. పొట్ట విప్పిచూస్తే పురుగులుంటాయి. అటువంటి పండును ఎవరూ తినరు గదా! అదే విధముగా పొట్టకోస్తే అక్షరంలేని మూర్ఖుని కూడా ఎవరూ ప్రేమించరు, గౌరవించరు.

ఆకర్షణీయమైన అందం, మంచిరూపం, మిసమిసలాడే వయస్సు, మంచి పేరు ప్రతిష్ఠలుగల గొప్ప వంశమున జన్మించిన ఆగర్భ శ్రీమంతుడైనప్పటికీ అసలు వుండవలసిన, విద్యే గనుక లేకపోతే అతని బ్రతుకు అడవిగాచిన వెన్నెలే అవుతుంది. అతను సమాజంలో ఏ మాత్రం గౌరవించబడడు. మేడిపండును కోసి చూచి, తినకుండా ఏ విధంగా పారవేస్తారో, అదే విధంగా విద్యలేని ఈ మన్మధుణ్ణి ముందు ప్రేమించినా, తరువాతనైనా దూరంగా వుంచుతారు. సువాసన లేని మోదుగు పూవును ఏ విధంగా అవతల పారవేస్తారో, అదే విధంగా డొక్కశుద్ధి లేనివానిని దరికి చేరనీయరు.

మానవునికి కావల్సింది పైపై మెరుగులు కావు. సౌందర్యం కన్నా సంస్కారం మిన్న.

"మేడిపండు చూడ మేలిమై ఉండును
పొట్ట విప్పిచూడ పురుగులుండు
పిరికివాని మదిని బింకమీలాగురా
విశ్వదాభిరామ వినురవేమా!"

కొబ్బరిచెట్టు

"ప్రథమవయసి పీతం తోయమల్పం స్మరన్తః
శిరసి నిహితభారా నారికేళా నర్దాణాం
సలిల మమృతకల్పం దద్యురాజీవితాన్తం
న హి కృతముపకారం సాధవో విస్మరన్తి".

"చిన్నప్పుడు తనకు మనుజుడు పోసిన క్రొద్దినీటిని త్రాగి, ఆ మేలును మఱవనిదై కొబ్బరిచెట్టు తన నెత్తిన యెంతో బరువుగల కాయలను మోయుచు జీవిత పర్యంతమును మనుజునకు తీయని నీటిని యిచ్చుచున్నది. ఔరా! మహాత్ములు యెంతటి చిన్న ఉపకారమును గూడ మఱవక ప్రత్యుపకారపరులై యుందురు గదా!".

ఈ శ్లోకమునందు కొబ్బరిచెట్టును, సత్పురుషులతో, మహాత్ములతో పోల్చ బడింది. పొందిన మేలును మరువనివారు సత్పురుషులు. అందుకొనిన ఉపకారమును మరువక ప్రత్యుపకారము చేయువారు మహాత్ములు. చేసిన మేలును మరువనివారు కృతజ్ఞులు. చేసిన మేలును మరచేవారు కృతఘ్నులు.

మానవులు కొబ్బరిచెట్టును ఆదర్శముగా తీసుకోవాలి. అది చిన్ననాట మానవుడు పోసిన కొద్దినీటితో పెరిగి, పెద్దదైన తరువాత, ఆ మేలును మరవక, తిరిగి అమృత సమానమైన నీటిని మరియు నారికేళ ఫలములను మానవులకు అందిస్తున్నది. అయితే ఈనాటి మానవులలో మాత్రం అట్టి కృతజ్ఞత మాత్రం కనిపించటంలేదు. అట్టి కృతజ్ఞత చెట్లలో మాత్రం కనిపిస్తున్నది. తీవ్రమైన ఎండనంతనూ తామే భరిస్తూ, తమను ఆశ్రయించినవారికి చల్లటి నీడను యిచ్చి సుఖపెడుతున్నాయి చెట్లు. అందువలననే "దానమివ్వని చేయి కన్నా ఫలము నిచ్చే చెట్టు మిన్న" అన్నారు. మహాత్ములు కూడా తమ సుఖములను గురించి ఏమాత్రం ఆలోచించక, నిత్యమూ ఇతరుల కొఱకే కష్టపడుతుంటారు.

"ధీరులకు జేయు మేలది
సారంబగు నారికేళ సలిలము భంగిన్
గౌరవమును మఱి మీదట
భూరి సుఖావహము నగును భువిలో సుమతీ".

ఉపకారం - అపకారం

"ఉపకారిషు యః సాధుః
సాధుత్వే తస్య కోగుణః
అపకారిషు యః సాధుః
స సాధుః సద్భి రుచ్యతే".

తనకు ఉపకారం చేసినవారిపట్ల మంచిగా ఉండటం గొప్ప విషయమేమీకాదు. అపకారం చేసినవారియెడల స్నేహంగా వ్యవహరించడమే గొప్ప. అంటే అపకారం చేసినవారికి ఉపకారం చేయడమే గొప్ప విషయం.

పరోపకారబుద్ధి చాలా గొప్పది. అయితే ఈనాడు లోకంలో చాలామంది, ఉపకారం చేసినవారికే అపకారం తలపెడుతున్నారు. ఇంకా కొంతమంది బుద్ధిమంతులు మాత్రం తమకు ఉపకారం చేసినవారికి తిరిగి ఏదో రూపంలో ఉపకారం చేస్తున్నారు. ఈ శ్లోకంలో ఇంకా అత్యున్నతమైన భావం ప్రతిపాదించబడింది. అపకారం చేసినవారికి కూడా ఉపకారం చేయాలని ఈ శ్లోక రచయిత ప్రతిపాదించాడు. ఇది అత్యున్నతమైన, ఆదర్శవంతమైన సిద్ధాంతం.

మేలు చేసినవానికి కీడు తలబెట్టటం అధముని లక్షణం. మేలు చేసినవానికి తిరిగి మేలు చేయడం బుద్ధిమంతుడి లక్షణం. కీడు చేసిన వానికి మేలు చేయటం ఉత్తముని లక్షణం. ఇది అత్యంత ఉత్తమ సిద్ధాంతం.

ఇదే ఆదర్శమును 'సుమతి' ఏనాడో ప్రతిపాదించాడు. దీనిని ఆచరణలో పెడితే ఎట్టి వైరుధ్యాలకు, వైషమ్యాలకు తావే ఉండదు.

"ఉపకారికి నుపకారము
విపరీతము కాదు సేయ, వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ!".

దుర్జనుడు

"వృశ్చి కశ్చ విషం పుచ్ఛం
మక్షికస్య విషం శిరః
తక్షకస్య విషం దంష్ట్రా
సర్వాంజ్గం దుర్జనే విషమ్".

తేలుకు ఒక్క తోక (కొండి)లోనే విషం ఉంటుంది. ఈగకు తలలోమాత్రమే విషం ఉంటుంది. పాముకు కోరల్లోనే విషం ఉంటుంది. కాని దుర్జనుడికి వళ్లంతా విషమే.

తేలుకు విషం ఒక్క కొండి (తోక)లోనే ఉన్నప్పటికీ, అది కుడితే, ఆ మంటకు తట్టుకోలేక ఏడుస్తారు. పాముకు విషం ఒక్క కోరలలోనే ఉంటుంది కాని, అది కాటువేస్తే ప్రాణంకూడా పోతుంది. అదేవిధంగా ఈగకు తలలో మాత్రమే విషం ఉంటుంది. కాని అది కుడితే అంటువ్యాధులు వ్యాపిస్తాయి. ఈ మూడింటిలో విషం ఒకే ఒక చోటనే ఉన్నప్పటికీ, వాటి వలన ప్రజలకు ఎంతో హాని జరుగుతున్నది. కాని వళ్ళంతా విషం ఉన్న దుర్జనుని వలన, ప్రజలకు ఇంకా ఎంత హాని చేకూరుతుందో!

'కామం' అనే ఒకే ఒక దుర్గుణం ప్రవేశించడంవలన తనతోపాటు తన వంశాన్నే నాశనం గావించుకున్నాడు, అంతటి శక్తివంతుడైన రావణాసురుడు. పంచభూతములను వశం చేసుకొనిన హిరణ్యకశిపుడు 'క్రోధం' అనే ఒకే ఒక దుర్గుణంతో సర్వనాశనం అయినాడు. 'లోభం' అనే ఒకే ఒక దుర్గుణంతో తన కుటుంబాన్నే సర్వనాశనం చేసుకొనినాడు 'దుర్యోధనుడు'. కాని ఈనాడు కలియుగంలో ఈ మూడు దుర్గుణాలు ఒకే ఒక మనిషిలో కూడుకొని ఉన్నాయి. అట్టి దుర్జనుడు ఒక్కడుంటేచాలు. పరిసరాల వాతావరణం అంతా కలుషితమవుతుంది. అందువలననే మన పెద్దలు 'దుర్జనం దూరతస్త్యజేత్' అన్నారు. అట్టి దుర్జనులకు ఎంత దూరంగా వుంటే అంత మంచిది. ముఖ్యంగా విద్యార్థులు చెడ్డవారితో సహవాసం చేయరాదు.

"తలనుండు విషము ఫణికిని
వెలయుంగాఁ దోకనుండు వృశ్చికమునకుం
దల దోక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!"

మిత్రుడి లక్షణాలు

"పాపాన్నివారయతి యోజయతే హితాయ
గుహ్యం నిగూహతి గుణాన్ ప్రకటీ కరోతి
ఆపద్గతం చ న జహాతి దదాతి కాలే
సన్మిత్ర లక్షణమిదం ప్రవదన్తి సన్తః".

పాపపు పనులనుండి మఱల్చుట, మంచిపనులు చేయుటకు పురిగొల్పుట, రహస్యమును దాచుట, మంచిగుణములను వెల్లడిచేయుట, ఆపద కలిగినప్పుడు కూడా విడచిపోకుండుట, లేనప్పుడు అవసరమైనదానినిచ్చుట - మొదలైనవి మిత్రుడి లక్షణములు.

"మాతా మిత్రం పితా చేతి స్వభావాత్రి తయం హితం" తల్లిదండ్రుల తరువాత, సహజంగా ప్రేమించుచూ మేలుకోరేవాడు మిత్రుడే. అటువంటి ప్రాణస్నేహితుడు అందరికీ లభ్యం కావటం చాలా కష్టం. అభివృద్ధిలో ఉన్నప్పుడు, సకల సంపదలతో విలసిల్లుతున్నప్పుడు, భోగభాగ్యములతో తులతూగుతున్నప్పుడు చాలా మంది చుట్టూ చేరుతారు.

ఎప్పుడు చెరువులో నీరు సమృద్ధిగా వస్తుందో, అప్పుడు కప్పలు అనేకం చేరుతాయి. అదేవిధముగా సిరిసంపదలు ఎప్పుడు వస్తాయో అప్పుడు బంధువులమని, మిత్రులమని చెప్పి చుట్టూ చేరుతారు. చెరువులో నీరు ఎండిపోతే, ఒక్క కప్ప కూడా కనిపించదు. అదేవిధముగ సంపదలు కరిగిపోయినప్పుడు ఎవరూ కనిపించరు.

అసలైన మిత్రులే అండగా నిలిచి, ఆదుకుంటారు.

"అఘమువలన మఱల్చు హితార్థకలితుఁ
జేయు గోప్యంబు దాచుఁ బోషించు గుణము
విడువఁ డాపన్నులేవడి వేళనిచ్చు
మిత్రుడీ లక్షణంబుల మెలుగుచుండు".

- ఏనుగు లక్ష్మణ కవి

తేనెటీగవలె...

"పుస్తకేషు చ యా విద్యా
పరహస్తే చ యద్ధనం
సమయేతు పరిప్రాప్తే
న సా విద్యా న తద్ధనమ్".

"పుస్తకములోని విద్య, ఇతరులదగ్గర దాచి పెట్టిన ధనం సమయానికి అక్కరకు రావు. వీటివల్ల ప్రయోజనం ఉండదు. కనుక విద్య కంఠస్థమై ఉండాలి. ధనం ఎప్పుడూ తన దగ్గరే ఉండాలి".

"పుస్తకముల నిండ మస్తుగా చదువుండ, మస్తకముల నిండ మట్టియుండె! "అని అని చమత్కరించారు శ్రీ సత్యసాయిబాబావారు. కేవలం పుస్తకజన్యజ్ఞానం వలననే ప్రయోజనంలేదు. అనుభవజ్ఞానమును సంపాదించాలి. వివేకజ్ఞానమును అభివృద్ధి పరచుకోవాలి. విచక్షణా జ్ఞానమును పెంపొందించుకోవాలి.

అనుభవజ్ఞులు వ్రాసిన పుస్తకాలను ఏకాగ్రతతో చదవాలి. చదివిన విషయాలను చక్కగా అర్థం చేసుకోవాలి. అర్థంచేసుకొనిన విషయాలను కంఠస్తం చేయాలి. అప్పుడు పుస్తకంలోని విద్య మస్తకంలో శాశ్వతంగా నిలిచిపోతుంది. ఒకవేళ ఆ పుస్తకం చినిగిపోయినా, ఎవరైనా సంగ్రహించినా ఫరవాలేదు. అయితే ఈనాటి విద్యార్థులు పాఠ్య పుస్తకాలను సమగ్రంగా చదివి, అవగాహన చేసుకోవటంలేదు. కేవలం 'గైడ్స్' మీదనే ఆధారపడుతున్నారు.

తాను సంపాదించిన ధనం తాను అనుభవించక, దానం చేయక దాచుకుంటే, తేనెటీగ చందమే అవుతుంది. కనుక తాను సంపాదించిన ధనంలో కొంత దానం చేయాలి. మరికొంత తన అవసరాలకు ఉంచుకోవాలి. అదే విధముగ విద్యా ధనమును పుస్తకములో కాక, మస్తకంలో భద్రం చేసుకోవాలి. అది ఎప్పుడు కావల్సిన అప్పుడు ఉపయోగపడుతుంది. సమయానికి ఉపయోగపడని విద్య, ధనం ఎంతవుండి ఏమి ప్రయోజనం?

"ధనము కూడబెట్టి దానంబు చేయక
తానుతినక లెస్సదాచుకొనగ
తేనెటీగ గూర్చి తెరుపరి కీయదా
విశ్వదాభిరామ వినురవేమ!"

మహనీయులు

"యథా చిత్తం తథా వాక్య తథా క్రియా
చిత్తే వాచి క్రియాయాం చ సాధూనా మేక రూపతా"

'తాను తలచిన విధముగ చెప్పట, చెప్పిన విధముగ ఆచరించుట - ఈ ప్రకారముగ మనస్సునందు, వాక్కునందు, క్రియయందు ఒకే రూపము కలిగియుండుట మహనీయుల లక్షణము.

మహాత్ములు ఒక విషయమును సంకల్పించుకొని, దానిని మాటల ద్వారా చెప్పి, చెప్పిన దానిని చేసి చూపించుతారు. 'తలచింది చెప్పటం, చెప్పింది చేయటం' అనేది చాలా కష్టమైన విషయం. అది యెంతటి మహాత్ములకో గాని సాధ్యపడదు. అయితే ఈనాడు చాలామంది తద్విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. తలచింది చెప్పరు, చెప్పింది చేయరు. పైకి మంచిగా తీయని కబుర్లు చెబుతుంటారు. ఆప్యాయతను ప్రదర్శిస్తుంటారు. మనసులో ఒకటి, మాటలలో మరొకటి, చేతలలో ఇంకొకటి. ఈనాడు చాలామంది ఇట్టి 'త్రిపాత్రాభినయం' చేస్తూ కాలం గడుపుతున్నారు. ఇటువంటివారు సమాజం పాలిటి 'చీడపురుగులు'.

"మనసు, మాట, నడత మనిషికి ఒకటైన, మనిషి కాదు వాడు మహితుడౌను". మనసులోని ఆలోచన, మాట్లాడే మాట, నడిచే నడత - ఈ మూడూ ఒకటిగా వున్నవాడే మహాత్ముడు. మన మాటలకు, మన చేతలకు మూలం మన ఆలోచనలే గదా! కాబట్టి మన ఆలోచనలు సదాలోచనలు కావాలి. మనసులోని యోచన, మాటలోని సూచన, క్రియలోని ఆచరణ - ఈ మూడు ఏకం కావాలి. దీనినే 'త్రికరణశుద్ధి' అంటారు. అయితే ఈనాడు మానవులలో అట్టి 'త్రికరణశుద్ధి' కనిపించటంలేదు. 'త్రిపాత్రాభినయం' మాత్రం కనిపిస్తున్నది.

ఈనాడు మనసులో ఒకటి పెట్టుకొని, మాట మరొకటి మాట్లాడుతున్నారు. చేసే పని మరొక విధంగా ఉంటున్నది. ఈ విధంగా నటన చేసేవారికి 'ముక్తి' ఎలా లభిస్తుంది?

"మాటలాడుటొకటి మనసులో నొక్కటి
ఒడలి గుణము వేరె యోజ వేరె
ఎట్లు గల్గు ముక్తి యీలాగు తానుండ
విశ్వదాభిరామ వినురవేమ".

కార్యశూరులు

"అనారంభో హి కార్యాణాం
ప్రథమం బుద్ధి లక్షణం
ప్రారబ్ధ స్యాంతగమనం
ద్వితీయం బుద్ధి లక్షణమ్".

అసాధ్యమైన పని ఏదైనా అసలు మొదలుపెట్టకుండా ఉండటమే మంచిది. ఒక వేళ అలాంటి పని ప్రారంభిస్తే, అది పూర్తిగా నెరవేరేదాకా గట్టిగా ప్రయత్నం చేయటం ఇంకా మంచిది.


ఏదైనా మంచి పని ప్రారంభించేముందే, దాని మంచిచెడ్డలను చక్కగా విచారణ (Enquiry) చేయాలి. తరువాత పరిశీలన (Investigation) చేయాలి. చక్కగా ఆలోచించి మొదలుపెట్టడం విజ్ఞుల లక్షణం. ఎవరు, ఏది చెబితే తొందరపడి ఆ పనిని ప్రారంభించడం ఏ మాత్రం విజ్ఞత అనిపించుకోదు. ఒకవేళ ఏ కార్యమునైనా ప్రారంభించిన, దాని లక్ష్యం చేరుకునేంతవరకూ విశ్రమించరాదు. అది ఎంతటి కష్టమైన పని అయినప్పటికినీ, తమ శక్తి సామర్థ్యములచేత, పట్టుదలతో ఆ పనిని సాధించగలుగుతారు కార్యశూరులు.

అయితే ఇంకా కొంతమంది మాత్రం పనిని ప్రారంభించిన నాటి నుంచి, అది జరుగు తుందా? లేదా? అనే సంశయంతోనే ప్రారంభిస్తారు. 'సంశయాత్మా వినశ్యతి' అన్నది భగవద్గీత. ఆ విధంగా సంశయాలతో ప్రారంభించబడిన కార్యం మధ్యలోనే ఆగిపోతుంది. అందు వలన సంశయములతో కార్యం ప్రారంభించడం కంటే, అసలు ప్రారంభించకపోవటమే మంచిది.

కనుక తలపెట్టిన ఏకార్యమునైనా సాధించేంతవరకు విశ్రమించరాదు. అయితే కొందరు అధములు విఘ్నములు కలుగుననే భయంచేత అసలు కార్యమునే ప్రారంభించరు. మధ్యములు కార్యమును ప్రారంభించి, విఘ్నములు కలిగినప్పుడు దానిని మధ్యలోనే విడిచిపెడతారు. ధైర్య, శీల, గుణ సంపన్నులు మాత్రం, ప్రారంభించిన కార్యమును, ఎన్ని విఘ్నములు సంభవించినప్పటికినీ, ఏ మాత్రం వెనుకంజ వేయక ఆ కార్యమును సాధించి తీరుతారు.

"ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాస సంత్రస్తులై
యారంభించి పరిత్యజింతురురువిఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్న నిహన్య మానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ! ప్రజ్ఞానిధుల్ గావునన్"

- ఏనుగు లక్ష్మణ కవి



హితోక్తులు

మాతృభక్తి

'మాతృ దేవోభవ!' అని మన శాస్త్రాలు చెబుతున్నాయి. తల్లికి మించిన దైవము లేదని మన పెద్దలు చెబుతున్నారు. మనిషిని సృష్టించేది దేవుడే అయినా, నవమాసాలు, మోసి కనిపెంచేది **'అమ్మ'** మాత్రమే. అందువలననే తల్లిని **'మాతృదేవత'** అన్నారు.

ధర్మము మూర్తీభవించిన శ్రీరాముని తీర్చిదిద్దింది తల్లి కౌసల్యే. లవకుశులు వీరులుగా, శూరులుగా, పరాక్రమశాలులుగా తయారైనది తల్లి సీతమ్మ శిక్షణలోనే. కాలినడకన ఆసేతు హిమచలం పర్యటించి, అద్వైత సిద్ధాంతాన్ని బోధించి, దేశ సమైక్యతను సమగ్రతను కాపాడిన ఆదిశంకరుల వారు కూడా తల్లి 'ఆర్యాంబ' వడిలోనే పెరిగి పెద్దవాడైనాడు. భారత జాతికి గర్వకారణమైన వీరుడుగా శూరుడుగా, పేరు ప్రఖ్యాతల నందుకొనిన వీరశివాజీ తన తల్లి జిజియాబాయి చేతులలోనే పెరిగి పెద్దవాడైనాడు. ఒక సామాన్య బాలునిలో నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, దేశభక్తి భావాలను నాటి, పెంచి, పోషించి గాంధీని మహాత్మునిగా రూపొందించగలిగింది ఆయన మాతృమూర్తి పుతలీబాయి. తనయుని ఒక మహాసంఘ సంస్కర్తగా తీర్చి దిద్దిన ఘనత ఒక తల్లికి దక్కింది. ఆ తల్లి తనయుడే ఈశ్వరచంద్ర విద్యాసాగర్. తల్లి భువనేశ్వరీ దేవి పెంపకంలో పెరిగి పెద్దవాడై దేశ విదేశాలలో ఖ్యాతిని సంపాదించగలిగాడు స్వామి వివేకానంద.

ప్రపంచ చరిత్రను సునిశితంగా పరిశీలిస్తే ఒక వాస్తవం తేటతెల్లమవుతున్నది. జాతి గర్వించదగిన వీరులను, శూరులను, మహనీయులను, మహాపురుషులను, ప్రవక్త లను, సంఘసంస్కర్తలను జ్ఞానులను, యోగులను రూపుదిద్దగల్గిన శిల్పులు మాతృ మూర్తులేనని స్పష్టమవుతున్నది.

మాతృభక్తి :

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో బర్మా దేశంలోని రంగూన్ పట్టణం సర్వనాశన మవుతుంది. అనేక కుటుంబాలు చెల్లా చెదరైపోతాయి. భర్తకు దూరమైన ఒక ఇల్లాలు తన ఇద్దరు బిడ్డలతో భారత దేశం వచ్చి బరంపురం చేరుకుంటుంది. పెద్ద కుమారుని వయసు ఐదు సంవత్సరాలు. చిన్నవాడి వయసు మూడు సంవత్సరాలు.

వారు భిక్షాటనకు బయలుదేరుతారు. రోజంతా భిక్షమెత్తినా వారికి కడుపు నిండదు. తిండిలేక ఆ ఇల్లాలు కొన్ని రోజులలోనే నీరసించి పోతుంది. భిక్షమెత్తే ఓపిక లేక చెట్టు క్రిందనే పడుకుంటుంది. ఆ పరిస్థితి చూసిన పెద్ద కుమారుడు ఒక్కడే భిక్షాటనకు బయలుదేరుతాడు. సంపాదించిన అన్నము తీసుకొనివచ్చి తల్లికి, తమ్ముడికి పెట్టి తాను పస్తు పడుకొనేవాడు. కొన్ని దినాలకు ఆ పిల్లవాడిలో కూడా ఓపిక నశిస్తుంది. ఒక రోజున ఒక శ్రీమంతుని ఇంటి ముందుకు వెళ్ళి *అమ్మా! ఆకలి!'* అని క్రింద పడిపోతాడు. వరండాలో కుర్చీలో కూర్చొని పత్రిక చదువుతున్న ఆ ఇంటి యజమాని వచ్చి, ఆ పడిపోయిన అబ్బాయి తలను తన ఒడిలో పెట్టుకొని నీళ్ళు చల్లుతాడు.

"బాబూ! నీకు కడుపునిండా అన్నం పెడుతానులే!" అని బ్రతిమాలాడు ఆ శ్రీమంతుడు. తెలివి వస్తుంది గాని, అతి బలహీనంగా వుండటం వలన ఆ పిల్లవాడు చెప్పే మాటలు మాత్రం స్పష్టంగా వినిపించవు. నోటి దగ్గర తన చెవిని పెట్టి వినడానికి ప్రయత్నించుతాడు. ***'అమ్మకు మొదట అన్నం'*** అని చెప్పి ఆ బాలుడు ప్రాణాలను వదిలాడు ఆ అబ్బాయి. ఆఖరి క్షణంలో కూడా తల్లిని గురించే ఆలోచించాడు. అతని మాతృభక్తి అంతటిది. కనుక ***ఎట్టి స్వార్థం లేకుండా, నవమాసాలు మోసి, కని ప్రేమతో పెంచిన తల్లిని సంతోషపెట్టటం, ఆమెను సేవించడం పిల్లల ప్రధాన కర్తవ్యం.*** దీనిని విస్మరించకండి!

మాతృప్రేమ :

అది విధ్వంస రాజకీయాలకు నిలయం బీహార్ ప్రాంతం. ఒకసారి జరిగిన ఎన్నికలలో ఇద్దరు అన్నదమ్ములు ప్రత్యర్థులుగా నిలబడుతారు. ఎన్నికల వాతావరణం వేడెక్కింది. తుపాకులతో కాల్చుకొనే స్థాయికి చేరింది. ఆ ప్రత్యర్థుల తల్లి మనసు విలవిలలాడింది. ఆ ఇద్దరిలో ఎవరు మరణించినా, ఆ తల్లికి కుమారుడే గదా! చిన్నవాడి దగ్గరకు వెళ్ళి కాళ్ళు పట్టుకుంది. పంతాలకు పోవద్దని ప్రాధేయపడింది. చిన్నవాడు కొంచం మెత్తపడ్డాడు. ఆ తల్లితో కారు ఎక్కి బయలుదేరాడు. ఈ వార్త క్షణంలో అన్నకు చేరింది. తుపాకి చేబూని తమ్ముని కాల్చడానికి సిద్ధమై నుంచున్నాడు అన్న. ఇంతలో ఆ కారు అన్నయ్య గుమ్మం ముందు ఆగింది. ముందుగా తమ్ముడు దిగాడు. తల్లిని చేయి పుచ్చుకొని దింపాడు. చిన్నవాడి నడుంచుట్టూ చెయ్యి వేసి నెమ్మదిగా నడుస్తున్నది ఆ ముసలి తల్లి. అన్న తన తమ్ముడి గుండెకు గురిపెట్టిన తుపాకి గొట్టానికి మధ్య తల్లికనిపించింది. చిన్ననాట గోరుముద్దలు తినిపించిన తల్లి చేతులు

వణుకుతున్నాయి. గతం గుర్తుకు వచ్చింది. చేతిలో వున్న తుపాకి జారి క్రిందబడింది. ఎదురుగా వచ్చి తల్లి నిలబడింది. తమ్ముడు తలవంచుకొని తల్లి ప్రక్కనే నిలబడి ఉన్నాడు. వణికే ఆమె చేతులు మెల్లగా పైకి లేచాయి. చేతులు జోడించి దీనంగా ***"నాయనా! నీ తల్లి పుత్రభిక్ష పెట్టమని అడుగుతున్నది"*** అని వణుకుతున్న గొంతుతో, కంటి ధారలు కారుస్తూ ప్రాధేయపడుతుంది. **'అమ్మా!'** అంటూ పెద్దవాడు తల్లి పాదాల మీద ఒరిగిపోయాడు. **'అన్నయ్యా!'** అంటూ చిన్నవాడు అన్నకాళ్లమీద తలపెట్టాడు. **'తమ్ముడూ!'** అంటూ కౌగిలించుకుంటాడు **'అన్న'.** ఒక్క క్షణంలో ఎంత మార్పు? ఎలా కలిగింది ఆ మార్పు? అదే మాతృప్రేమలో ఉన్న శక్తి. ప్రేమ తత్త్వానికి ప్రత్యక్ష స్వరూపం తల్లి. కనుక ఆ ప్రత్యక్షదైవమైన తల్లిని పూజించండి. మరచిపోకండి.

పుండరీకుని ఆదర్శం :

పండరీపుర పుణ్యక్షేత్రమందు 'పుండరీకుడు' అనే బాలుడుండేవాడు. చంద్రభాగానదికి వెళ్లి నీరు తెచ్చి, తల్లిదండ్రులను స్నానం చేయించి, వారిని భక్తితో పూజించడం అతని నిత్యకృత్యం. ఒకనాడు అతనిని పరీక్షించదలచి, పాండురంగడు వచ్చి, వాకిట వద్దనే నిలచి, పుండరీకుని పిలుస్తాడు. తల్లిదండ్రుల సేవలో నిమగ్నుడైయున్న పుండరీకుడు తల ఎత్తి చూడకుండానే **'మీరు ఎవరు?'** అని అడిగాడు. అప్పుడు ***"నేను పాండురంగడును. నీమీద ప్రేమతో నిన్ను అనుగ్రహించుటకు వచ్చాను. నా దర్శనం అందరికీ లభించదు. నీ కొఱకు వేచి ఉన్నాను".*** ***అని బదులు చెప్పాడు. అప్పుడు పుండరీకుడు "ఈ దీనుని కోసం యింతసేపు బురదలో నుంచున్నావు. పాపం! ఇదుగో! ఈ ఇటుక మీద కొంచం సేపు నిలుచో! నా తల్లిదండ్రులను సేవించి వస్తాను"*** అని ఒక ఇటుక విసరివేస్తాడు. చేసేదేమీ లేక భక్తుని రాకకోసం, ఆ ఇటుక మీద నుంచొని వేచి ఉన్నాడు. తల్లిదండ్రుల సేవను పూర్తి చేసుకొని, వారి అనుజ్ఞను పొంది, పండరీనాధుని దర్శించి, ఆ దేవుని అనుగ్రహానికి పాత్రుడై తరిస్తాడు పుండరీకుడు!

ఈ కథ మనకు ఒక నీతిని బోధిస్తున్నది. ***"తల్లి దండ్రులసేవలో నిమగ్నులైన వారిని, సాక్షాత్ భగవంతుడు ఆదరిస్తాడు, హర్షిస్తాడు అనుగ్రహిస్తాడు. ఈ వాస్తవాన్ని విస్మరించకండి. ప్రత్యక్ష దైవాలైన తల్లిదండ్రులను పూజించండి!"***

తల్లి చల్లని చూపులు :

మహాభారత యుద్ధం ముగుస్తుంది. ఇరుపక్షములకు చెందిన 18 అక్షౌహిణీల సైన్యం సర్వనాశనం అయిపోయింది. దుర్యోధనుని దుష్టబుద్ధి వలన వంద మంది సహోదరులు మరణిస్తారు. పుత్రశోకంతో గాంధారి, ధృతరాష్ట్రులు కుమిలి పోతుంటారు. ఒకసారి అత్త గాంధారిని పరామర్శించడానికి శ్రీకృష్ణపరమాత్మ వచ్చి *"అత్తా! క్షేమమా!"* అని అడుగుతాడు. పుత్రశోకంతో విలపిస్తున్న గాంధారి కోపోద్రిక్తురాలై *"నీకు, మేము ఇప్పుడు కనిపించామా? తద్దినం పెట్టడానికి ఒక్క కుమారుని కూడా మిగల్చకుండా నూరు మందిని పొట్టన పెట్టుకున్నావుగదా! ఇప్పుడు నీ కళ్ళు చల్లబడ్డాయా? కౌరవులంటే, ఎందుకు నీకింత వివక్షత?"* అని ప్రశ్నిస్తుంది. అప్పుడు ఆ జగన్నాటక సూత్రధారి చిరునవ్వుతో *"అత్తా! ఇందులో నా తప్పు ఏమీ లేదు. శిశువు జన్మించగానే మొట్టమొదట చూచేది తల్లే! మామ ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు కాబట్టి, భర్తకు లేని చూపు నాకెందుకని, నీవు కూడా నీ కండ్లకు నల్లటి గుడ్డను కట్టుకున్నావు. నీ నూర్గురు కుమారులలో ఎవరి ముఖమైనా, ఎప్పుడైనా చూచావా? మాతృదేవి దృష్టిని నోచుకోని వాడు, దైవ దృష్టిని ఏవిధంగా నోచుకోగలడు?"* అని సమాధానం చెబుతాడు శ్రీకృష్ణుడు.

దీనిలో మనం నేర్చుకోవలసిన 'నీతి' ఒకటున్నది. *"తల్లి చల్లని చూపును నోచుకోలేనివానికి, తల్లి ప్రేమకు పాత్రుడు కానివానికి తల్లి అనుగ్రహం లేనివానికి, దైవానుగ్రహం కూడా లభించదు"* ఈ యదార్థమును బాలబాలికలు గుర్తించాలి. కనుక తల్లి ప్రేమను పొందడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి.

తల్లులే తనయులను తీర్చి దిద్దగలుగుతారు. తన బిడ్డ గొప్పవాడు కావాలని, మంచివాడు కావాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. *తల్లికి స్వార్థం ఉండదు. పిల్లల శ్రేయస్సే తల్లి లక్ష్యం. ఆ లక్ష్య సాధనకు ప్రతి తల్లీ నిస్వార్థంగా కృషి చేస్తుంది.* కనుక తనువునిచ్చిన తల్లిని ప్రేమించి, గౌరవించి, పూజించి, పోషించడం పిల్లల కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని విస్మరించకండి.

"ఈనాటి బాలికలు రేపటి తల్లులు, బాలురు రేపటి తండ్రులు. చిన్నప్పుడు మీ తల్లిదండ్రులను గౌరవించడం నేర్చుకుంటే, రేపు మీ బిడ్డలనుండి మీరు గౌరవాన్ని పొందడానికి అర్హత సంపాదించుకుంటారు. మొక్క చిన్నదిగా వున్నప్పుడు, వంపులతో పెరిగితే పెద్దదయాక ఆ వంపులు పోతాయా? అందుకే చిన్నతనంలో ప్రవర్తన మంచిగా వుండవలెను".

- శ్రీ సత్యసాయిబాబా

పితృభక్తి

'పితృదేవోభవ' అన్నారు. తండ్రికూడా దైవంతో సమానమే. తల్లి తండ్రిని చూపిస్తుంది. తండ్రి గురువును చూపిస్తాడు. నవమాసములు మోసి, కనిపెంచిన తల్లిని ఏ విధంగా ప్రేమిస్తామో, పూజిస్తామో, అదే విధంగా, జన్మనిచ్చిన తండ్రిని కూడా గౌరవించాలి. పిల్లల అభివృద్ధికి, అనుక్షణం తాపత్రయపడే తండ్రిని మనసారా ప్రేమించాలి. వార్ధక్యంలో సకల సపర్యలు చేసి **'పితృఋణం'** తీర్చుకోవాలి పిల్లలు.

శ్రీరామచంద్రుని ఆదర్శం :

శ్రీరామచంద్రుడు పితృభక్తి పరాయణుడు, పితృవాక్య పరిపాలకుడు. పితృవాక్య పాలన పుత్రుల కర్తవ్యమని, అది అత్యంత పరమోత్కృష్టమైన ధర్మమని ఆచరణ ద్వారా నిరూపించాడు ***శ్రీరామచంద్రుడు***. తండ్రి ఆజ్ఞను శిరసావహించి, సకల రాజభోగములను విడనాడి, పదునాలుగు సంవత్సరాలు వనవాసం చేసిన ఆదర్శ పురుషుడు ***శ్రీరామచంద్రుడు***. దశరథుని మరణానంతరం, భరతుడు సపరివారంతో శ్రీరాముని కలవడానికి బయలుదేరి దండకారణ్యం వెళ్ళుతాడు. తండ్రి మరణ వార్తను చెప్పి విలపిస్తాడు భరతుడు. అయోధ్యకు తిరిగివచ్చి, రాజ్యమును పాలించమని శ్రీరాముని వేడుకుంటాడు భరతుడు. కాని శ్రీరాముడు అంగీకరించడు. ఏమి చేయాలో తోచక, భరతుడు ప్రాయోపవేశానికి పూనుకుంటాడు. అప్పుడు శ్రీరామచంద్రుడు ***"నాయనా! ప్రాయోపవేశం బ్రాహ్మణుల ధర్మం. రాజులకు అది నిషిద్ధం. నేను తండ్రి ఆజ్ఞను శిరసావహించి ఇక్కడకు (అరణ్యాలకు) వచ్చాను. ఇది నా ధర్మం. తండ్రిగారి కోరికను, ఆజ్ఞను మన్నించి, రాజ్య పాలన చేయటం నీధర్మం . కనుక ఎవరి ధర్మాన్ని వారు పాలించాలి"*** అని నచ్చజెప్పి పాదుకలు యిచ్చి, పాలన చేయమని భరతుడ్ని పంపించివేస్తాడు.

శ్రీరాముని ధర్మనిష్ట, కర్తవ్య పరాయణత్వం ఎంతటిదో, ఈ సంఘటన ఋజువు చేస్తున్నది. ఏదో విధంగా అధికారాన్ని పొందాలనే తాపత్రయం ఆయనలో ఈషన్మాత్రం కనిపించదు. రాజ్యం కన్నా, రాజ్య సుఖాల కన్నా **'ధర్మమే'**

మిన్నయని, ఆచరించి, చూపించిన ఆదర్శ ప్రాయుడు 'శ్రీరామచంద్రుడు' అంతే కాదు పిత్రాజ్ఞను శిరసావహించడం కన్నా మించిన ధర్మం వేరొకటి లేదని ప్రపంచానికి చాటిన మహనీయుడు 'రామచంద్రుడు'.

"పిత్రాజ్ఞను శిరసావహించడం పుత్రుల కర్తవ్యం" ఈ సత్యమును విస్మరించక, ప్రతి ఒక్కరూ ఆచరణ ద్వారా నిరూపించాలి.

శ్రవణ కుమారుని ఆదర్శం :

దశరధమహారాజు కోసల రాజ్యమును పాలిస్తున్న రోజులలో '**శ్రవణకుమారుడు**' అనే బాలుడు ఉండేవాడు. అతని తల్లి దండ్రులు ముసలివారే కాదు, గ్రుడ్డివారు కూడా. వారిని నిత్యమూ భక్తి శ్రద్ధలతో సేవించి, పూజించేవాడు, శ్రవణుడు. ఒకసారి ఆ ముసలి తల్లిదండ్రులు తీర్థ యాత్రలను చేయాలనే కోరికను వెలిబుచ్చుతారు. ***తల్లిదండ్రుల కోర్కెలను నెరవేర్చడం పుత్రుల కర్తవ్యం గదా!*** అయితే శ్రవణుని తల్లిదండ్రులు ముసలి వారుగదా! నడువలేరు, కండ్లు కూడా కనిపించవు. ఒకకావడి తీసుకొని వచ్చి తల్లిని ఒకవైపు, తండ్రిని మరొకవైపు కూర్చొబెట్టి, కావడి భుజాన పెట్టుకొని, తీర్థ యాత్రలకు బయలు దేరుతాడు 'శ్రవణుడు'. వారికి ఏ మాత్రం కష్టం కలిగించ కుండా, సకాలంలో ఆహార పానీయాదులను అందిస్తూ, పుణ్య తీర్థములలో స్నానంచేయిస్తూ దేశాటన చేస్తుంటాడు 'శ్రవణుడు'. తల్లిదండ్రుల యెడల అతని భక్తిశ్రద్ధలను చూచి ప్రజలు ఆశ్చర్య పడుతుంటారు. ఒకరోజు రాత్రి అడవిలో విశ్రమించ వలసి వస్తుంది. ఒక చెట్టు క్రింద సుభ్రంచేసి పడుకోపెడుతాడు. తల్లిదండ్రులకు దాహం వేస్తుంది. శ్రవణుడు ఒక ముంత తీసుకొని ప్రక్కనే ఉన్న నదికి వెళ్ళుతాడు. ఆ నదిలో ఆ కడవను ముంచుతుండగా '**బుడ...బుడ....** అనే శబ్దం వచ్చింది. అదే సమయంలో వేటకు వచ్చిన దశరథమహారాజు, ఆ శబ్దము విని, మృగం నీరు త్రాగటానికి వచ్చిందని బావించి, బాణం వదలగా, ఆ బాణం రివ్వున పోయి శ్రవణుని గుండెల్లో గ్రుచ్చుకుంటుంది. శ్రవణుడు కెవ్వున కేకపెడుతాడు. ఆకేక వినిన దశరథుడు పరుగెత్తుకొని ఆ నదీ తీరానికి వెళ్ళుతాడు. బాణం గ్రుచ్చుకొనిన శ్రవణుడు క్రిందపడి

కొట్టుకుంటుంటాడు. దగ్గరకువెళ్ళి ఆ బాలునికి సపర్యలు చేస్తాడు. కాని ప్రయోజనం ఉండదు. అవసాన దశలో వున్న శ్రవణుడు *"అయ్యా! ఈ అడవిలో ఒక చెట్టు క్రింద, నా తల్లిదండ్రులు దాహంతో బాధపడుతున్నారు మీరు వెంటనే అక్కడకు, వెళ్ళి ఈ నీరు వారికి అందించండి!"* అని చెప్పి ఆ కడవను అందించి, తల్లిదండ్రులను స్మరించుకుంటూ కన్ను మూస్తాడు శ్రవణుడు. దశరధుడు కడవను తీసుకొని వెళ్ళి, ఆ ముసలి తల్లిదండ్రులకు మంచి నీరునిచ్చి, జరిగిన విషయం చెబుతాడు. ఆ విషాధ వార్త వినిన ఆ ముసలి తల్లిదండ్రులు విలపిస్తూ *"ఏ విధంగా మేము ప్రాణాలను ఈనాడు విడువబోతున్నామో! అదేవిధంగా భవిష్యత్తులో నీవు కూడా పుత్రశోకంతో మరణిస్తావు"* అని అంటూ శ్రవణుని తల్లిదండ్రులు కన్నుమూస్తారు. ఆ తరువాత కొంతకాలానికి పుత్ర శోకంతోనే మరణిస్తాడు *'దశరథుడు'*.

తల్లిదండ్రుల సేవయే పరమావధిగా భావించి, కర్తవ్యపరాయణత్వంలో కన్నుమూసిన 'శ్రవణకుమారు'ని జీవితం లోకానికి అత్యంత ఆదర్శ ప్రాయమైనది. *సేవకు మించిన సాధన వేరొకటి లేదు. అందులో తల్లి దండ్రుల సేవతో సమానమైన సేవ మరొకటి లేదు.*

తల్లి దండ్రులను సేవించండి! తరించండి!

'పితృవాక్య పరిపాలన అన్నది గొప్పధర్మము. ఆ ధర్మాన్ని వదలివేసి ఎంత గొప్ప ఐశ్వర్యము సంపాదించినా ఫలితం ఉండదు. పితృవాక్య పరిపాలన పరమోత్కృష్టమైన ధర్మము'

- శ్రీరామచంద్రుడు

గురుభక్తి

"గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః
గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీగురవేనమః"

అనగా *"గురువు బ్రహ్మదేవుడు, గురువువిష్ణువు, గురువు దేవుడగు ఈశ్వరుడు, గురువు ప్రత్యక్షముగా నున్న ఆ పరమాత్మయే. అటువంటి తేజోవంతుడగు గురువు కొఱకు నమస్కారము"* అని అర్థము.

'ఆచార్యదేవోభవ!' భారతీయ సంస్కృతి యందు గురువునకు అత్యున్నతమైన స్థానం ఇవ్వబడింది. గురువును కూడా దైవముతో సమానముగా భావించమని మన శాస్త్రములు ఆదేశిస్తున్నాయి. భక్తి శ్రద్ధలతో గురువుని సేవించేవారికి దైవానుగ్రహం లభిస్తుందని మన పెద్దలు చెబుతున్నారు.

"అజ్ఞానతిమిరాన్ధస్య, జ్ఞానాంజనశలాకయా
చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవేనమః"

అనగా *"అజ్ఞానము అను చీకటియందు, గ్రుడ్డి వాని వలె వున్న నాయొక్క కన్ను 'జ్ఞానము' అను కాటుక పుల్లతో ఏ గురువుచే తెరిపింప జేయబడినదో అటువంటి తేజోవంతుడగు గురువు కొఱకు నమస్కారము"* అని అర్థము.

'అజ్ఞానము' అను అంధకారమును పారద్రోలి, **'జ్ఞానము'** అను వెలుగును ప్రసాదించువాడు **'గురువు!'.** **'అజ్ఞానము'** అనే అంధకారమును దూరము చేసి 'ప్రజ్ఞానము' అనే ప్రకాశవంతమైన జ్యోతిని వెలిగించువాడు 'గురువు'. కంటిపొరను తొలగించి దృష్టిని కలిగించేవాడు **'డాక్టర్'** అయితే, 'అజ్ఞానము' అనే పొరను తొలగించి, 'జ్ఞానదృష్టి' ప్రసాదించువాడు **'గురువు'.** గురువు అనే శబ్దము అత్యంత పవిత్రమైనది. అలనాడు **'జ్ఞానబోధ'** చేసేవారు గురువులు. అయితే ఈనాడు లౌకిక విద్యలను నేర్పేవారు అధ్యాపకులు (టీచర్లు).

"గుణము లేని సుతుడు, గురిలేని విద్యలు, నీతిలేని జాతి నిష్ఫలంబు" అన్నారు శ్రీ సత్యసాయిబాబావారు. ***'గుణం'*** ముఖ్యం, ***'గురి'*** అత్యవసరం. ప్రతివ్యక్తిలో ***'నీతి'*** ఉండాలి. కనుక ప్రతివిద్యార్థిలో ఈ మూడూ ఉండాలి. ముఖ్యంగా గురువులు (అధ్యాపకులు) మీద విద్యార్థులకు గురి ఉండాలి. లేనివానికి విద్యరాదు. కనుక ***ప్రతి విద్యార్థి (గురువుల) అధ్యాపకుల యెడల భక్తి శ్రద్ధలు*** కలిగి ఉండాలి.

ఏకలవ్యుని ఆదర్శం :

గురుభక్తికి చక్కటి ఆదర్శం ఏకలవ్యుడు. ద్రోణాచార్యుడు విలువిద్యను నేర్పడానికి నిరాకరించినప్పటికీ, నిరాశ చెందక, నిస్పృహకు లోనుకాకుండా, నిగ్రహంతో, అతని విగ్రహమును ముందుంచుకొని పూజిస్తూ, శ్రద్ధతో, పట్టుదలతో, తీవ్రకృషి సలిపి, స్వబుద్ధితో, స్వశక్తితో సాటిలేని మేటి విలుకాడయ్యాడు 'ఏకలవ్యుడు. అతని విలువిద్యా నైపుణ్యాన్ని చూచి 'ద్రోణుడే' ఆశ్చర్యపడిపోతాడు. భౌతికంగా ద్రోణుడు విలువిద్యను నేర్పనప్పటికీ, ఏకలవ్యుడు విలువిద్యలో అంతటి నైపుణ్యాన్ని ప్రావీణ్యతను ఎలా సాధించగలిగాడు? సునిశితంగా పరిశీలిస్తే ఒక విషయం తేటతెల్లమవుతుంది. ***గురుభక్తి, శ్రద్ధ, పట్టుదల వుంటే దేనినైనా సాధించగలుగుతారని ఋజువుచేసాడు 'ఏకలవ్యుడు'*** ఈ మూడూ ఉన్నవారికి దైవానుగ్రహం తప్పని సరిగా తోడు నిలుస్తుందని ఏకలవ్యుని జీవితం నిరూపిస్తున్నది. కనుక ముఖ్యంగా ***విద్యార్థులలో అచంచలమైన గురుభక్తి, శ్రద్ధ, పట్టుదల, కృషి ఉండాలి. అప్పడే మానవకృషికి, దైవకృప తోడ్పడుతుంది.*** అట్టి విద్యార్థులు విజయాలను సాధించగలుగుతారు. ఈ సత్యమును మాత్రం విస్మరించకండి.

గురుభక్తి :

తమిళనాడులో ఒక శివభక్తుడు అయిన ఒక గురువు ఉండేవాడు. అతని పేరు **'అప్పర్‌సాధువు'.** అతనికి అనేకమంది శిష్యులుండేవారు. కొందరు ప్రత్యక్షంగా ఆ గురువుగారికి సేవ చేస్తుంటే, మరికొంత మంది అజ్ఞాత భక్తులుగా వుండి, ఆ గురువుగారి ఆశయ ఆదర్శములను ప్రచారం చేస్తూ, గురువుగారి పేర అనేక సత్రములను, మందిరములను నిర్మించుతుండేవారు, ఎన్నో ధర్మకార్యాలకు ధనము వెచ్చిస్తుండేవారు. ఒకసారి 'అప్పర్‌సాధువు' తన శిష్యుడున్న గ్రామానికి వెళ్ళుతాడు.

ఆ గ్రామానికి ఆ గురువుగారు వెళ్లటం అదే మొదటిసారి. తన పేరుతో నిర్మించబడిన సత్రమును చూచి గురువుగారు ఆశ్చర్యపడుతారు. గురువుగారి రాకను తెలుసుకొనిన ఆ శిష్యుడు గురువుగారిని తన ఇంటికి ఆహ్వానించి సాదరంగా సత్కరించుతాడు. ఒక విందును కూడా ఏర్పాటు చేస్తాడు. పెద్దలను కూడా ఆ విందుకు ఆహ్వానిస్తాడు. అరటి ఆకుల కోసం తన పెద్దకుమారుని తోటకు పంపుతాడు. తన కుమారుడు ఎంత సేపటికీ అరటి ఆకులను తీసుకొని రాకపోవటంచేత తండ్రి ఆ అరటితోటకు పరుగెత్తుకొని వెళ్ళుతాడు. తీరా చూస్తే అక్కడ పాముకాటుచేత చనిపోయి పడి వుంటాడు కుమారుడు. తండ్రి ఏ మాత్రం చలించడు. కొన్ని అరటి ఆకులను ఆ శవంమీద కప్పి, విందుకు కొన్ని అరటి ఆకులను తీసుకొని వస్తాడు. భోజనానికి అందరూ కూర్చున్నారు. ఆ సమయంలో 'అప్పర్‌సాధువు' తన శిష్యునితో ***"నీ కుమారులందరిని భోజనానికి రమ్మనమని చెప్పు, పేరుపేరున అందరినీ పిలువు!"*** అని ఆజ్ఞాపిస్తాడు. మారుమాట్లాడక అదేవిధంగా పిలుస్తాడు. పేరు పెట్టి పిలవగానే అతని పెద్దకుమారుడు అరటి ఆకులతో పరుగెత్తుకొని వస్తాడు. అరటి తోటలో చనిపోయిన తన పెద్దకుమారుడు ఎలా బ్రతికి వచ్చాడు? తన కళ్లను తానే నమ్మలేకపోతాడు. గురువు కృపాకటాక్ష ములుంటే, అది సాధ్యమేనని భావిస్తాడు. ఇది వాస్తవం.

ఈ ఉదంతం మనకు ఒక నీతిని బోధిస్తున్నది. ***ఎవరు గురువును మనసా, వాచా కర్మణా సేవించుతారో, వారికి దుఃఖ నివృత్తి అవుతుంది. సుఖప్రాప్తి కలుగుతుంది. కనుక ఈ సత్యమును మరువకండి. భక్తి శ్రద్ధలతో గురువులను పూజించండి.***

సత్యకాముడు :

పూర్వము గౌతమ మహర్షివద్ద అనేకమంది శిష్యులు ఉండేవారు. ఒకనాడు శిష్యులందర్ని పిలిచి *'శిష్యులారా! మన ప్రాంతంలో కరువుకాటకములు ఏర్పడినాయి. మన వద్దనున్న నాలుగువందల గోవులు తినడానికి పచ్చికగాని, త్రాగడానికి నీరుగాని లేక అలమటిస్తున్నాయి. వాటి దీనావస్థను చూచి నా హృదయం పరితపిస్తున్నది. వాటి బాధలను చూస్తూ, నా విధులను నేను సక్రమంగా నిర్వర్తించ లేకపోతున్నాను. కనుక మీలో ఒకరు ఈ గోవులను సుభిక్ష ప్రాంతాలకు తోలుకొని వెళ్ళి, వాటి సంరక్షణ భారమును*

కొంతకాలం వహించుతే బాగుంటుంది" అని గౌతముడు చెప్పాడు. శిష్యులు ఏమీ బదులు చెప్పక, తలవంచి నిలుచున్నారు. కాని 'సత్యకాముడు' అను ఒక శిష్యుడు మాత్రం ముందుకువచ్చి, తానా బాధ్యతను స్వీకరించుతానని చెబుతాడు. మిగతా శిష్యులు నిరుత్సాహపరుస్తారు. అయినప్పటికీ ఏ మాత్రం వెనుకాడడు. అప్పడు గౌతముడు, ఆ నాలుగు వందల గోవులను తోలుకొని వెళ్ళి, వెయ్యి ఆవుల అయిన తరువాతనే తిరిగి రావలసినదిగా ఆదేశించి, ఆశీర్వదించి పంపుతాడు.

గోసేవయే గురుసేవగా భావించి, ఆ గోవులను దూరప్రదేశాలకు తోలుకొని వెళ్ళుతాడు 'సత్యకాముడు'. ఆ గోవులకు అక్కడ మంచి గడ్డి దొరుకుతుంది. చక్కగా మేసి మంచిగా తయారువుతాయి. గోవుల సంఖ్య కూడా పెరుగుతుంటుంది. గోసేవ చేస్తూ, భగవన్నామస్మరణలో నిమగ్నుడైన 'సత్యకాముడు' మాత్రం పెరుగుతున్న గోవుల సంఖ్యను గమనించడు. తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తిస్తూ కాలం గడుపుతుంటాడు 'సత్యకాముడు'. అతని గురుభక్తికి దేవేంద్రుడు మెచ్చి, ప్రత్యక్షమై ***"సత్యకామా! ఆవుల సంఖ్య వేయి అయింది. గురువుగారి వద్దకు తోలుకొని పో!"*** అని ఆదేశించి, దేవేంద్రుడు కూడా అతని వెంట ప్రయాణం చేస్తూ, నాలుగు వేదములు అతనికి బోధించి, అంతర్ధానమైపోతాడు. సత్యకాముడు ఆనందంతో, ఆవులను తోలుకొని గురువుగారి వద్దకు వెళ్ళి పాదాభివందనం చేస్తాడు. గురువుగారు శిష్యుని కౌగలించుకొని, ఆనంద భాష్పాలతో ఆశీర్వదించుతాడు.

ఈ కథ మనకొక నీతిని బోధిస్తున్నది. ***భక్తి శ్రద్ధలతో గురువును సేవించిన వారికి, గురువాజ్ఞలను శిరసావహించిన వారికి దైవానుగ్రహం తప్పనిసరిగా లభిస్తుంది.*** ఆ విధంగా సత్యకాముడు ప్రవర్తించటం వలననే దైవానుగ్రహం అతనికి సంప్రాప్తించింది. అతని ఆశయం నెరవేరింది. కనుక ***ప్రతిఒక్కరూ గురువులను పూజించాలి, గురువాజ్ఞలను శిరసా వహించాలి.***

పద్మపాదుడు

శంకరాచార్యుల వద్ద అనేక మంది శిష్యులు ఉండేవారు. అందులో ఒక శిష్యుడు గురు సేవలో నిమగ్నుడై ఉండటం వలన, అతను చదువులో వెనుకబడినాడు.

మిగతా శిష్యులు అతనిని చూచి హేళన చేస్తుండేవారు, చులకనగా మాట్లాడు తుండేవారు. అయినప్పటికీ ఆ శిష్యుడు వారి మాటలను లెక్కచేసేవాడు కాదు. నిరంతరం గురువు సేవలోనే నిమగ్నుడై ఉండేవాడు. ఒకనాడు గురువుగారి వస్త్రములను తీసుకొని, ఉతకడానికి నదికి వెళ్ళుతాడు. వాటిని మంచిగా ఉతికి, నది మధ్యలో నున్న ఇసుక తిన్నెలపై ఆరవేస్తాడు. అదే సమయంలో నది హఠాత్తుగా పొంగి, ఇసుకతిన్నెలను ముంచివేస్తుంది. ఆరబెట్టిన వస్త్రములు నదిలో కొట్టుకొని పోతుంటాయి. గురువుగారిని స్మరించుకుంటూ, ప్రాణములను సహితం లెక్క చేయకుండా, తెగించి ఆ ప్రవాహంలో దిగుతాడు. అతనికి ఈత రాదు. వస్త్రములు కొట్టుకొని పోతుంటాయి. గురువుగారు మీద భారం వేసి, గురువును స్మరించుకుంటూ ప్రవాహంలో దిగాడు కాబట్టి, అతనికి గురువుగారి అనుగ్రహం లభిస్తుంది. అతని అచంచలమైన గురుభక్తి ప్రభావంచేత, అడుగుపెట్టబోయే స్థలంలో ఒక్కొక్క పద్మము ప్రత్యక్షమవుతూ వుంటుంది. ఆ పద్మముల మీద కాలుమోపుతూ, ప్రవాహంలో నడిచి వెళ్ళి కొట్టుకొని పోతున్న గురువుగారి వస్త్రములను పట్టుకొని, ఒడ్డుకు తిరిగివస్తాడు. అది చూచిన మిగతా శిష్యులు ఆశ్చర్యపడి సిగ్గుతో తలలు వంచుకుంటారు. ఆ శిష్యుని గురుభక్తికి మెచ్చుకొని, శంకరుల వారు అతనికి **'పద్మపాదుడు'** అని నామకరణ చేస్తారు. అప్పటి నుంచి శంకరుల వారి శిష్యకోటిలో **'పద్మపాదుడు'** అత్యంత ముఖ్యశిష్యుడుగా పరిగణించబడుతాడు.

"అతని గాఢమైన గురుభక్తియే, దైవానుగ్రహం వలన దివ్యశక్తియై, అతనిని దరికి చేర్చి, కీర్తి ప్రతిష్ఠలను తెచ్చి పెట్టింది" అనే సత్యం ఈ సంఘటన వలన మనకు తేటతెల్ల మవుతున్నది. ***"భక్తిశ్రద్ధలతో గురువును సేవించిన వారికి దైవముకూడా సహాయపడుతాడు"*** అనే వాస్తవాన్ని విస్మరించకండి.

బాల అరుణి :

పూర్వం 'ధౌమ్యుడు' అనే మహర్షి ఉండేవాడు. అతని వద్ద అనేక మంది శిష్యులు విద్యనభ్యసిస్తుండేవారు. ఒకనాడు శిష్యులకు విద్యను బోధిస్తున్న సమయంలో కుంభవృష్టి కురవ నారంభించింది. అప్పడు 'అరుణి' అనే శిష్యుని పిలిచి 'ధౌమ్యుడు' ***"నాయనా!కుండపోతగా వర్షం కురుస్తున్నది. ఒకసారి మన పొలం వద్దకు వెళ్ళి చూచిరా!***

బోదెగట్లు తెగిపోయినా తెగి పోవచ్చును" అని చెబుతాడు. వెంటనే గురువుగారి ఆజ్ఞ ప్రకారం చేను దగ్గరకు వెళ్ళుతారు 'అరుణి'. గురువుగారు భావించినట్లుగానే గట్టుకు గండిపడి నీరు పోతుంటుంది. అప్పడు ఆ గండి చిన్నదిగానే ఉంటుంది. అది పెరిగి పెద్దదైతే పంట మొత్తం కొట్టుకొని పోతుందని భావించిన 'అరుణి' ఆ గండికి అడ్డంగా పడుకుంటాడు. కొంతసేపటికి వర్షం తగ్గిపోతుంది. తెల్లవారుతుంది. అయినప్పటికీ శిష్యుడు మాత్రం ఆశ్రమానికి చేరడు. 'అరుణి' జాడ తెలియక 'ధౌమ్యుడు' తన శిష్యులతో సహా, అతనిని వెదుకుతూ చేను దగ్గరకు చేరుకుంటారు. అక్కడ గండికి అడ్డంగా స్పృహ తప్పి పడివున్న 'అరుణి'ని చూచి గురువుగారి గుండె కరిగిపోతుంది. అతను మరణించాడని శిష్యులందరూ భావిస్తారు. ఆ శిష్యుణ్ణి లేవదీసి, తన దివ్యశక్తి చేత, అతనికి స్పృహ తెప్పించి, ఆ శిష్యుని గురుభక్తికి మెచ్చి, మనసారా ఆశీర్వదించి ఆశ్రమానికి తీసుకొని వస్తాడు 'ధౌమ్యుడు'.

"గురువును నమ్ముకున్నవారికి ఎట్టి ప్రమాదం రాదు. ఒక వేళ వచ్చినా, అది త్రుటిలోనే తప్పిపోతుంది" అనే నీతి ఈ సంఘటన ఋజువు చేస్తున్నది. కనుక *గురువులను హృదయపూర్వకంగా నమ్మండి, విశ్వసించండి! వారిని సేవించండి, అనుగ్రహ ఆశీస్సులను పొందండి!.*

బుద్ధి వికాసానికి 'విద్య' అవసరం. అట్టి విద్యను గురువుల వద్ద నేర్చుకోండి. *గురువు మీద 'గురి' ఉంచండి. శ్రద్ధతో విద్యనభ్యసించండి. గురువులను భక్తితో సేవించండి. వినయవిధేయతలను పెంపొందించుకోండి. ఉత్తమ పౌరులుగా తయారుకండి!*

"గురువును శిష్యుడెన్నడూ ఆక్షేపింపరాదు. గురువు మానవునికి భగవంతునితో అనుసంధానము కూర్చు మధ్యవర్తి. అట్టి నీ గురువును గూర్చి ఇతరులాడు నిందావాక్యములను విని సహింపకుము. అతడు నీ తల్లిదండ్రుల కన్నా ఉత్తముడు. నీ తల్లిదండ్రుల నెవ్వడేని నీ ఎదుట దూషించుచున్నచో విని ఊరుకుందువా? అవసరమగుచో పోరాడియైనను నీ గురువు ప్రతిష్ఠను కాపాడుము".

- రామకృష్ణపరమహంస

ఐకమత్యము

'ఐకమత్యమే మహాబలం' అన్నారు అనుభవజ్ఞులైన మన పెద్దలు. ఎట్టి భిన్నాభిప్రాయములు లేకుండా, ఒకేమాట మీద, ఒకే బాటలో నడవటమే **'ఐకమత్యము'** అనబడుతుంది. వ్యష్టిగా సాధించలేని కార్యం, సమిష్టిగా సాధించవచ్చును. కుటుంబం అభివృద్ధి జెందవలెననిన, గ్రామం పురోభివృద్ధి గాంచవలెననిన, దేశం సస్యశ్యామలం కావలెననిన 'ఐకమత్యం' అత్యవసరం. ***అనైక్యత అనర్థానికి దారితీస్తుంది, సమైక్యత సంరక్షిస్తుంది.***

ఉదాహరణకు ..... గడ్డిపోచ 'ఉఫ్' అంటే గాలికి లేచిపోతుంది. అతి బలహీనమైన ఆ గడ్డిపోచలనే, ఒక చోట చేర్చి వెంటి (త్రాడు)గా తయారుచేస్తే దానితో మదించిన మదపుటేనుగును సహితం బంధించవచ్చును. విడివిడిగా వున్నప్పుడు ఆ గడ్డిపోచలలో ఏ శక్తీ ఉండదు. అట్టి బలహీనమైన గడ్డి పోచలు ఒకచోట చేరినప్పుడు అజేయమైన శక్తిగా రూపొందుతుంది. అదే విధముగా ఎవరికి వారు విడివిడిగా ప్రయత్నించుతే ప్రయోజనం ఉండదు. ఆశించిన ఏ కార్యం సఫలీకృతంకాదు. అదే పదిమంది సంఘటితమై, ఐకమత్యంతో ప్రయత్నించుతే అసాధ్యమైన కార్యాలను కూడా సాధించవచ్చును. ***సంఘటిత శక్తి వలననే దేశ సమైక్యత, సమగ్రత సాధించ బడుతుంది.***

మానవశరీరం :

ఐకమత్యమునకు చక్కటి ఉదాహరణ మానవ శరీరము. అనేక రకరకాలైన అవయవములతో మానవ శరీర నిర్మాణం జరిగింది. వేటికి ఏ పని కేటాయించబడిందో, ఆ పనిని చక్కగా, ఐకమత్యంగా అవి చేసుకుంటూ పోతాయి. మనిషి ఎక్కడికి వెళ్ళాలని మనసు సంకల్పించుకొనిన మరుక్షణంలోనే, కాళ్ళు అక్కడకు తీసుకొని వెళ్ళుతాయి. ఏ పనిని చేయాలనుకుంటే, ఆ పనిని చేతులు చేస్తాయి. దేనిని చూడదలచుకుంటే దానిని కండ్లు చూస్తాయి. దేనిని వినదలచుకుంటే దానిని చెవులు వింటాయి. దేనిని వాసన చూడదలచుకుంటే దానిని ముక్కులు వాసన చూస్తాయి. దేనిని తినదలచుకుంటే దానిని నోరు తింటుంది, కడుపు నిండుతుంది. మనసు సంతృప్తి జెందుతుంది. అది జీర్ణమై, రక్తరూపంలో తిరిగి శరీరములోని అన్ని భాగాలకు ఎట్టి వివక్షత చూపకుండా, గుండె రక్తమును సరఫరా చేస్తుంది. తిరిగి వచ్చిన రక్తమును

ఊపిరితిత్తులు పరిశుభ్రం చేస్తాయి. ఈ విధంగా ప్రతిక్షణం ఆగకుండా వేటి పని అవి సంఘీభావంతో చేస్తూనే ఉంటాయి. ఒకవేళ దురదృష్టవశాత్తు పేచీవచ్చి, ఏ అవయం పనిచేయకపోయినా అసలు ఆటే కడుతుంది. సంపాదించిన దంతా తినేది నోరు, కష్టించి పని చేయవలసింది మేమా? అని ఇతర అవయవాలు భావిస్తే, మొదటికే మోసం వస్తుంది. శరీరంలోని ఏ అవయవమునకు దెబ్బతగిలినా, జబ్బు చేసినా శరీరమంతా బాధ పడుతుంది గదా! ఒకటి ఎక్కువ, మరొకటి తక్కువ అనేది లేదు. దేనికున్న ప్రాముఖ్యత దానికున్నది. అన్నీ కలిపి పనిచేసినప్పడే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. అదే విధముగా కుటుంబాభివృద్ధిగాని, గ్రామాభివృద్ధిగాని, దేశాభివృద్ధిగాని అందరూ కలసి, మెలసి, ఐకమత్యంతో, సంఘీభావంతో ఎవరి బాధ్యతలను వారు నిర్వర్తించినప్పడే జరుగుతుంది. నవభారత నిర్మాణానికి సమైక్యత, సంఘీభావం ఎంతైనా అవసరం. ***ఐకమత్యానికి చిహ్నం 'మానవశరీరం', మరచిపోకండి.***

ధర్మరాజు ఆదర్శం :

"వయం పంచాధికశతం" అని ధర్మరాజు ఏనాడో చెప్పాడు. "మేము నూట ఐదుగురము అన్నదమ్ములం" అన్నాడు ధర్మరాజు. వీరి మధ్య తగాదా వచ్చినప్పడు మాత్రం పాండవులు ఐదుగురు, కౌరవులు నూరుగురు. వీరిమీదకు మరెవరైనా దండెత్తి వస్తే, అప్పడు వాళ్ళు నూట ఐదుగురు సోదరులు. అదే విధంగా మనలో ఎన్ని తేడాలున్నా, ఎన్ని విభేదాలున్నా, ఎన్ని కులాలున్నా, ఎన్ని మతాలున్నా, ఎన్ని భాషలున్నా మనమంతా భారతీయులం. ***ఇటువంటి సమైక్యతాభావం, జాతీయదృక్పథం మనలో ఉండాలి.***

చీమలు - కాకులు :

చీమలలో ఉన్నది సమైక్యత. కాకులలో ఉన్నది సంఘీభావం. చీమ ఒకచిన్న బెల్లపుగడ్డను చూస్తే అదిమాత్రమే తినదు. కొన్ని వందల చీమలను చేర్చి, అన్నీ కలిసి మోసుకొనిపోయి దాచుకొని తింటాయి. ఎంగిలి మెతుకులను చూచిన కాకి తానొక్కటే తినదు. "కా....కా...." అని పది కాకులను చేర్చి కలిసి తింటాయి. అయితే ఈనాటి మానవులలో మాత్రం ఆ సంఘీభావం కనిపించటం లేదు. ఐకమత్యం (Unity) అసలే లేదు. ఇది నిజంగా దురదృష్టకరం. ***కులాలు వేరైనా మనదంతా ఒకే జాతి. మనం భారతీయులం. 'ఐకమత్యమే మహాబలం' అని నిరూపించండి!.***

పట్టుదల

విజయానికి మూలం పట్టుదల. పట్టుదల లేనివాడు జీవితంలో దేనినీ సాధించలేడు. అయితే మంచి విషయాలను సాధించడానికి పట్టుదల ఉండాలి. చెడ్డకోరికలను నెరవేర్చుకోవడంలో మాత్రం పట్టుదల పనికిరాదు. చెడ్డ విషయాలకోసం పట్టుపట్టడం **'మొండి పట్టుదల'** అంటారు. మొండి పట్టుదల మానవుణ్ణి పతనం చేస్తుంది. కనుక దీనిని దరికి చేరనీయరాదు. ప్రతివ్యక్తికీ ఆశయం ఉన్నతంగా ఉండాలి. ఆదర్శం శ్రేష్ఠమైనదై ఉండాలి. అట్టి లక్ష్యమును సాధించేందుకు **'పట్టుదల'** ఉండాలి.

భగీరథుడు :

భగీరథునిలో పట్టుదల వుండటం వలననే గంగను దివినుండి భువికి తీసుకొని రాగలిగాడు. ఈ దేశమును సస్యశ్యామలం చేయగలిగాడు. తన పూర్వీకులు సాధించలేని, అసాధ్యమైన కార్యమును పట్టుదలతో సాధించాడు భగీరథుడు. పట్టుదల వుంటే సాధించలేనిదంటూ ఏదీ లేదని ఋజువు చేశాడు భగీరథుడు. కనుక ***విజయాలను సాధించడానికి పట్టుదల అత్యవసరం.***

తులసీదాస్ :

గంగానదీతీరంలో 'హరిపూర్' అనే గ్రామం ఉన్నది. ఒకరోజు ఉదయం ఒక బాలుడు వెళ్ళి ఇంటి తలుపులు తడుతాడు. ఆ ఇంటి ఆవిడ తలుపు తీస్తుంది. ఆ పిల్లవాడు ***'అమ్మా! ఆకలవుతున్నది. ఒక ముద్ద పెట్టమ్మా!'*** అని జాలిగా అడుగుతాడు. ప్రేమతో ఒక గ్లాసు పాలు తీసుకొని వచ్చి ఇచ్చింది ఇల్లాలు. ఆ బాలుడు ఆ పాలను గటగటా త్రాగుతున్నాడు. ఇంతలో ఒక ముసలమ్మ వచ్చి ***"అతడెవరనుకున్నావు? వట్టి నిష్ఠదరిద్రుడు, అతనికి మేలు చేస్తే కీడు వస్తుంది. అటువంటి నష్టజాతకునికి సహాయం చేయకూడదు"*** అని కసురుకుంటుంది. త్రాగే త్రాగే గ్లాసు క్రిందపెట్టి వెళ్ళిపోతాడు ఆ బాలుడు.

పాపం! ఆ బాలుడు ఒక నిర్భాగ్యుడు. పుట్టగానే తల్లి మరణించింది. అతడు పుట్టిన నక్షత్రం **'మూలా నక్షత్రం'.** కుటుంబానికి అరిష్టమని ఇంటి నుంచి వెళ్ళగొడుతాడు

తండ్రి. ఆ పిల్లవాడిని ఒక **'దాది'** పెంచుతుంది. ఆమెకూడా మరణించింది. **'నష్టజాతకుడు'** అనే పేరు ఆ పిల్లవాడికి స్థిరపడింది. అయితే పుట్టినప్పుడు **'రామ్! రామ్!'** అన్నాడుట. కాబట్టి ఆ పిల్లవాడిని **'రామ్‌బోలా'** అని పిలిచేవారు.

ఆ పిల్లవాడిని ఎవరూ దరికి చేరనీయకపోవడంవలన దేశదిమ్మరి అయినాడు. వరాహక్షేత్రంలో ఉన్న 'నరహరిదాస్' అనే భక్తుడు ఆ పిల్లవాడిని చేరదీశాడు. అతని ఆదరణలో పెరిగి పెద్దవాడై, పట్టుదలతో చదువుకున్నాడు. తరువాత కొంతకాలానికి కాశీ చేరాడు. **'శేషసనాతనుడు'** అనే పండితుని ఆశ్రయించాడు. సేవ చేసి అతని మెప్పను పొందాడు. సకల శాస్త్రాలు అధ్యయనం చేశాడు. మంచి పండితుడయ్యాడు. **'రామచరిత మానస్', 'హనుమాన్ చాలీసా'**లను రచించాడు. ఆ రెండు గ్రంథములు బహుళ ప్రచారంలోకి వచ్చాయి. ఆ రచయితే 'తులసీదాస్'.

ఈ సంఘటన మనకు ఒక సందేశాన్ని అందిస్తున్నది. ***పట్టుదల గనుక వుంటే, ఎంతటి మహత్కార్యాలనయినా సాధించవచ్చును. ముఖ్యంగా విద్యార్థులలో ఇటువంటి పట్టుదల ఉండాలి. పట్టుదల వున్నవారే ప్రగతిపథంలో ముందుకు పోగలుగుతారు.***

"పట్టుదల యనెడు విల్లునుబూని, జ్ఞానమనెడు వాడి బాణము సంధించి, వివేకమనెడు కవచమును ధరించి, దృఢచిత్తముతో దుర్గుణములను శత్రువులతో పోరాడి జయించవలెను".

- బుద్ధుడు

స్నేహం

"విశాలమైన హృదయం, వ్యక్తిత్వం కలిగిన మనుష్యుల మధ్యనే స్నేహం పొసగడానికి అవకాశం వుంటుంది. సంకుచిత మనస్తత్వం, పిరికితనం కలిగిన మనుష్యులు నిజమైన స్నేహితులు కాలేరు" అని ఛార్లెస్ కింగ్స్‌వే చెబుతారు. ఇది వాస్తవం.

నిజాయితీ స్నేహానికి పునాదివంటిది. మానవ స్వరూప స్వభావాలు అధ్యయనం చేయడానికి స్నేహం ఎంతగానో ఉపకరిస్తుంది. ఒక పొరపాటు కప్పిపుచ్చుకోవడానికి పది అబద్ధాలు ఆడవలసి వస్తుంది. అబద్ధాలు ఆడి స్నేహాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నించే కంటే, నిజాన్ని ధైర్యంగా ఒప్పుకోవడం వలన నీ గౌరవం పెరుగుతుందే తప్ప ఏ మాత్రం తరగదు. అట్టి స్నేహమే చిరస్థాయిగా నిలుస్తుంది. నిజమైన స్నేహితుడు దొరకడానికి చాలా కాలం పడుతుంది. రోజుకొక క్రొత్త వ్యక్తితో స్నేహం చేయడానికి ప్రయత్నించేకంటే, అసలు స్నేహితులు లేకుండా వుండటమే ఉత్తమమైన మార్గం.

అభివృద్ధిలో ఉన్నప్పుడు ఎందరో వస్తారు. మిత్రభావమును చూపుతారు. స్వప్రయోజనం కోసం స్నేహాన్ని ప్రదర్శిస్తుంటారు. కష్టకాలం దాపురించినప్పుడు *'చెరువు ఎండగానే చేపలు మాయమైనట్లు'* అందరూ దూరమవుతారు. పైపెచ్చు నిందలు మోపుతారు. కష్టకాలంలో కూడా ఛాయవలె, ఎవరు విడవకుండా అంటిపెట్టుకొని ఉంటారో, అట్టివారే నిజమైన స్నేహితులు. అట్టి స్నేహాన్ని మాత్రమే ప్రతిఒక్కరూ చేయాలి.

ప్రాణ స్నేహితులు :

పూర్వకాలంలో ఇటలీ దేశంలో 'డయానిషస్' అనే రాజుండేవాడు. అతను మహా క్రూరుడు. అతనికి దయాదాక్షిణ్యాలే లేవు. అతనిని ఎదిరించినవారు, నిందించిన వారెందరో అతని చేతిలో హతులైపోయారు. అతనిని ధైర్యంగా ఎదిరించిన 'డామన్' కు రాజ ధిక్కారం నేరం క్రింద ఉరిశిక్ష విధించబడింది. జైలులో పెట్టారు. ఉరిశిక్ష సమయం ఆసన్నమవుతున్నది. తన ముసలి తండ్రిని, భార్యాబిడ్డలను చూడాలనే కోరిక అతనిలో జనించింది. అవకాశం యిప్పించమని రాజుగారిని ప్రార్థించుతాడు. అప్పడు ఆ రాజు *"డామన్! ఇంతగా ప్రార్థిస్తున్నావు గనుక నీకు బదులుగా ఎవరినైనా నీ స్థానంలో ఉంచి వెళ్ళు! గడువులోపల నీవు రాకున్న, నీకు బదులుగా అతనిని ఉరితీస్తారు"* అని చెబుతాడు.

ఆ విధంగా ఎవరు ఒప్పకుంటారా! అని ఆలోచిస్తున్న సమయంలో, అతని చిన్ననాటి ప్రాణస్నేహితుడు 'పిథియాస్' డామన్‌ను చూడటానికి వస్తాడు. రాజుగారు విధించిన షరతును తెలుసుకొని పిథియాస్ ***"నీకు బదులుగా జైలులో నేనుంటాను నిశ్చింతగా ఇంటికి వెళ్ళి నీకుటుంబ సభ్యులను చూచిరా!"*** అని చెబుతాడు. రాజు కూడా అంగీకరిస్తాడు. మిత్రుడి త్యాగమును మెచ్చుకొని కన్నీరు కారుస్తాడు 'డామన్'. జైలులో 'పిథియాస్'ను ఉంచి ఇంటికి పరుగెత్తుకొని వెళ్ళుతాడు 'డామన్'. తన కుటుంబ సభ్యులను చూచి తిరిగి వస్తుండగా బ్రహ్మాండమైన గాలివాన వస్తుంది. చెట్లు విరిగి పడిపోతుంటాయి. గాడాంధకారం, త్రోవకూడా కనిపించదు. క్రిందపడుతూ, లేస్తూ వస్తుంటాడు. దారిలో ముళ్ళపొదలు, చీరుకొని వళ్ళంతా రక్తసిక్తమైతుంది. అయినప్పటికీ పరుగెడుతునే ఉంటాడు. ఉరిశిక్ష సమయం దగ్గరపడుతుంది. 'పిథియాస్'ను ఉరితీయడానికి ఉరికంబానికి తీసుకొని వెళ్ళుతుంటారు జైలు అధికారులు. 'డామన్' మాటనిలబెట్టుకుంటాడా? లేదా? అని జనం కుతూహలంగా చూస్తుంటారు ఇంతలో డామన్ పడుతూ లేస్తూ జైలుకు చేరుతాడు. ***"ఆపండీ! ఆపండీ!"***అని కేకలు వేస్తాడు. ***"నా స్నేహితుని ఉరితీయకండి! నేను వచ్చాను నన్నే ఉరితీయండి!"*** అని ప్రాధేయపడుతాడు. రాజు ఆ సన్నివేశాన్ని చూస్తాడు. మతిపోతుంది. చుట్టూగుమికూడిన జనం ఆశ్చర్య పడుతారు. పిథియాస్ మరణదండనను స్వీకరించడానికి సంతోషంగా సిద్ధంగా ఉంటాడు. కాని డామన్ వచ్చి ***"నన్ను ఉరితీయండి!"*** అంటాడు. ప్రాణస్నేహితులిరువురూ ***"నన్ను ఉరితీయండి! నన్ను ఉరిదీయండి!"*** అంటారు. ఆ ఇరువురి స్నేహితుల మధ్యనున్న ప్రగాఢమైన మైత్రిని చూచి, ఆ రాజుగారి కఠిన హృదయం కూడా కరిగిపోతుంది. ఆ ఇద్దరి అనుబంధాన్ని ప్రశంసించి ఆ ఇరువురిని తనకొలువలో చేర్చుకుంటాడు ఆ రాజు.

ఈ కథ మనకొక మంచి ఆదర్శమును చాటుచున్నది. 'ప్రాణంకన్న మిన్న స్నేహం' అని ఋజువు చేశారు ఆ ప్రాణ స్నేహితులు.

స్నేహితులు :

కృష్ణ, కుచేలమైత్రి కూడా అటువంటిదే. శ్రీకృష్ణుని చిన్ననాటి స్నేహితుడు కుచేలుడు. కృష్ణుని స్థాయి పెరిగింది. మహారాజు అయినాడు. కుచేలునికి గంపెడు పిల్లలు. అత్యంత పేదరికాన్ని అనుభవిస్తుంటాడు. **తినటానికి కూడా తిండి వుండదు.**

ఆ దుర్భర పరిస్థితులలో ఒకసారి కృష్ణుని చూడటానికి ద్వారకకు వెళ్ళుతాడు. అతని అవతారం చూచి ద్వారపాలకులు లోపలికి కూడా వెళ్ళనివ్వరు. ఇంతలో రథము ఎక్కి బయటకు వస్తుంటాడు శ్రీకృష్ణుడు. ద్వారపాలకులు కుచేలుని బయటకు నెట్టివేస్తారు. తిండిలేక నీరసించి వుండటం వలన క్రింద పడి స్పృహను కోల్పోతాడు కుచేలుడు. ఇంతలో శ్రీకృష్ణుని రథం అక్కడకు వస్తుంది. క్రిందపడి వున్న చిన్ననాటి స్నేహితుడైన కుచేలుని చూస్తాడు. రథం దిగి కుచేలుని తలను తన తొడమీద పెట్టుకొని, మంచినీరు తెప్పించి త్రాగించుతాడు. కుచేలుని లేవనెత్తి తన సౌధంలోనికి తీసుకొని వెళ్ళి సకల మర్యాదలు చేస్తాడు. పంచభక్ష పరమాన్నములతో భోజనం పెడుతాడు. దగ్గర కూర్చొని ఆప్యాయతతో అన్నం తినిపించుతాడు. ధరించడానికి పట్టువస్త్రములు తెప్పించి యిస్తాడు. ఆ ఇరువురు స్నేహితులూ చిన్ననాటి ముచ్చట్లు చెప్పకుంటారు. ఉన్నట్లుండి "కుచేలా! నాకోసం ఏం తెచ్చావు?" అని అడుగుతాడు శ్రీకృష్ణుడు. తాను తెచ్చిన అటుకుల మూటను చూపించడానికి సిగ్గుపడుతాడు కుచేలుడు కాని, శ్రీకృష్ణుడు ఆ మూటను లాక్కొని విప్పి, ఆ అటుకులను సంతోషంగా తింటాడు.

మరునాడు తన స్నేహితుని వద్ద శలవు తీసుకొని ఇంటికి చేరుతాడు కుచేలుడు. తన పూరిల్లు ఎక్కడ ఉన్నదా? అని వెదుకుతుంటాడు. ఇంతలో ఒక భవనం నుండి అతని భార్య బయటకు వచ్చి *'ఇదేనండీ మన ఇల్లు!'* అంటుంది. కుచేలుడు ఆశ్చర్యపోతాడు. ఆ భవనంలోకి వెళ్ళి జరిగినదంతా తన భార్యకు చెబుతాడు.

ఈ ఉదంతం మనకొక గొప్ప ఆదర్శమును బోధిస్తున్నది. ***నిజమైన స్నేహానికి హద్దులు ఉండవు. ఉన్నవారు, లేనివారు అనే తారతమ్యం కూడా ఉండదు. అదే నిజమైన స్నేహం. అట్టి వారే నిజమైన స్నేహితులు.***

"A friend in need is a friend in deed"

అక్కరకు ఆదుకొనేవాడే నిజమైన స్నేహితుడు.

సోమరితనము

'An Idleman's Brain is devil's work shop' సోమరితల దయ్యాల కొంప గదా! పని లేనివానికి అనేక పిచ్చిపిచ్చి ఆలోచనలు వస్తుంటాయి. ***సోమరితనం ప్రగతికి అవరోధం.*** సోమరి ప్రధాన లక్షణం 'బద్ధకం'. ఇది చాలా చెడ్డగుణం. ముఖ్యంగా విద్యార్థులలో ఉండకూడని 'దుర్గుణం'. ఈవేళ చేయవలసిన పని 'రేపు' చేద్దాములే! అని వాయిదా వేస్తుంటారు సోమరులు. ***'ఆలస్యం అమృతం విషం గదా!'*** ఒక్కొక్కప్పుడు ఆలస్యం చేస్తే అమృతం కూడా విషమైపోతుంది. సోమరులు దేనినీ సాధించలేరు. కనుక దీనిని దరికి చేరనీయరాదు.

'Laziness is Rust and dust' (సోమరితనం తుప్పు, ధూళి) ఇనుము మీద తుప్పు మరియు ధూళి ఉండటంవలననే అయస్కాంతం దానిని ఆకర్షించలేక పోతున్నది. అదే విధముగ 'బద్ధకం' అనే దుర్గుణం ఆవరించడంవలన విద్యార్థులు ప్రగతిని సాధించలేకపోతున్నారు. కనుక ***సోమరితనాన్ని పారద్రోలాలి.***

సోమరి శిష్యుడు :

అది ఒక ఆశ్రమం. ఒకనాడు సూర్యాస్తమయ సమయంలో పెనుగాలి వీస్తుంది. గురువుగారి కుటీరం పైనున్న తాటాకులు కొన్ని లేచిపోతాయి. శిష్యుడ్ని పిలిచి ఎగిరిపోయిన తాటాకులు తెచ్చి కప్పమంటాడు. ఆ శిష్యుడు మహాబద్ధకస్తుడు, సోమరి. కూర్చున్న చోట నుండి కదలడు, మెదలడు, మాటలు మాత్రం బాగా చెప్పగలడు. పని చేయడు. ఆ సోమరి శిష్యుడు ***"గురూజీ! ఇప్పుడు చీకటి పడింది. ఈ కటిక చీకటిలో ఎక్కడ వెదుకుదును? వెదికినా తాటాకులు కనిపించునా? ఒక వేళ కనిపించినా, వాటినితెచ్చి కుటీరంపై కప్పట సాధ్యమా? రేపుప్రొద్దున తెచ్చి కప్పెదను. క్షమించండి!"*** అని బదులు చెబుతాడు.

ఆ రోజు రాత్రి వర్షంకూడా బాగా కురిసింది. కుటీరమంతా తడిసింది. గురువుగారికి రాత్రంతా నిద్రలేదు. తెల్లవారింది. కాని, వర్షం పడుతునే ఉన్నది. ఎంత పెద్దగా కేకలు వేసినా శిష్యుడు రాలేదు. శిష్యుని కుటీరంవద్దకే గురువుగారు తడుస్తూ వెళ్ళుతాడు. నిద్రపోతున్న శిష్యుని లేపి ***"ఒరే శంభూ! రెండు ఆకులు తీసుకొనివచ్చి కప్పరా!"*** అని బ్రతిమాలుతాడు. ***'స్వామీ! వర్షం కురుస్తుంటే కప్పటం సాధ్యం కాదు. వర్షం వెలిసినవెంటనే కప్పతాను స్వామీ!"*** అని బదులు చెబుతాడు శిష్యుడు. చేసేదేమిలేక గురువుగారు తిరిగివెళ్ళుతాడు. కొంతసేపటికి వర్షం ఆగిపోతుంది. శిష్యుని పిలిచి

ఆకులు తెచ్చి కప్పమంటాడు. శిష్యుడు వస్తాడు, ఆకాశం చూస్తాడు. *"గురూజీ! వర్షం ఆగిపోయింది గదా! ఇంకా కప్పటం దేనికి? మరల వర్షం వస్తే కప్పుతాను"* అని చెప్పి వెళ్ళిపోతాడు శిష్యుడు.

శిష్యుని సోమరితనాన్ని చూచి గురువుగారు చాలా బాధపడుతాడు. వాయిదా వేసి తప్పించుకోవటం సోమరి ప్రధాన లక్షణం. చేయవలసిన పనిని సకాలంలో చేయరు బద్ధకస్తులు. సోమరితనం గలవారు తమను తామే రక్షించుకోలేరు, ఇక ఇతరులకు ఏవిధంగా సహాయపడగలరు?

సోమరికి శిక్ష:

మానవుని సృష్టించాడు సృష్టికర్త. తాను సృష్టించిన మానవుని అవయవములు ఏవి, ఎట్లా పనిచేస్తున్నాయో ఒకసారి పరిశీలించాలను కున్నాడు. ఆ విధంగా అన్ని అవయవాలు కార్యకలాపాలను పరీక్షిస్తుంటే కుడిచేయికి, ఎడమచేయికి పెద్ద తేడా కనిపించింది. కుడిచేతిలో కనిపించిన కార్యదక్షత, కార్యకుశలత్వము, కార్యోత్సాహం, ఎడమ చేతిలో కనిపించలేదు. పైపెచ్చు ఎడమ చేతిలో అలసత్వము (సోమరితనం) కనిపించింది. ఆశ్చర్యం వేసింది. ఒకనాడు రెండు చేతులను తనవద్దకు పిలిపించుకున్నాడు. ***"ఓ చేతులారా! మీ ఇద్దరిని ఒకే సమయాన నేను సృష్టించాను. అయితే మీలో, కుడి చేయి పనిచేయటంలో చాలా ఉత్సాహాన్ని చూపుచున్నది. ఎడమ చేయి సోమరితనాన్ని అలవాటు చేసుకున్నది. కాబట్టి కుడి చేయికి ఒక వరమును ప్రసాదిస్తున్నాను, దేవుని పూజ చేయు అధికారం కుడి చేయికి అనుగ్రహిస్తున్నాను"*** అని చెప్పాడు సృష్టికర్త.

ఎడమచేయి చాలా బాధపడి ***"మహా ప్రభో! నాకు కూడా ఏదైనా వరమును ప్రసాదించండి!"*** అని వేడుకుంది. అప్పుడు సృష్టికర్త ***"నీకు వరమును ఇవ్వను. నీవు పరమ సోమరివి, ఒక్క పనిలో కూడా నీవు ఉత్సాహమును చూపటంలేదు"*** అని తిరస్కరిస్తాడు. అప్పుడు ఎడమచేయి "వరము ఇవ్వకపోయిననూ, ఏదైనా ఒక్కపని అయినా చెప్పండి. దానిని ఆచరించుతూ ఉంటాను" అని ప్రాధేయ పడుతుంది. అప్పుడు సృష్టికర్త "ప్రతి రోజూ నిద్రలేవగానే బహిర్ భూమికి వెళ్ళుతావు గదా! ఆ పనిని నీకు యిచ్చాను ఆచరించు!" అని చెబుతాడు.

ఈ కథలో ఒక మంచి నీతి ఉన్నది. సోమరితనమునకు తగిన శిక్ష విధించాడు సృష్టికర్త. కనుక ప్రతివ్యక్తి సోమరితనానికి తిలోదకాలివ్వాలి. అలసత్వమును దరికి చేరనీయక ఉత్సాహంతో కార్యదీక్షాదక్షులు కావాలి.

పరోపకారబుద్ధి

'పరోపకార బుద్ధి' అన్ని బుద్ధులలో మిక్కిలి శ్రేష్ఠమైనది. పరులకు ఉపకారం చేయటమే **'పరోపకారము'**. అయితే ఉపకారం చేసేటప్పుడు మనలో ఎట్టి స్వార్థం ఉండకూడదు. ప్రతిఫలాన్ని ఆశించకుండా ఇతరులకు ఉపకారం చేయాలి. నిస్వార్థబుద్ధితో సహాయం చేయటమే నిజమైన 'పరోపకారము'.
ఇదే భావమును ఈ నీతి శ్లోకం విశదీకరిస్తున్నది.

"పరోపకారాయ ఫలంతి వృక్షాః
పరోపకారాయ వహంతి నద్యః
పరోపకారాయ దుహంతి గావః
పరోపకారాయ సతాం విభూతయః"

అనగా ***"పరోపకారము కొఱకు వృక్షములు ఫలముల నిచ్చుచున్నవి. పరోపకారము కొఱకు నదులు ప్రవహించుచున్నవి. పరోపకారము కొఱకు గోవులు పాలను యిచ్చుచున్నవి. పరోపకారము కొఱకే సజ్జనుల యొక్క సంపదలు వినియోగపడుతున్నవి"*** అని అర్థం.

వృక్షములకు, నదులకు, గోవులకు ఎట్టి స్వార్థం లేదు. పరోపకారమే వాటి పరమావధి. అదే విధముగా సజ్జనులలో కూడా స్వార్థం కనిపించదు. నిరంతరం ఇతరులకు సహాయపడటమే సజ్జనుల లక్ష్యం. కనుక ***పరోపకారబుద్ధిని ప్రతిఒక్కరూ పెంపొందించుకోవాలి.***

చిన్నకథ :

యుద్ధంలో గాయపడిన ఒక సైనికుడు చంకకర్రల సహాయంతో తన గ్రామానికి బయలుదేరుతాడు. నడవలేక దారిలో కనిపించిన ఒక సత్రంలో విశ్రమిస్తాడు. తినటానికి అన్నం వుండదు, సపర్యలు చేసేవారు అంతకన్నా ఉండరు. బాధతో మూలుగుతూ పడుకొని వుంటాడు. ఏదైనా కొనుక్కొని తినాలంటే డబ్బులు కావాలి గదా! డబ్బులు లేవు. ఆకలి అవుతుంటుంది, పెట్టేవారులేరు. మంచినీళ్ళు త్రాగి పడుకుంటాడు. నిత్యమూ ఒక పేద బాలిక అదే దారిలో బడికివెళ్ళి వస్తుంటుంది. సత్రంలో పడుకొని వున్న ఆ సైనికుడ్ని చూచి జాలిపడుతుంది. బడినుంచి తిరిగి వచ్చేటప్పుడు రెండు నాణెములు తెచ్చి యిస్తుంది. ఆ విధంగా ప్రతిరోజు సాయంత్రం డబ్బులు తెచ్చి ఆ సైనికుడికి యిచ్చి వెళ్ళుతుంటుంది. ఆ డబ్బులతో తినుపదార్థములను కొనుక్కొని కడుపు నింపుకుంటుంటాడు ఆ సైనికుడు.

సైనికుడికి ఆశ్చర్యం వేస్తుంది. ఒకరోజు ఆ బాలికను దగ్గరకు పిలిచి *"అమ్మాయీ! నీ తల్లిదండ్రులు అతి పేదవారని ఈ రోజుననే విన్నాను. ప్రతి దినం నాకు డబ్బులు యిస్తున్నావు. ఈ డబ్బులు నీకు ఎక్కడివి? ఎవరిస్తున్నారు? నీ తల్లిదండ్రులకు తెలుసా? దాచక నిజం చెప్పు!"* అని అడుగుతాడు. అప్పుడు ఆ బాలిక *"నేను నీకు యిస్తున్న డబ్బులు, నేను సంపాదిస్తున్నవే! నేను బడికి పోయే త్రోవలో అడవి వున్నది. రేగిపండ్లు దొరుకుతాయి. వాటిని తీసుకొని వెళ్ళి, బడిలోని తోటి బాలికలకు అమ్మి డబ్బు సంపాదిస్తున్నాను. ఆ డబ్బులే నీకు యిస్తున్నాను. దొంగిలించి యివ్వటంలేదు"* అని చెబుతుంది. సైనికుడు ఆశ్చర్యపోయి *"ఈ విషయం నీ తల్లిదండ్రులకు తెలుసా?"* అని అడుగుతాడు. *"బాగా తెలుసు. నన్నేమి అనరు. లోకంలో మనకంటే దరిద్రులు చాలా మంది ఉన్నారు. మనకున్న దానిలో కొంత బీదలకు పెట్టటం మంచిదని నాతో ఎప్పుడూ చెబుతుంటారు. అందువల్ల నేను యీ విధంగా చేస్తున్నాను"* అని చెబుతుంది ఆ బాలిక. అప్పుడు ఆ సైనికుడు కంట తడిపెట్టి *"నీకూ, నీ తల్లిదండ్రులకు శుభము కలుగు గాక!"* అని ఆ బాలికను ఆశీర్వదించుతాడు.

చిన్న సంఘటన :

ఒకసారి ఒక గొప్ప ఉద్యోగి అదే బాటన గుర్రము మీద వెళ్ళుతుంటాడు. గుర్రమునకు నీళ్ళుపెట్టడానికి ఆ సత్రం దగ్గర ఆగుతాడు. అక్కడ పడుకొని వున్న సైనికుడ్ని చూచి గుర్తుపడుతాడు. ఆ సైనికుడు అంతకు పూర్వం అతని క్రింద పని చేసినవాడేనని తెలుసుకుంటాడు. సత్రం యజమానిని పిలిచి కొంత డబ్బుయిచ్చి, ఆ సైనికునికి మందు యిప్పించమని, అన్నం పెట్టమని ఆదేశిస్తాడు. నిత్యమూ సహాయం చేస్తున్న బాలిక వివరాలు తెలుసుకొని తిన్నగా వాళ్ళింటికి వెళ్ళుతాడు. తల్లిదండ్రుల వద్దనున్న ఆ అమ్మాయిని చూచి *"అమ్మాయీ! నీ పరోపకారబుద్ధికి నేనెంతో సంతోషి స్తున్నాను. నీకు కొన్ని బంగారు నాణెములు యిస్తున్నాను. ఈ సంచీతీసుకో!"* అని ఒక సంచీని ఆ బాలికకు యిస్తాడు. అప్పుడు ఆ తల్లిదండ్రులు ఆశ్చర్య పడుతూ *"అయ్యా! ఇంతసొమ్ము తీసుకునే అర్హత మాకులేదు. మాకు వద్దు బాబూ!"* అని చెప్పినప్పటికీ వినక ఆ సంచీనిచ్చి ఆ ఉద్యోగి వెళ్ళిపోతాడు.

ఈ సంఘటన మనకు ఒక సందేశాన్ని అందిస్తున్నది. బీదవారు సహితం తనకున్నదానిలో ఇతరులకు చేతనైనంత సహాయం చేయాలి. ప్రతిఫలాన్ని ఆశించ కుండా సహాయం చేసిన వారికి దైవానుగ్రహము లభిస్తుంది. ఏదో ఒక రూపంలో, ఎవరో ఒకరు వచ్చి సహాయపడుతారు. పరోపకారము చేయువారికి ఇహమునందు మేలు కలుగుతుంది, పరమునందు ముక్తిని పొందుతారు. కనుక ***పరోపకార బుద్ధిని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలి.***

దూరదృష్టి

జీవితంలో విజయాన్ని సాధించవలెననిన 'దూరదృష్టి' అత్యవసరం. ఆలోచించకుండా, తొందరపడి ఏ నిర్ణయం గైకొనరాదు, ఏ పనీ చేయరాదు. ఆలోచన చేయకుండా చేసే పనులు అనర్థాన్ని తెచ్చి పెడుతాయి. తొందరపాటుతనంవల్ల చేబట్టిన కార్యం చెడిపోతుంది. పూర్వా పరాలను చక్కగా విచారించి రానున్న ఆపదలను ముందుగానే పసిగట్టి, తరుణోపాయమును కనుగొనుటనే **'దూరదృష్టి'** అంటారు. కనుక ప్రతి ఒక్కరూ కార్యమును ప్రారంభించే ముందే, దూరదృష్టితో ఆలోచించి ప్రారంభించాలి.

ఈ విషయమును గురించిన కథ ఒకటి మహాభారతంలో ఉన్నది. దీనిని భీష్ముడు, ధర్మరాజుకు చెబుతాడు.

ఒక కొలనులో మూడు చేపలు ఉండేవి. వాటి పేర్లు 1. ***దీర్ఘదర్శి*** 2. ***ప్రాప్తకాలజ్ఞుడు*** 3. ***దీర్ఘసూత్రి.*** ఈ మూడింటిలో దీర్ఘదర్శి, దూరదృష్టికలది. రానున్న ఆపదలను ముందుగానే పసిగట్టి, తరుణోపాయాన్ని ఆలోచించి, ముందుజాగ్రత్త పడగల సామర్థ్యం కలది. రెండవ చేప అయిన ప్రాప్తకాలజ్ఞుడికి అటువంటి దూరదృష్టి లేదు. కొంత ప్రయత్నలోపం కూడా ఉన్నది. కాని ఆపదలు ముంచుకొని వచ్చినప్పుడు మాత్రం సమయస్ఫూర్తితో వ్యవహరించి, తప్పించుకొనే సామర్థ్యం మాత్రం దానికి కలదు. మూడవ చేప అయిన దీర్ఘ సూత్రికి దూరదృష్టి అసలే లేదు. సమయస్ఫూర్తి అంతకన్నా లేదు. ఏ ప్రయత్నమూ చేయని సోమరి అది. స్వల్పకాలంలో చేయవలసిన చిన్నపనిని కూడా గంటల తరబడి చేయుస్వభావం కలది. ఎట్లా జరుగవలసి వుంటే అట్లా జరుగుతుందనే స్వభావం కలది.

ఈ మూడు చేపలూ నివసిస్తున్న ఆ కొలనును చూడటానికి ఒకరోజు సాయత్రం బెస్తవారు వచ్చారు. బాగా బలిసి వున్న చేపలను చూచి మురిసిపోయారు. మరునాడు ఉదయం వలలు తీసుకొని వచ్చి చేపలను పట్టుకుందామని వారిలో వారు సంప్రదించుకొని ఇండ్లకు తిరిగి వెళ్ళారు. ఆ బెస్తవారి మాటలను ఆ మూడు చేపలు విన్నాయి. అందులో మొదటి చేప అయిన 'దీర్ఘదర్శి' రానున్న ఆపదను గ్రహించి, మిగతా రెండు చేపలను హెచ్చరిస్తుంది. ఆ బెస్తవారు రాకమునుపే ఆ కొలను వదిలి, మరొక కొలనుకు చేరటం మంచిదని హితవు చెబుతుంది. కాని మిగతా రెండు చేపలు దీర్ఘదర్శి మాటలను ఖాతరు చేయవు. రెండవ చేప అయిన 'ప్రాప్తకాలజ్ఞుడు'

ఎప్పుడో రానున్న ఆపదలను గురించి, యిప్పటినుంచే అనవసరంగా బుర్ర చెడగొట్టు కోవడం అనవసరమని చెబుతుంది. మూడవ చేప అయిన 'దీర్ఘసూత్రి' మాత్రం వేదాంతం చెబుతుంది. మరణించే కాలం వస్తే, ఎక్కడనున్నా తప్పించుకోలేమని శ్రీరంగనీతులు పలుకుతుంది. రెండు, మూడు చేపలు చెప్పిన మాటలు విని మొదటి చేప అయిన 'దీర్ఘదర్శి' వాళ్ళ అవివేకమునకు చింతించి, ఆ కొలనును మరుక్షణంలోనే వదలి మరొక కొలనును చేరి సురక్షితంగా ఉంటుంది.

మరునాడు ఉదయమే జాలరులు, వలలు తీసుకొనివచ్చి, ఆ కొలనులో వేస్తారు. ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రి ఆ వలలో చిక్కుకుంటారు. జాలరులు వాటిని పైకి తీసి ఒడ్డున పడవేస్తారు. రెండవ చేప అయిన 'ప్రాప్తకాలజ్ఞుడు' వచ్చిన ఆపదను గ్రహించి, సమయస్ఫూర్తితో, చచ్చినదానిలా కదలక మెదలక పడి ఉంటుంది. ఆ చచ్చిన చేపదేనికని భావించి, జాలరులు దానిని తిరిగి కొలనులో విసిరి పారేస్తారు. బ్రతికాను కదాయని, కొలనులోపలికి వెళ్ళి ప్రాణాలను రక్షించుకుంటుంది. మూడవ చేప అయిన దీర్ఘసూత్రి మాత్రం స్వబుద్ధినుప్రయోగించక, ఒడ్డున పడి గిలగిలా కొట్టుకుంటూ వుంటుంది. బాగా బలిసిన చేప దొరికిందనే సంతోషంతో, ఆ జాలరులు ఆ చేపను బుట్టలో వేసుకొని, ఇంటికి తీసుకొని వెళ్ళి కోసి కూరవండుకొని తిని హాయిగా పడుకుంటారు.

ఈ కథవల్ల మనం ఒక నీతిని నేర్చుకోవాలి. అదేమనగా మొదటి చేప అయిన 'దీర్ఘదర్శి' యొక్క దూరదృష్టిని ప్రతిఒక్కరూ కలిగి ఉండాలి. అటువంటి ముందుచూపు గలవారు మాత్రమే ఆపదలలో చిక్కుకొనరు. ***దూరదృష్టి కలవారు మాత్రమే విజయాలను సాధించగలరు.***

రెండవ చేప అయిన 'ప్రాప్తకాలజ్ఞుడు' లాగే కష్టములొచ్చి మీద పడేదాకా మెదలకుండా కూర్చోకూడదు. ఒక వేళ అనుకోకుండా, దురదృష్టవశాత్తు ఆపదలు వచ్చి మీద పడితే మాత్రం 'ప్రాప్తకాలజ్ఞుడు' చూపిన ***సమయస్ఫూర్తిని చూపి ఆపదలనుండి కడుచాతుర్యంగా బయట పడటం నేర్చుకోవాలి.***

మూడవ చేప అయిన 'దీర్ఘసూత్రి'లాగా ఎవరూ ప్రవర్తించ కూడదు. అది వల్లించినట్లుగా మెట్టవేదాంతం చెప్పినందువల్ల ప్రయోజనం వుండదు. ప్రయోజనం వుండకపోగా ప్రమాదాలు కూడా సంభవిస్తాయి.

కనుక ప్రతిఒక్కరికీ 'దూరదృష్టి' అత్యవసరం. సమయస్ఫూర్తి కూడా ఉండాలి.

ముంగీస పాము :

పూర్వం ఒక గ్రామంలో ఒక చదువుకున్న పండితకుటుంబం ఉండేది. ఎంతో కాలానికి వారికి ఒక చిన్నారి కలిగింది. ఎంతో ప్రేమగా పెంచుకుంటున్నారు. ఆ పిల్లతో పాటు ఒక ముంగిసను కూడా వీరు పెంచుకుంటున్నారు. ఒక రోజున ఉదయం భార్య నదికి వెళ్ళుతుంది. అదే సమయంలో ఆ పండితునికి రాజుగారి నుండి ఆహ్వానం వస్తుంది. ఎంతో కాలం నుండి రాజుగారి ఆహ్వానం కోసం ఎదురుతెన్నులు చూస్తున్న ఆ పండితునికి ఏమీ తోచక, ముంగిసను ఆ పసిపాపకు కాపలా వుంచి రాజుగారి కొలువుకు వెళ్ళుతాడు. ఇంతలో ఒక సర్పం ఆ ఇంటికి వచ్చి, ఆ పసిపాపను కాటు వేయబోతుంటుంది. అప్పుడు ఆ ముంగిస దానితో పోరాడి ఆ పామును చంపివేస్తుంది. విజయగర్వంతో, ఆ నెత్తురు మూతితోనే పండితునికి ఎదురుగా పోతుంది ముంగిస. తన పసిపాపను చంపి ముంగిస వస్తున్నదని భావించి ఆ పండితుడు కోపంతో ఆ ముంగిసను కర్రతో కొడుతాడు. ముంగిస చనిపోతుంది. ఆ పండితుడు లోపలికి వెళ్ళి చూడగా పసిపాప కేరింతలు కొడుతూ ఆడుకుంటూ వుంటుంది. పాము చచ్చి ప్రక్కనే పడి వుంటుంది. కోపంతో తాను చేసిన పనికి పండితుడు చింతిస్తాడు. ప్రేమతో పెంచిన ముంగిసను తన చేతులతోనే చంపి నందులకు విచారిస్తాడు కాని ప్రయోజనం ఉండదుగదా!

ఈ కథ మనకు ఒక నీతిని బోధిస్తున్నది. *అసలు జరిగినదేమిటో తెలుసుకోకుండా, తొందరపడి నిర్ణయాలు గైకొనరాదు. తొందరపాటు చర్యల వలన జరగరానివి జరుగుతుంటాయి. తరువాత విచారించి ప్రయోజనం ఉండదు. అనాలోచితంగా, ఉద్రేకంతో ఏ పనులూ చేయరాదు. దూరదృష్టితో వ్యవహరించాలి.*

"అభిమన్యునిలా పోరాడటం మానుకోవాలి, కుర్రతనంగా ప్రవర్తించరాదు. దూరదృష్టితో, మెళుకువతో నడుచుకోవడం నేర్చుకోవాలి. అభిమన్యునిలోని ధైర్యసాహసాలను మాత్రం అలవరచుకోండి"

- హరి సర్వోత్తమరావు

వివేకం - విచక్షణ

ఈనాడు సాంకేతికపరిజ్ఞానం అభివృద్ధి చెందినది. రేడియో, టి.వి.లు వచ్చాయి. ఎక్కడో ఢిల్లీలో ఒక నర్తకి నాట్యం చేస్తుంటే, కొన్ని వేల కిలోమీటర్ల దూరాన ఉన్న మనం, మన ఇంట్లో కూర్చొని టి.వి.లో ఆ నర్తకి నాట్యాన్ని చూస్తూ ఆనందిస్తున్నాం. సాంకేతికజ్ఞానం అభివృద్ధి గాంచిన మాట వాస్తవమే. కాని ఆ పరిజ్ఞానంతో మానవ వినాశనానికి దోహద పడే అణుబాంబులను కూడా తయారు చేస్తున్నారు. ఎక్కడో ఒక గదిలో కూర్చొని 'రిమోట్' నొక్కితే చాలు! వేల కిలోమీటర్ల దూరాన వున్న పట్టణాలు కూడా ఒక్క క్షణంలో భస్మీపటలం అయిపోతాయి. ఈనాడు మానవుడు అంతటి సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించాడు. కాని మానవత్వం మాత్రం కనిపించటంలేదు. సహృదయం అసలే లేదు. విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయారు. వివేకం అంతకన్నా లేదు. విజ్ఞానం మాత్రం అభివృద్ధి అవుతున్నది. దీనివలన ప్రయోజనం ఏమిటి? ఇదే ఈనాటి ప్రశ్న?

మానవత్వాన్ని కోల్పోయిన విజ్ఞానం మారణహోమానికి దారితీస్తుంది. సహృదయంలేని సాంకేతికపరిజ్ఞానం సర్వనాశనానికి దారితీస్తుంది. విచక్షణా రహితమైన నైపుణ్యం (Skill) వినాశనానికి దోహదం చేస్తుంది. ఆలోచనా రహితమైన మేధాశక్తి (Intellect) మానవ కళ్యాణానికి ఏ మాత్రం ఉపయోగపడదు. ఈనాడు మేధాశక్తి (Intellect)కి, నైపుణ్యానికి (Skill) మధ్య సమతూకం (Balance) లోపించటం వలననే, ప్రపంచంలో నేడు తరచుగా ఉప్పెనలు, తుఫానులు, భూకంపాలు సంభవిస్తున్నాయి.

విషయపరిశోధనకు విజ్ఞానం ఎంత అవసరమో పరిశోధనా ఫలితాలను వినియోగించడానికి ***'వివేకం'*** అంత అవసరం. పరిశోధనవలన సంపాదించిన సాంకేతికపరిజ్ఞానమును ఎప్పుడు, ఎక్కడ, దేనికి ఉపయోగించాలో అవసరమైన 'విచక్షణా జ్ఞానం' కూడా ఉండాలి. కనుక ప్రతివిద్యార్థి విజ్ఞానాదులను అభివృద్ధి పరచుకుంటూ, వివేక విచక్షణా జ్ఞానములను కూడా పెంపొందించుకోవాలి. వివేకం లేని విద్య, విచక్షణా జ్ఞానం లేని విజ్ఞానం వలన ప్రయోజనం లేదు. ప్రయోజనం లేకపోగా ప్రమాదాలను కూడా తెచ్చి పెడుతాయి. కనుక ప్రతివిద్యార్థి ***విద్యతో పాటు వివేకమును, విజ్ఞానంతోపాటు విచక్షణా జ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలి.***

వివేకం అవసరం :

ఏసుక్రీస్తు ఒకసారి ఒక నగరవీధులలో నడిచి వెళ్ళుతున్నాడు. దూరాన నుంచి అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. దగ్గరకు వెళ్ళి చూచాడు. ఒక మురుగు

కాలువ ప్రక్కన ఒక యువకుడు తప్పత్రాగి పడి వున్నాడు. అతని బంధువులు చుట్టూ చేరి ఏడుస్తుంటారు. ఆ యువకుడి ముఖాన నీళ్ళు చల్లి లేపి ఏసుక్రీస్తు *"నాయనా! ఇలా ఎందుకు త్రాగావు?"* అని అడుగుతాడు. అప్పుడు ఆ యువకుడు *"నేను ఒకప్పుడు కుష్ఠురోగంతో బాధపడే వాడిని. ఆ రోగమును మీరే నయం చేశారు. ఆ ఆనందంలో త్రాగటం అలవాటు చేసుకున్నాను"* అని జవాబు యిస్తాడు.

ఏసుక్రీస్తు మరికొంత దూరం వెళ్ళాడు. అక్కడ ఒక యువకుడు కామవాంఛతో ఒక యువతిని బలాత్కారం చేస్తుంటాడు. ఆ దృశ్యం చూచిన ఏసుక్రీస్తు, ఆ యువకుడితో *"నాయనా! వ్యభిచారం నేరం కాదా! అందులో ఇష్టం లేని యువతిని బలాత్కారం చేయటం మహాపాపం!"* అని మందలించడానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు ఆ యువకుడు *"స్వామీ! నేను గ్రుడ్డివాడను. నన్ను కరుణించి లోగడ నాకు మీరే దృష్టిని ప్రసాదించారు. అప్పటి నుంచి లోకంలోని అందాలన్నింటినీ చూడగలుగుతున్నాను కాబట్టి, వాటిని అనుభవించాలనే కోరిక నాలో జనించింది"* అని ధైర్యంగా ఆ యువకుడు సమాధానం చెప్పాడు.

మానవాతీత శక్తులవలన ఏసుక్రీస్తు వారివారి బాధలను నివారించగలిగాడు. కాని వారు తమకు కలిగిన మేలును సద్వినియోగ పరచుకొనక తప్పడు మార్గంలో నడిచారు. ***భగవంతుడు చేసిన మేలును సద్వినియోగపరచుకొనే 'వివేకము' వారిలో లేకపోవటంవలన వారు చెడు మార్గాన నడిచారు. కనుక ప్రతిఒక్కరూ వివేక జ్ఞానమును పెంపొందించుకోవాలి.***


వివేక-విచక్షణలు :

సైన్సు చెడ్డదికాదు. సైన్సువలన మానవాళికి ఎంతో మేలు జరుగుతున్నది. అయితే ఈనాడు ఆ సాంకేతిక విజ్ఞానం మంచికన్నా చెడుకే ఉపయోగపడుతున్నది. అణుశక్తి మంచికీ ఉపయోగపడుతుంది. చెడుకూ ఉపయోగపడుతుంది. అణుశక్తి ద్వారా కొన్ని కోట్ల కిలోవాట్ల శక్తి గల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసి పరిశ్రమలను, వ్యవసాయ మును అభివృద్ధి పరచవచ్చును. అదే అణుశక్తి మానవవినాశనానికి కూడా ఉపయోగపడుతుంది. తాము కనిపెట్టిన శక్తిని చెడుకు, సంక్షోభానికి, సర్వ నాశనానికి గాక, మంచికి, మానవ కళ్యాణమునకు, అధికోత్పత్తికి ఉపయోగపడే విధంగా చూడటమునే 'వివేకజ్ఞానం' అంటారు. *కనుక మనం చేయు ప్రతి పనిలో 'వివేకం' ఉండాలి, 'విచక్షణ'ను ప్రదర్శించాలి.* ఒక్క *శాస్త్రజ్ఞానముతోనే సంతృప్తి జెందరాదు. వివేక విచక్షణాజ్ఞానములను కూడా అభివృద్ధి* పరచుకోవాలి.

Notes....



మహనీయులు - త్యాగశీలురు



మహాత్మా గాంధీజీ

'మీకు ఒక్కరోజు వైస్రాయి పదవి ఇచ్చారనుకోండి! అప్పుడు మీరు ఏం చేస్తారు?'
అని ఒక విదేశీయుడు అడుగుతాడు.

'వైస్రాయి భవనం ప్రక్కన ఉన్న హరిజనవాడలను శుభ్రం చేస్తాను'
అంటాడు ఆ మహాత్ముడు.

'మీ వైస్రాయి పదవి మరో రోజు పొడిగించుతే!' అని అడుగుతాడు ఆ విదేశీయుడు.

'మరునాడు కూడా సరిగ్గా ఆ పనే చేస్తా!'
అని తడుముకోకుండా సమాధానం చెబుతాడు ఆ మహాత్ముడు.

ప్రతి దేశంలోనూ మహాత్ములు ఎందరో జన్మిస్తుంటారు. కాని ఈ మహాత్ముడు మాత్రం భారతదేశంలో జన్మించాడు. మానవత్వం మూర్తీభవించిన మానవతావాది ఈ మహాత్ముడు. మానవత్వంతో దానవత్వాన్ని జయించాడు ఈ మహాత్ముడు. అహింసతో హింసను ఓడించాడు ఈ మహాత్ముడు. అంటరానితనంపై నిరంతర పోరాటం కొనసాగించాడు ఈ మహాత్ముడు. *ఆ మహాత్ముడే మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ.* ఆయనే మహాత్మా గాంధీగా పేరు గాంచారు. *'మహాత్మా గాంధీ'* అనగానే అందరి మనసులలో ఈయనే మెదలుతాడు. నిజంగా ఆయన అక్షరాలా మహాత్ముడే!

ఒకసారి గాంధీజీ, ఉపన్యసించడానికి ఒక పల్లెటూరు వెళ్లుతారు. ఒక పెద్ద పందిరి నిర్మిస్తారు ఆ గ్రామస్థులు. ఎంతో మంది పెద్దలు గాంధీజీ ఉపన్యాసం వినడానికి ఆ చల్లని పందిరిలోకి వచ్చి కూర్చుంటారు. కాని కొంతమంది మాత్రం, ఆ పందిరికి దూరంగా గుమికూడి ఉంటారు. దూరంగా వున్న ఆ గుంపుని చూచి *'వాళ్ళెవరు?'* అని

ప్రశ్నిస్తాడు గాంధీజీ. *'వాళ్ళు హరిజనులు'* అని నిర్వాహకులు సమాధానం చెబుతారు. అప్పుడు గాంధీజీ *'హరిజనులకు కనుక ఇక్కడ చోటు లేకపోతే, నాకు ఇక్కడ చోటు లేదు'* అంటూ వేదిక దిగి, గుంపుగా నిలుచొనివున్న హరిజనుల దగ్గరకు వెళ్ళి, వాళ్ళతో మాట్లాడటం మొదలు పెడుతాడు. ఆ గ్రామస్థులు తమ తప్పను తెలుసుకొని, క్షమించమని కోరుతారు.

గాంధీజీ చిన్ననాట ఒక ప్రాణమిత్రుడు ఉండేవాడు. అతని పేరు *'యుకా'*. అతను వీధులూడ్చే పాకీవాని కొడుకు. ఒకసారి ఆ పిల్లవాడిని తన ఇంటికి రమ్మనమని పిలుస్తాడు. వస్తాడు గాని ఇంట్లోకి రాకుండా బజారులోనే నుంచుంటాడు. గాంధీ పరుగెత్తుకొని ఇంట్లోకి వెళ్ళి మిఠాయిల్ని తీసుకొని, ఆ కుర్రవానికి యివ్వడానికి బయటకు వెళ్ళగా *'బాబూ! దగ్గరకు రాకండి ! నన్నంటుకోకండి ! అక్కడ పెట్టండి ! నేనే తీసుకుంటా!'* అంటాడు. *'ఏం అంటుకుంటే? ఏమవుతుంది?'* అంటూ ఆ మిఠాయిల్ని అతని చేతిలో పెడుతాడు. కిటికీలో నుంచి గాంధీ తల్లి చూస్తుంది, కోపంతో గాంధీని మందలిస్తుంది. *"అమ్మా! వాడుకూడా మనలాంటి మనిషే గదా! ఏం ముట్టుకుంటే?"* అని తల్లిని అమాయకంగా అడుగుతాడు గాంధీ. ఏం చెప్పాలో అర్థంకాక ఆ తల్లి నివ్వెరబోతుంది. అంటరానితనం అంటే అంతటి ఏవగింపు చిన్ననాటనే కలిగింది గాంధీకి. అతని వయసుతో పాటు, అంటరానితనం యెడల అతని భావాలు కూడా పెరిగి పెద్దవై ఒక గొప్ప మహా సంస్కర్తగా యావత్ ప్రపంచంలోనే పేరు ప్రఖ్యాతులను తెచ్చుకున్నారు మహాత్మాగాంధీజీ.

మహాత్మాజీ పేరు చెప్పగానే *'హరిజనోద్ధరణ'* ఆయన ప్రధాన ఆశయమని, సత్య, అహింసలు ఆయన చేబట్టిన ఆయుధాలని ప్రతి ఒక్కరికీ బాగా తెలుసు. గాంధీజీ ప్రబోధించిన మహోన్నత సూత్రాలు సత్యం, అహింసలు. *'సత్యం విస్మరించి, స్వేచ్ఛ సాధించడం కన్న దేశం నాశనమైనా నేను విచారించను'* అంటారు గాంధీజీ. గాంధీజీకి 'సత్యం' యెడల ఎంతటి గౌరవముండేదో! సత్యమునకు ఎంతటి ప్రాముఖ్యతనిచ్చేవారో! ఆయన మాటలే ఋజువు చేస్తున్నాయి. *'సత్యమే దైవం'* (Truth is God) అని అసత్యమే మహా పాపమని భావించేవారు గాంధీజీ.

'అహింసా పరమోధర్మః' అనే సిద్ధాంతానికి కట్టుబడి ప్రచారం చేయడమేగాక నిజజీవితంలో ఆచరించి చూపించారు గాంధీజీ. *'సత్యం, అహింసలు అవిభాజ్యములు.*

అవి నాణెపు రెండు ముఖములు. ఏ వైపు అరిగినా ఆ నాణెం చెల్లదు. సత్యం అన్వేషించే వ్యక్తి తప్పనిసరిగా అహింసా పథమును అనుసరించక తప్పదు. అలాగే సత్యమును అనుసరించని వానికి అహింస సాధ్యపడదు. అందుచేత ప్రతి వ్యక్తీ తనలో అంతర్గతమై ఉన్న అహింసా విధానాన్ని అనుసరించి ఆ పరమ సత్యాన్ని అన్వేషించాలి' అని గాంధీజీ ప్రబోధించారు.

"అస్పృశ్యతను సమూలంగా నిర్మూలించడానికే నేను జీవిస్తున్నాను. దాని కోసం ఆత్మార్పణం చేసుకోవడానికి కూడా నేను ఏమాత్రం వెరువను. నాకు మరో జన్మ అనేది ఉంటే అస్పృశ్యుడుగానే జన్మిస్తాను. అప్పుడు బాధలలో, కష్టాలలో, విచారములలో, అవమానములలో పాలు పంచుకునే అవకాశం నాకు లభిస్తుంది' అని తన ఆవేదనను ఒకసారి వెలిబుచ్చారు గాంధీజీ. అస్పృశ్యతా నిర్మూలనకు గాంధీజీ ఎంతో శ్రమించారు. నిరసన దీక్షలు, సత్యాగ్రహాలు కూడా చేశారు. తన జీవితాన్ని ఆ ఉద్యమానికే అంకితం చేశారు.


'సత్యాగ్రహం అంటే సత్యాన్వేషణ. సత్యం అంటే భగవంతుడు. నాకు సత్యాన్ని చూపే జ్యోతి 'అహింస'. ఈ సత్యములోని భాగమే స్వరాజ్యం. 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అని మనం ఏ విధంగా భావిస్తున్నామో, దానిని సాధించడానికి 'సత్యాగ్రహం మన జన్మ హక్కు' ఈ వాస్తవాన్ని విస్మరించకండి' అని గాంధీజీ ఎలుగెత్తి చాటారు.

'జాతిపిత' మహాత్మా గాంధీజీ ప్రధాన ఆశయాలైన 'సత్యము, అహింస, హరిజనోద్ధరణ' లను ఆచరణలో పెట్టి చూపించడం మనందరి కర్తవ్యం. సత్యమును పలుకుదాం. అహింసను ఆచరణలో పెడదాం. హరిజనోద్ధరణ ఉద్యమానికి కంకణం కడదాం. ఇదే ఈనాటి మన కర్తవ్యం, విద్యుక్త ధర్మం. విస్మరించకండి!



"విద్యను దాచుకోవద్దు. పదిమందికీ పంచు. అది మరింత రాణిస్తుంది"

- గాంధీ



బాబూరాజేంద్ర ప్రసాద్

ఆయన ఇల్లు పాట్నానగరంలో పెద్దబంగళా. అందులో చాలా గదులు ఉండేవి. వచ్చిపోయేవారితో బంగళా నిత్యమూ కళకళలాడుతూ ఉండేది. ఎవరి పనుల నిమిత్తం వారు వచ్చేవారు. ఆ బంగళాలో ఉండటానికి మంచి వసతి ఉండేది కాబట్టి, అక్కడ ఉండి, ఎవరి పనులు వారు పూర్తిచేసుకొని, వెళ్ళేటప్పుడు, ఆ బంగళాయజమాని వద్దకు వెళ్ళి *'బాబుగారు! వెళ్ళివస్తాం'* అనేవారుట. అప్పుడు ఆ యజమాని *"మీది ఏ ఊరు? ఎక్కడికి వెళ్ళాలి? చార్జీలు ఉన్నాయా?"* అని అడిగి చార్జీలు, ఇతర ఖర్చులు యిచ్చి పంపేవారుట. ఆయన ఎవరో కాదు. ఆ త్యాగమూర్తే ***బాబూ రాజేంద్రప్రసాద్.*** ఆయన ప్రముఖ న్యాయవాది. న్యాయవాదవృత్తి ద్వారా, ఆ రోజులలోనే, ప్రతి నెలా వేలాది రూపాయిలు సంపాదించే గొప్ప ధనవంతుడు ఆయన.

ఒకసారి గాంధీజీ పిలుపునందుకొని, సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనబోయే ముందు, తన భార్యను పిలిచి ***"నా వద్ద ఉన్నవి తొమ్మిది రూపాయిలు మాత్రమే ఉన్నాయి. ఇవి తీసుకో! నేను ఎప్పుడు తిరిగి వస్తానో! నాకే తెలియదు".*** అని చెప్పి ఉద్యమంలో పాల్గొనడానికి వెళ్ళుతాడు బాబూరాజేంద్ర ప్రసాద్. ప్రతి నెలా వేలాది రూపాయిలు సంపాదించే ఆ ధనవంతుడు, సత్యాగ్రహానికి వెళ్ళేటప్పుడు, తన భార్యకు కేవలం తొమ్మిది రూపాయిలు మాత్రమే ఇవ్వగలిగాడంటే, ఆయన నిత్యమూ చేసే వితరణ ఎంతటిదో ఆశ్చర్యం వేయక మానదు. ఆనాటి స్వాతంత్ర్య మహోత్సవంలో ఆయన చేసే త్యాగాలను చూచి, ప్రజలు ముగ్ధులై, ఆనాటి నుంచి ఆయనను ***'బీహార్ గాంధి'*** అని పిలిచేవారు.

ఆయన కాంగ్రేసు అధ్యక్ష పీఠాన్ని అలంకరించారు. స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగ పరిషత్ సభాధ్యక్షులైనారు. పది సంవత్సరాల పాటు భారత రాష్ట్రపతిగా అత్యున్నతమైన సేవలందించి మంచి పేరుప్రఖ్యాతులను గడించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో తన సర్వస్వాన్ని సమర్పించారు. చిట్టచివరకు తన పెద్ద బంగళాను కూడా

క్రోల్పోయారు. పది సంవత్సరాల పాటు రాష్ట్రపతి పదవిలో ఉండి కూడా, తనదంటూ ఒక స్వంత ఇల్లును కూడా ఏర్పాటు చేసుకోలేకపోయారు. రాష్ట్రపతి పదవీ విరమణ చేసిన తరువాత 'సదాకత్' ఆశ్రమంలో ఒక ప్రక్క నివసిస్తూ, అక్కడనే ఆయన కన్ను మూశారు. ఇది నమ్మశక్యంకాని నగ్నసత్యం. ఎన్నో వేలమందికి ఆశ్రయాన్ని ఇచ్చిన ఆయనకు, చిట్టచివరకి ఆశ్రమమే గతి అయింది. ఆయన జీవితమే ఆయన సందేశం. ***చెట్టునాటేది ఒకరు, పోషించేది ఇంకొకరు, దాని ఫలితం అనుభవించేది మరొకరు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకొనేవారు మరికొందరు. ఇదే ఈ నాటి పరిస్థితి.***

పూర్వం కలకత్తాలోని ప్రెసిడెన్సి కాలేజీలో ఒక నియమం ఉండేది. ఎంట్రన్స్ పరీక్షలో నెగ్గినవారికి మాత్రమే ఆ కాలేజీలో సీటు లభించేది. ఆ విధంగా ఎంట్రన్స్ పరీక్ష జరిగింది. ఆ కాలేజి ప్రిన్సిపాల్ తెల్లదొర. కరుకైనవాడు. అతనే ఫలితాలను ప్రకటించాడు. అందులో ఒక సాధుశీలుడైన, తెలివిగల విద్యార్థిపేరు లేదు. ఆ విద్యార్థిలేచి ***"సార్! నా పేరు చదువలేదేమిటి?"*** అని ప్రశ్నించాడు ***"నీ పేరు ఈ పట్టికలో లేదు. నీవు పరీక్షలో నెగ్గలేదు. అందువలన నీ పేరును, నేను ప్రకటించలేదు"*** అన్నాడు ప్రిన్సిపాల్. ***"నేను ఈ పరీక్షలో తప్పటం అసంభవం"*** అన్నాడు ఆ విద్యార్థి. ప్రిన్సిపాల్‌కు కోపం వచ్చింది. 'కూర్చో!' అని గద్దించాడు ప్రిన్సిపాల్. ఆ విద్యార్థి కూర్చోక ***'దయచేసి మరోమారు చూడండి సార్!'*** అని అడిగాడు వినయంగా విద్యార్థి. ప్రిన్సిపాల్‌కు ఇంకా కోపం వచ్చి ***'పది రూపాయిలు ఫైన్'*** అన్నాడు ప్రిన్సిపాల్. ఆ విద్యార్థి కూర్చోలేదు. ***'సిట్‌డౌన్',*** అని గర్జించాడు ప్రిన్సిపాల్. ఆ విద్యార్థి కూర్చోలేదు. చిట్టచివరికి యాభై రూపాయిలు ఫైన్ అని ప్రకటించాడు ప్రిన్సిపాల్. ఇదంతా గమనించిన హెడ్ క్లర్క్ ప్రిన్సిపాల్ దగ్గరకు వచ్చి ***'తప్పుజరిగింది సార్!'*** అన్నాడు. ఆ విద్యార్థి అందరికంటే మిన్నగా ఉత్తీర్ణుడయ్యాడని చెప్పాడు. అందరూ సంతోషించారు. అంత స్వాభిమానం గల ఆ సాహసవిద్యార్థి ఎవరో కాదు! మన ***బాబూరాజేంద్ర ప్రసాద్.***

బాల్యము నందు రాజేంద్రునకు అతని తల్లి, నాయనమ్మ రోజూ రామాయణ, భారత గాథలు చెప్పేవారుట. దేశభక్తుల, సంఘసంస్కర్తల ఆదర్శ జీవితాలను, నీతులను బోధించేవారని, రాజేంద్రప్రసాద్ తన ఆత్మ కథలో వ్రాసుకున్నారు. ఆ చిన్ననాటి ఇంటి వాతావరణం ఆయన మీద చెరగని ముద్రవేసింది. చిన్ననాట ఆయన తల్లి, నాయనమ్మలు బోధించిన నీతి బోధలు ఆయన జీవిత గమనాన్నే మార్చివేశాయి. త్యాగం, సహనం, సహకారములు ఆయన జీవిత లక్ష్యాలైనాయి. పిల్లలు బాగుపడాలంటే, ఆదర్శ జీవితాలను గడిపే స్థాయికి ఎదగాలంటే, ప్రధాన కారకులు తల్లిదండ్రులు, గురువులు మాత్రమే. ఈ వాస్తవమును విస్మరించకండి.



పండిత జవహర్ లాల్ నెహ్రూ

కాలింగ్ బెల్ మ్రోగుతుంది

సోఫాలో కూర్చొని, ఆనాటి దినపత్రికను చదువుతున్న ఒక పెద్దాయన తలుపు తీస్తాడు.

ఒక మధ్య వయస్కురాలు అతి దీనంగా చూస్తూ నిలబడి ఉంటుంది.

'ఏమమ్మా! ఏం కావాలి?' అని అడుగుతాడు.

"నా అవస్థ ఏమని చెప్పకొనేది! నేను సర్వస్వాన్ని కోల్పోయిన ఒక అనాథను. సహా కోసం వచ్చాను" అని దీనంగా తన గాధను చెప్పకొని కన్నీరు పెట్టుకుంటుంది.

ఆ అభాగ్యురాలి విషాదగాధను వినిన ఆ పెద్దాయన హృదయం ద్రవిస్తుం

'కాస్త ఉండు! వస్తాను!', అని లోపలికి వెళ్ళుతాడు. ఆ ఇంటి యజమాని భా దగ్గరకు వెళ్ళి *'నాకు కొంత పైకం కావాలి? ఉంటే ఇవ్వు! తర్వాత ఇస్తా!'* అని అడుగుతాడ

'నా వద్ద ఐదువందలు మాత్రమే ఉన్నాయి' అని చెప్పి యిస్తుంది ఆ గృహిణి.

ఆ మొత్తం తీసుకొని వెళ్ళి, ఆ అభాగ్యురాలి చేతిలో పెడతాడు. ఆ అభాగ్యురాల సంతోషించి, కృతజ్ఞతలు చెప్పకొని వెళ్ళిపోతుంది.

ఆ పెద్దాయన ఎవరు? ఆ ఇల్లు ఎవరిది? ఆ పెద్దాయన ఆ ఇంటికి ఎందుకు వచ్చాడు? ఆ గృహిణి ఎవరు? సమయసందర్భాలు తెలుసుకుంటే ఆశ్చర్యం వేస్తుంది.

ఆ ఇల్లు ఒక ఐ.సి.యస్ అధికారిది. ఆయన కేంద్ర ప్రభుత్వంలో ఒక ఉన్నతోద్యోగి. ఆయన పేరు **'రతన్‌కుమార్ నెహ్రూ'** **ఆయన ఇల్లాలు శ్రీమతి రాజన్ నెహ్రూ.** ఆ పెద్దాయన భారతదేశ ప్రధానమంత్రి పదవీ బాధ్యతలను స్వీకరించడానికి అలహాబాద్ నుండి ఢిల్లీకి

వచ్చి ఆయన బంధువు ఇంట్లో బసచేస్తారు. ఆయనే పండిత **జవహర్‌లాల్ నెహ్రూ.** భారతదేశ ప్రథమ ప్రధాని ఆయన. అంతటి ఉన్నత పదవీ బాధ్యతలను చేపట్టటానికి వచ్చిన సమయంలో ఆయన జేబులో డబ్బులు లేవంటే నమ్మశక్యంగాని నగ్నసత్యం అది. ఆయన ఆగర్భ శ్రీమంతుడు. ఆయన తండ్రి మోతిలాల్ నెహ్రూ గొప్ప న్యాయవాది. ఆ రోజులలోనే నెలకు ముప్పైవేలు సంపాదించేవాడుట. తన కుమారుని అతి గారాబంగా పెంచాడు. ఇంగ్లండులోని **'హారో'** విశ్వవిద్యాలయానికి చదువుకోసం పంపించాడు. అక్కడ న్యాయశాస్త్ర పట్టమును పొంది స్వదేశానికి తిరిగి వస్తారు జవహర్‌లాల్ నెహ్రూ. మహాత్మా గాంధీజీ బోధనలు విని న్యాయవాద వృత్తిని చేబట్టకుండా, తన జీవితాన్ని దేశసేవకు అంకితం చేసుకొనిన త్యాగశీలి మన పండిత నెహ్రూ.

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని పలుపర్యాయములు జైలుకు వెళ్ళుతారు. జైలులో కాలం వృథా చేయకుండా ఎన్నో అమూల్యమైన గ్రంథాలు చదివేవారు. బయటకు వచ్చిన తరువాత ఇంగ్లీషులో ఎన్నో గ్రంథాలు కూడా వ్రాసారు. ఆయన వ్రాసిన గ్రంథాలలో Glimpses of world history, Discovery of India మరియు తన 'స్వీయచరిత్ర' మొదలైనవి అత్యంత ప్రాచుర్యాన్ని పొందాయి. జైలునుంచి తన ప్రియతమ పుత్రిక ఇందిరకు ఎన్నో లేఖలు కూడా వ్రాసారు. అవి విశేషమైన ప్రచారాన్ని పొందాయి. కాలాన్ని వృథాచేయడమంటే ఆయనకు మనస్కరించేది కాదు. 'లిఫ్టులో వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు కూడా పుస్తకం చదువుతుండేవారుట. చదవటమంటే ఆయనకు అంత ఆసక్తి. ***"నేను నా జీవితంలో తగ్గించుకోలేక పోయిన ఖర్చు ఒకటే, అదే పుస్తకాలు కొంటూ వుండటం"*** అని అంటారు నెహ్రూ. కనపడిన ప్రతి మంచి పుస్తకమూ కొనేవారు, చదివేవారు. అది ఆయన ప్రవృత్తి.

1954 సం॥లో మన దేశంలో వున్న వివిధ భాషలను అభివృద్ధి పరచాలనే పరమావధితో ***'సాహిత్య అకాడమీ'***అనే సంస్థ స్థాపించబడింది. ఆ సంస్థకు తొలి అధ్యక్షుడు ఆయనే. మరణించే నాటిదాకా ఆయనే ఆ సంస్థకు అధ్యక్షుడు. ***"అకాడమీ అధ్యక్షుడి నైన నా కార్యకలాపాలలో భారత ప్రధాన మంత్రి (అప్పట్లో ఆయనే ప్రధానమంత్రి) జోక్యం కల్పించుకోవడం నాకు అంతగా ఇష్టం వుండదు"*** అని అంటారు నెహ్రూ. సాహిత్యమంటే ఆయనకు అంతటి అపార గౌరవం ఉండేది.

పండిత నెహ్రూ సాహితీవేత్తేకాదు, రాజకీయ దురంధురుడే కాదు, గొప్ప మానవతావాది కూడాను. అద్దెకారు తోలి, బ్రతికే 'బలబీర్ సింగ్' అనే డ్రయివర్ నిత్యమూ

'తీన్‌మూర్తి' భవనం గేటువద్ద నిలబడి, పార్లమెంటుకు వెళ్ళేటప్పుడు నెహ్రూగారికి నమస్కరించి వెళ్ళేవాడు. అది అతని నిత్యకృత్యం. ఒకరోజున అతనిని పిలిచి భుజంపై చేయి వేసి *"నీవు రోజూ ఇక్కడికి వచ్చి నమస్కారం చేస్తున్నావు. ఎందుకోసం? నావల్ల ఏమైనా సహాయం కావాలా?"* అని అడుగగా *"మిమ్ములను చూస్తే ఎంతో సంతోషంగా ఉంటుంది. అంతకంటే మరేంలేదు"* అంటాడు బలబీర్ సింగ్. అప్పుడు నెహ్రూ *"నన్ను చూస్తే నీ ఆకలి తీరుతుందా! నీ అద్దెకారు వల్ల నీ కుటుంబం పోషించబడుతున్నదా?"* అని అడుగుతాడు. అప్పుడు *"నా కుటుంబ పోషణకు కావలసిన ఆదాయం ఇంతకు పూర్వం వస్తుండేది. కాని దురదృష్టవశాత్తు, ఈ మధ్య నాకారు ప్రమాదానికి గురైంది. సంపాదన దెబ్బతిన్నది, అప్పుల పాలయ్యాను'* అంటాడు సింగ్. నెహ్రూ అతని కారును చూచి *"ఈ కారు ఈ విధంగా ఉంటే, ఎవరు అద్దెకు తీసుకుంటారు? వేరే కారు కొని బాగా సంపాదించు"* అని చెబుతాడు. సింగ్ తలవంచుకొని *"నాదగ్గర పైకం లేదు బాబు! బ్యాంక్ వాళ్ళను అడిగితే జామీను కావాలన్నారు. నాకు ఎవరు జామీను యిస్తారు?"* అంటాడు సింగ్. *"సరే! రేపు బ్యాంక్‌లో ధరఖాస్తు యివ్వు! జామీను ఎవరు? అని అడిగితే నాపేరు దరఖాస్తులో వ్రాయి! నేను రేపు మధ్యాహ్నం బ్యాంకుకు వస్తాను"* అని చెప్పి పార్లమెంటుకు వెళ్ళుతాడు నెహ్రూ. మరుసటి దినం బ్యాంక్‌కు వెళ్ళి దరఖాస్తు మేనేజర్‌కు యిస్తాడు సింగ్. మేనేజర్ ఆ దరఖాస్తును చూచి *"నీకేమైనా పిచ్చి పట్టిందా! పెద్దవారి పేరు చెప్పి మోసం చేయాలనుకుంటున్నావా!* అని గద్దించి బయటకు వెళ్ళకొడుతాడు. ఏమి చేయాలో తోచక గేటువద్దనే నిలుచుంటాడు సింగ్. ఇంతలో ఒక చిన్న కారువచ్చి ఆగుతుంది. నెహ్రూ ఆ కారునుంచి దిగి సింగ్‌ను చూస్తాడు. *"అప్పు పత్రాలు ఇచ్చావా?"* అని అడుగగా *"ఇచ్చాను బాబూ! వారు నా మాట నమ్మలేదు"* అంటాడు సింగ్. అప్పుడు అతనిని వెంటబెట్టుకొని బ్యాంక్‌లోనికి వెళ్ళుతాడు నెహ్రూ. మేనేజర్ లేచి నిలబడి *"సార్! మీరు కబురు పంపితే నేనే వచ్చేవాడను కదా!"* అని అంటాడు మేనేజర్. ఆ అప్పు దరఖాస్తు మీద జామీను సంతకం చేసి వెళ్ళిపోతాడు నెహ్రూ. ప్రధానమంత్రి పదవిలో వున్న గొప్పవ్యక్తి సామాన్య కారు డ్రయివరుకు సహాయం చేయడాని కోసం బ్యాంకుకు రావడం విశేషం కాదా! ***మహనీయులకు భేదభావాలు ఉండవు. అందరినీ సమంగా చూడగలుగుతారు. బాధలలో ఆదుకుంటారు. అది మహనీయుల లక్షణం. ఏమీ లేని విస్తరి ఎగిరెగిరి పడుతుంటుంది. అన్నీ వున్న విస్తరి అణిగి, మణిగి ఉంటుంది. అటువంటిదే మహనీయుల ప్రత్యేకత.***

ఒకసారి ప్రధాని నెహ్రూ కామన్‌వెల్త్ ప్రధాన మంత్రుల సభలో పాల్గొనేందుకు లండన్ వెళ్ళుతారు. ఆయన వెంట వ్యక్తిగత కార్యదర్శి 'మత్తాయ్' కూడా వెళ్ళుతాడు. సమావేశం ముగించుకొని హోటల్‌కు వస్తారు నెహ్రూ. దేనికోసమో వెదుకుతుంటే *"సార్!*

మీరు దేనికోసం వెదుకుతున్నారు?" అని అడుగుతాడు మత్తాయ్. *"నా బనియన్ ఇక్కడ వదలివెళ్ళాను అది కనిపించటం లేదు"* అంటారు నెహ్రూ. *"సార్! ఉతకడానికి దానిని చాకలికి వేశాను"* అని చెబుతాడు మత్తాయ్. అప్పుడు *"దానిని ఉతకడానికి దోభీకి యివ్వాలా? దానికి డబ్బుచెల్లించాలి గదా! నేనే దానిని ఉతకాలనుకున్నాను"* అంటారు నెహ్రూ. ***మహనీయులు తమ పనులను తామే చేసుకుంటారు. ఇతరుల మీద ఆధారపడరు.*** ఈ సంఘటన నెహ్రూగారి నిరాడంబరతను చాటుచున్నది.

నెహ్రూ చిన్నతనంలో ఒక చిన్న సంఘటన జరిగింది. తండ్రి మోతీలాల్ గదిలో రెండు కలాలుండేవి. తండ్రికి చెప్పకుండా ఒక కలం తీసుకుంటాడు జవహర్‌లాల్. తండ్రి వచ్చి ఎంత వెతికినా రెండవ కలం కనిపించదు. చివరకు అసలు విషయం బయట పడుతుంది. తండ్రి చేతిలో దెబ్బలు తింటాడు జవహర్‌లాల్. ఆ దెబ్బలకు మందు కూడా వ్రాయవలసి వస్తుంది. అంత జరిగినా జవహర్‌లాల్‌కు ఇసుమంతైననూ తండ్రిపై కోపం రాకపోగా నేరం చేసినవారు శిక్ష అనుభవించాల్సిందేనని భావిస్తాడు. శిక్ష లేకుండా చేసుకోవాలంటే అసలు నేరమే చేయకూడదనే నిర్ణయానికి వస్తాడు జవహర్‌లాల్. ***మహనీయులు చిన్నచిన్న సంఘటనల ద్వారా జీవితంలో పెద్ద పాఠాలు నేర్చుకుంటారు. సామాన్యులు మాత్రం అసలు ఆ సంఘటనలనే మరచిపోతారు. సామాన్యులకు గొప్పవారికి మధ్యనున్న తేడా అదే.***

"నా పుట్టినరోజును బాలల దినంగా గడపండి. అలా చెయ్యడమే నా అభిమతం" అని చెబుతారు పండిత జవహర్‌లాల్ నెహ్రూ. ఆ పండితుడు పుట్టినరోజు 1889 సం॥ నవంబర్ 14వ తేదీ. ఆ దినమునే బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఆయనకు పిల్లలంటే చాలా ప్రేమ. ఎంత వత్తిడి పని ఉన్నా సరే! పిల్లలొస్తే చాలు! పిల్లలతో పిల్లవాడుగా ఆడుకొనేవాడు మన నెహ్రూ. పిల్లలతో మాట్లాడటమంటే, ఆటలాడటమంటే, కాలం గడపటమంటే ఆయనకు అంతులేని సంతోషం. ***పిల్లలు దేవునితో సమానం గదా! కనుక పిల్లలలోనే దేవుడ్ని చూచి ఆనందించేవాడు నెహ్రూ.***

స్వతంత్ర భారతదేశానికి 17 సంవత్సరాలపాటు ప్రధానమంత్రిగా, వ్యవహరించి, శాంతి దూతగా, నవభారత నిర్మాతగా చాచా నెహ్రూగా పేరుప్రఖ్యాతుల నందుకొని, 1964 సం॥ మే 27వ తేదీన పరమపదించుతారు.

చాచా! నెహ్రూను మరువకండి! బాలల దినోత్సవాలలో పాల్గొనండి! స్ఫూర్తిని పొందండి.



'ఆంధ్రకేసరి'

టంగుటూరి ప్రకాశం పంతులు

*"సైమన్ గోబ్యాక్ - సైమన్ గోబ్యాక్... "*అనే నినాదాలతో చెన్నపట్టణపు పురవీధులు ప్రతిధ్వనిస్తున్నాయి. అశేష ప్రజానీకం ప్రవాహంలా ముందుకు సాగి పోతున్నది. ఆ ప్రజా ప్రవాహానికి అడ్డుకట్ట వేయగల శక్తి ఎవరికీ ఉన్నట్లు కనిపించలేదు. పోలీసులు లాఠీలను ప్రయోగించారు. ప్రయోజనం లేకపోయింది. తుపాకులు కాల్చారు. అజ్ఞాత దేశభక్తులు కొందరు నేలకొరిగారు. ప్రజలు కోపోద్రిక్తులయ్యారు. పోలీసులపై ప్రజలు రాళ్ళు విసరనారంభించారు. దొరికినవాడినల్లా పోలీసులు లాఠీలతో చితకబాదుతున్నారు. శరీరాలు చిట్లి రక్తం ప్రవహిస్తున్నది. చేతులు విరిగిన వారు కొందరు, కాళ్ళు విరిగిన వారు మరికొందరు, తలలు పగిలినవారు మరిఎందరో! అది ఒక రణరంగంగా మారింది. ఇంతలో వీరావేశంతో ఒక సింహకిశోరం ముందుకు దూకింది. చొక్కా గుండీలు తీసి, ఎదురు రొమ్మును చూపిస్తూ *"కాల్చండి! సిద్ధంగా ఉన్నా!"* అని గర్జిస్తుంది ఆ యువ కిశోరం. *'ఊ! షూట్ చేయండి'* అని ఆజ్ఞాపిస్తాడు ఒక పోలీస్ అధికారి. వందలాది పోలీసులు కాల్చడానికి సిద్ధమై తుపాకులు గురిపెట్టి బారులు తీర్చి నిలుచుంటారు. ఇంతలో అశేష ప్రజానీకం త్రోసుకొని ముందుకు వచ్చి, ఆ యువ కిశోరం ముందు నిల్చుంటుంది. *"భారతమాతాకీ జై! సైమన్ గోబ్యాక్! ... "* నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగుతుంటుంది. పరిస్థితి విషమిస్తున్నదని భావించిన ఆ పోలీస్ అధికారి తుపాకులను దించమని ఆజ్ఞాపిస్తాడు. ఆ యువ కిశోరం మరల ప్రజల మధ్య నుండి వచ్చి, అగ్రభాగాన ఠీవిగా ముందుకు నడుస్తుంటుంది. పోలీసులు చేయగలిగేదేమీ లేక ప్రేక్షకులుగా చూస్తుంటారు. ఆ చారిత్రాత్మక సంఘటన దేశాన్ని ఉర్రూతలూగించింది. ఎక్కడ చూచినా ఊరేగింపులు, నిరసన ప్రదర్శనలే.

ఎదురురొమ్ము చూపించి, *'కాల్చండ్రా!'* అని సింహగర్జన చేసిన ఆ యువ కిశోరం ఎవరో తెలుసా? ఆయనే మన **ప్రకాశం పంతులు**. ఆయన ఆనాడు ప్రదర్శించిన అద్భుత ధైర్య సాహసాలను ప్రశంసిస్తూ, ముట్నూరి కృష్ణారావుగారు కృష్ణా పత్రికలో సంపాదకీయం వ్రాసారు. ఆ సంపాదకీయంలో 'ముట్నూరి' వారు మొట్టమొదటగా ప్రకాశం గారికి 'ఆంధ్రకేసరి' అనే బిరుదు యిచ్చారు. ఆ బిరుదుని ప్రకాశంగారికి ప్రదానం చేసిన ఘనత ముట్నూరివారికి, కృష్ణా పత్రికకే దక్కుతుంది.

ప్రకాశం అద్వితీయమైన ధైర్య సాహసాలుగల ధీశాలి. పిరికి జీర లేని సమర వీరుడు. స్వార్థమెరుగని త్యాగశీలి. వారిది నిర్మలమైన దేశభక్తి, నిష్కపటమైన మనసు - ఇవన్నీ ప్రకాశం గారికి పుట్టుకతోనే వచ్చిన సద్గుణాలు. ఎక్కడ ఏ ప్రమాదం సంభవించినా, ఎవరికి ఆపదలు వచ్చినా, అక్కడ ప్రకాశంగారు ప్రత్యక్షమయ్యేవారు. బారిష్టర్‌గా లక్షలు ఆర్జించిన ఐశ్వర్యవంతుడయినప్పటికీ, ప్రజాసేవకు అంకితమై, తమ సర్వస్వాన్ని కోల్పోయి, అవసాన దశలో కనీస అవసరాలకు కూడా ధనంలేక అతి పేదరికాన్ని అనుభవించిన ఆదర్శశీలి. మన దేశంలో ***అంతటి దారిద్ర్యాన్ని అనుభవించిన వారిలో ప్రథముడు 'దేశబంధు' చిత్తరంజన్ దాస్ అయితే ద్వితీయుడు 'ఆంధ్రకేసరి' ప్రకాశం పంతులు.***

ఆయన సంపాదించిన స్థిరచరాస్థులను పరిశీలిస్తే, ఆయన చేసిన త్యాగం ఎంతటిదో మనకు బోధపడుతుంది, ఎంతటి వారికైనా ఆశ్చర్యం వేస్తుంది. 1. ఊటీలో రెండు పెద్ద బంగళాలు (వాటి విలువ ఆనాడే రెండు లక్షలు) 2. మదరాసు మైలాపూర్‌లో ఇల్లూ, తోట (లక్ష రూపాయిలు) 3. రాజమండ్రిలో ఇల్లు, 6వేల చ.గజముల స్థలం (50 వేలు) 4. రాజమండ్రి సెంట్రల్ జైలు సమీపంలో 100 ఎకరాల భూమి (విలువ తెలియదు) 5. పశ్చిమ గోదావరి జిల్లా పోణంగిలో 40 ఎకరముల పొలం (విలువ తెలియదు) 6. రైల్వే షేర్లు లక్షరూపాయిలు 7. గవర్నమెంటు బాండ్లు ఒక లక్ష 8. మద్రాస్ కార్పోరేషన్ డిబెంచర్లు 15 వేల రూపాయలు 9.ఆంధ్రా బ్యాంకులో 50వేల రూపాయిల డిపాజిట్లు ***(ఈ వివరాలన్నీ ప్రకాశం గారి జైలు డైరీలో గ్రహించబడినాయి)*** ఇప్పటి అంచనాల ప్రకారం ఎన్ని కోట్లు ఉంటుందో...!

స్వాతంత్ర్య పోరాటకాలంలో ఈ స్థిర, చరాస్థులన్నీ కరిగిపోయి, ఆయన అవసాన దశలో, ఎవరైనా సహృదయులు టిక్కెట్టుకొని యిస్తే, రైలులో ప్రయాణం చేయగలిగే దుస్థితి ఏర్పడినదంటే, ఆశ్చర్యంగానే ఉంటుంది.

1921 సం॥లో గాంధీజీ పిలుపు నందుకొని, నెలకు వేలాది రూపాయిలు ఆదాయం వచ్చే న్యాయవాద వృత్తిని త్యజించి, స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. తన పెద్దకుమారుడు మరణావస్థలో వున్నప్పటికీ, అతనిని తన తమ్ముడి దగ్గరవదిలి, కలకత్తాలో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ సభలకు హాజరైన నిస్వార్థ జీవి ప్రకాశం. 1921 సం॥లో మూడు లక్షల మూలధనం పెట్టి, ఒక లిమిటెడ్ కంపెనీని ఏర్పాటు చేసి, శాసనోల్లంఘన కార్యక్రమాలను ప్రచారం చేయడానికి 'స్వరాజ్య' అనే ఆంగ్ల పత్రికను స్థాపించారు. మద్రాసు రాష్ట్ర రెవిన్యూ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, మరియు 1953 సం॥లో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడి , అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి ప్రజల మన్ననలను అందుకొనిన చక్కటి పరిపాలనా దక్షుడు ప్రకాశం.

అకుంఠిత దీక్షతో ఆరు దశాబ్దాలపైగా మాతృదేశారాధన చేసి, ప్రజా హృదయాలలో చెరగని ముద్రవేసి, ప్రజల అవ్యాజ అనురాగాన్ని, గౌరవాన్ని, ఆదరణలను పుష్కలంగా అనుభవించిన ప్రజలమనిషి అయిన ఆంధ్రకేసరి ప్రకాశం, 1957 సం॥ మే 20వ తేదీన కీర్తి శేషులైనారు. జాతి యావత్తు కన్నీరు కార్చింది. ముఖ్యంగా ఆంధ్ర ప్రజానీకం తమ ఆత్మ బంధువును కోల్పోయినందులకు విలపించింది. అయితే ఈనాడు ఆ త్యాగమూర్తి ఎందరికి గుర్తు ఉన్నారు?

భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు "అంత పట్టుదలతో, ఉత్సాహంతో, త్యాగదీక్షతో అన్ని ఏండ్లు దేశసేవ చేసిన వ్యక్తి చరిత్రలో మరొకరు లేరు. ప్రకాశం గారికి చేయెత్తి నమస్కరించడం మన విధి" అన్నారు. ఇది వాస్తవం . ఆ పుణ్యమూర్తికి భక్తి శ్రద్ధలతో జోహారులర్పిద్దాం.

'అన్యాయం, అక్రమం జరుగుతుంటే చూస్తూ ఊరుకోవటం ప్రాజ్ఞుల లక్షణం కాదు. మన కళ్ళముందు అన్యాయం జరుగుతుంటే మనకెందుకులేయని ఊరుకోరాదు. అన్యాయాన్ని అధర్మాన్ని ధైర్యంగా ఎదుర్కొనాలి. చేతులు ముడుచుకొని కూర్చోవడం బలహీనతకు చిహ్నం. ఉదాసీన వైఖరి అసమర్థ లక్షణం. అసమర్థులుగా వుండటంకంటే మరణం మేలు'

- టంగుటూరి ప్రకాశం



వీరకిశోరం భగత్సింగ్

'అమ్మా! మీరెవరూ, నా శవం కోసం ఇక్కడికి రాకండి! కుల వీర్యుణ్ణి సాగనంపిన, మీరు కన్నీరు కారిస్తే, చూచినవారు ఈ వీరకిశోరం తల్లి కన్నీరు కారుస్తుంది అనుకుంటారు. అమ్మా! తాతగారు బాగా పెద్దవారయ్యారు. మీరు గ్రామానికి వెళ్ళి వారి బాగోగులు చూడండి! అమ్మా! ఈ మధ్య నా బరువెంత పెరిగిందో, తెలుసా!...."

అంటూ పెద్దగా నవ్వుతాడు ఆ వీర కిశోరం. అది 1931 సం॥ మార్చి 23వ తేది. ఆ వీరకిశోరాన్ని చూడాలని అతని తల్లి, బంధువులు, మిత్రులు జైలు వద్దకు వెళ్ళిన సమయం అది. అదే వారి చివరి దర్శనం. అప్పుడు వెళ్ళిన వారిలో ఆ యువకునిలో విప్లవ బీజాలను నాటిన అర్జున్‌సింగ్ కూడా ఉంటాడు. ఆ విప్లవవీరుని తల నిమురుతూ ఏదో చెప్పాలనుకుంటాడు అర్జున్‌సింగ్. కాని ఉద్వేగంతో మాటలు పెగల్లేదు. కొంత దూరంవెళ్ళి కన్నీరు కారుస్తాడు. అదే ఆ వీరకిశోరం జీవితంలో చివరిరోజు అయినప్పటికి ఆనాడు అతను ప్రదర్శించిన ధైర్యాన్ని చూచి జైలు అధికారులు సహితం నివ్వెరపోతారు. ఆ వీరకిశోరం ఎవరో తెలుసా! ఆంగ్లదొరలను గడగడలాడించిన *'భగత్సింగ్'*.

1929 సం॥లో *"లాహోర్ కుట్రకేసు"*లో నేరం మోపి కారాగారంలో బంధించబడ్డారు భగత్సింగ్, సుఖదేవ్, రాజగురులు. ఆ జైలులో ఖైదీలకు కనీస సదుపాయాలు కూడా లేకపోవటం వలన భగత్సింగ్ ప్రభృతులు నిరసనగా 114 రోజులపాటు నిరాహార దీక్ష చేసారు. ఆ నిరసనదీక్ష యావత్ దేశాన్ని కదిలించివేస్తుంది. ఆహారం తినడానికి నిరాకరించిన ఆ వీరకిశోరాల గొంతులలో గొట్టాలు దూర్చి బలవంతంగా ఆహారం, నీరు పోయడానికి ప్రయత్నిస్తారు జైలు అధికారులు. పైశాచికంగా పోయబడిన ఆహారాన్నంతటిని బయటకు కక్కివేసి తమ దీక్షను కొనసాగిస్తుంటారు ఆ వీరకిశోరాలు.

1930 సం॥ అక్టోబర్ 7వ తేదీన ప్రత్యేక కోర్టు భగత్సింగ్, సుఖదేవ్, రాజగురులకు 'మరణశిక్ష' విధిస్తుంది. తన బిడ్డ (భగత్సింగ్) ప్రాణాలను కాపాడమని స్పెషల్ ట్రిబ్యునల్‌కి అప్పీలు చేస్తాడు సర్దార్ కిషన్‌సింగ్. ఆ విషయమును తెలిసికొని భగత్సింగ్ తన తండ్రికి ఒక లేఖ వ్రాస్తాడు. ఆ లేఖలో ' *'నన్ను లాహోర్ కుట్రకేసునుంచి తప్పించడానికి స్పెషల్ ట్రిబ్యునల్‌కి తమరు అప్పీలు చేసినట్లు తెలిసికొని చాలా ఆశ్చర్యపోయాను. భారత దేశ దాస్య విముక్తికై, మీ జీవిత సర్వస్వాన్ని బలిపెట్టిన మీరేనా! ఈ పని చేసింది? అని బాధపడ్డాను. నాన్నగారు! ఈ విషయం నా మనస్సు నెంతగానో కలిచివేస్తున్నదండీ! నిర్దోషినని కోర్టు ముందు వాంగ్మూలం యిచ్చి, ఏదో విధంగా బయటపడాలనే కోరిక నాకు ఏమాత్రం లేదు. మీ కొడుకునయినందులకు తండ్రిగా మీ ఆశల్ని, ఆకాంక్షలను గౌరవిస్తాను. కాని మీరనుకుంటున్నట్లుగా, నా దృష్టిలో నా జీవితం అంత విలువైనది కాదు. సిద్ధాంతాలను సైతం బలిపెట్టేటంత అమూల్యమైనది మాత్రం కాదు నా జీవితం. ఈ సమయంలో దేశంలో విప్లవాగ్ని చల్లారకుండా వుండాలంటే ప్రాణత్యాగం చేయడం ఒక్కటే ఉత్తమమార్గం".* అని వ్రాస్తాడు భగత్సింగ్. భారత దేశ స్వాతంత్ర్య మొక్కటే అతని లక్ష్యం. ఆ లక్ష్యసాధనలో ఎన్ని యిక్కట్లు వచ్చినా వాటినన్నింటిని ధైర్యంతో ఎదిరించి ముందుకు కొనసాగిపోవడమే ఆయన ధ్యేయం. ఆ ధ్యేయసాధనలో తన జీవితాన్ని సమర్పించిన యోధుడు, వీరుడు, భగత్సింగ్.

1931సం॥ మార్చి 24 ఉదయం భగత్సింగ్, సుఖదేవ్, రాజగురులను ఉరి తీయాలని ఆంగ్ల ప్రభుత్వం నిర్ణయిస్తుంది. సహజంగా తెల్లవారుజామున ఉరి తీయడం ఆనవాయితి. కాని, దానికి భిన్నంగా మార్చి 23వ తేది రాత్రి గం॥ 7-27 ని॥లకు ఆ వీరకిశోరాలను రహస్యంగా ఉరితీసి, ఫిరోజాబాద్ వద్ద, సట్లేజ్ నది ఒడ్డున ఆ మృత శరీరాలను తగులబెడుతారు జైలు అధికారులు.

1931 మార్చి 23వ తేదీ సాయంత్రం చీకటి పడిన తరువాత జైలులో భగత్సింగ్ ఉన్న గదికి వెళ్ళి జైలర్ "Are you Ready" అని అడుగుతాడు. "Yes! I am ready" అని సమాధానం ఇస్తాడు భగత్సింగ్. జైలు ఆవరణలోనే ఉరితీయడానికి ప్రత్యేకంగా ఒక వేదిక నిర్మాణం చేస్తారు. జైలు గదులనుండి సాయుధ భటులు ఆ బలిపీఠం మీదకు తీసుకొని వెళ్ళుతుంటే, ఆ ముగ్గురు యువకిశోరాలు **"ఇంక్విలాబ్ జిందాబాద్"**,

'వందే మాతరం' అంటూ ముందుకు నడుస్తుంటారు. మరుక్షణంలో తమ ప్రాణాలను కోల్పోతామని వారికి బాగా తెలుసు. అయినప్పటికి వారి ముఖాలమీద చిరునవ్వు తాండవిస్తూనే ఉంటుంది. ఆంగ్లేయులను గడగడలాడించిన ఆ ముగ్గురు వీర కిశోరాలను బలిపీఠమెక్కిస్తారు. చివరిసారిగా తల్లి భారతికి వినమ్రులై నమస్కరిస్తారు. అక్కడనే ఉన్న సీనియర్ ఆంగ్ల జైలర్ వైపు వేలు ఎత్తి చూపుతూ భగత్సింగ్, **"మీరు చాలా అదృష్ట వంతులు. *భారత స్వాతంత్ర్య సంగ్రామ సైనికులు నిర్భయంగా, నవ్వుతూ మృత్యువును ఎలా ఆహ్వానిస్తారో! కళ్ళారా చూచే మహత్తర అవకాశం ఈనాడు మీకు లభించబోతున్నది. మేము మీకు దానిని చూపిస్తాం. అది ఒక అపూర్వ సంఘటన*"** అని అంటాడు భగత్సింగ్. సరీగా గం॥ 7-20 ని॥లకు ఆ యువకిశోరాల ముఖాలకు నల్లటి ముసుగు వేయ బడుతోంది. ఆ ముగ్గురూ ఒకరినొకరు మనసారా గాఢంగా కౌగలించుకొని, **"ఇంక్విలాబ్ జిందాబాద్'** 'అంటూ బిగ్గరగా నినాదం చేస్తారు. మరుక్షణంలో ఆ విప్లవ వీరకిశోరముల మెడలు చుట్టూ ఉరిత్రాడు చుట్టబడుతుంది. **'వందేమాతరం'** అంటూ ఆ ముగ్గురు వీరకిశోరాలు ఒకే పర్యాయం సింహగర్జన చేస్తారు. సరీగా గం॥ 7-27 ని॥లకు ఆ బలిపీఠం వేదిక క్రింద కొయ్యపలక 'టక్' అని శబ్దం చేస్తూ ఊడిపడుతుంది. ఆ వీరకిశోరాల పంచ ప్రాణాలు అనంతాకాశంలో విలీనమైపోతాయి. భారతమాత కన్నీరు కారుస్తుంది. భరత జన హృదయాలలో వారు ఎప్పటికీ అమరవీరులే. వారి ఆత్మ శాంతికి జోహారులర్పిద్దాం!

"విప్లవమంటే బాంబుల పిస్తోళ్ళ సంస్కృతి కాదు. విప్లవం నుంచి మేం ఆశిస్తున్న ప్రయోజనం ఏమిటంటే, అన్యాయం పునాది మీద నిలబడివున్న వర్తమాన వ్యవస్థలో మార్పువచ్చి తీరాలి. కొందరు దోపిడీదారులు శ్రామికుల శ్రమ ఫలితాన్ని దోచుకుంటున్నారు. శ్రామిక వర్గమే సమాజపు వాస్తవిక పునాది. ఈ వాస్తవము గుర్తించబడేట్లు చేయుటమే మా లక్ష్యం. విప్లవం మానవజాతి జన్మహక్కు. స్వాతంత్ర్యం సమస్తమానవుల జన్మహక్కు. అట్టి విప్లవసాధనలో మేం అగరువత్తుల్లాగా కాలిపోవడానికి సిద్ధంగా ఉన్నాం".

-భగత్సింగ్



'ప్రముఖ సంఘసంస్కర్త'

కందుకూరి వీరేశలింగం

సమాజంలో మూఢనమ్మకాలు, మూఢాచారాలు పరాకాష్ఠ నందుకున్న దుర్దినాలలో; దేవుడి పేరిట అనేక అవాంఛనీయమైన పనులు చేయడానికి ఏమాత్రం వెరువని దినాలలో; హింసా ప్రవృత్తి ప్రబలి, నోరులేని అమాయక జంతువులను నిర్దాక్షిణ్యంగా హింసిస్తూ, అది దేవుని అనుగ్రహాన్ని పొందవచ్చునని ప్రచారం చేస్తున్న ఛాందసకాలంలో; డబ్బుకోసం కక్కుర్తిపడి, తమ కన్నబిడ్డలను కాటికి కాళ్ళుజాపిన ముదుసలులకు కట్టబెడుతున్న నికృష్టకాలంలో; దురదృష్టవశాత్తు ఆ ముదుసలి మరణిస్తే, ముక్కుపచ్చలారని ఆ కన్యల శిరోజాలను తీసివేయించి, తమ ఇండ్లలో పనికత్తెకంటే అన్యాయంగా వెట్టిచాకిరి చేయించుకొనే పరిస్థితులలో *"నేను ఉన్నాను! జాగ్రత్త!"* అని గర్జించి, అమాయక, నిస్సహాయక ప్రజలకు అండగా నిలిచి ఆనాటి సమజాన్ని చైతన్య వంతం గావించిన మహనీయులలో ఒకరు, తెలుగునాట జన్మించిన సంఘసంస్కర ణోద్యమ సారథులలో ప్రథముడు ఎవరో తెలుసా? ఆయనే ***కందుకూరి వీరేశలింగం పంతులు.***

ఆయన 1848 సం॥ ఏప్రియల్ 16వ తేదీన రాజమహేంద్రవరంలో జన్మించారు. రాజమండ్రి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తూనే న్యాయవాది పరీక్షలో ఒక భాగానికి పరీక్ష వ్రాసి ప్యాసయ్యారు. ఆ న్యాయవాద వృత్తిలో అబద్దాలు ఆడవలసి వస్తుందని భావించి, న్యాయవాది కాదలచుకోక, బాదర బందీలేని ఆదర్శ ఉపాధ్యాయ వృత్తిలోనే స్థిరపడదలచుకున్నారు 'కందుకూరి'. ఆ తరువాత కొంత కాలం మద్రాసులోని

రాజధాని కళాశాలలో గూడా ప్రధానాంధ్ర పండితుడుగా పని చేశారు. మొదటి నుంచీ న్యాయంకోసం నిర్భయంగా పోరాడే స్వభావం ఆయనది. ఈ విషయాన్ని ఆయన తన స్వీయ చరిత్రలో కూడా ఇలా వ్రాసుకున్నారు. *"ఎక్కడ? ఏ అక్రమము కనబడినా సహించెడి స్వభావము నాదికాదు. అక్రమమునకు ప్రతిక్రియ జూచేంతవరకు నా మనస్సునకు ఊరట కలుగదు"* అని ఆయన వ్రాసుకున్నారు.

రాజమహేంద్రవరంలో దీర్ఘవ్యాధితో బాధ పడుతున్న ఒక వ్యక్తి జబ్బును కుదురుస్తానని చెప్పి, ఒక భూత వైద్యుడు వారింట్లో చేరి నిత్యమూ 'హ్రాం, హ్రీం' అంటూ జపాలు చేస్తుంటాడు, ఏవేవో మంత్రాలు చదువుతుంటాడు. నెలరోజులైనా ఆ జబ్బు ఏమాత్రం తగ్గదు. కాని డబ్బు యివ్వమని వత్తిడి చేస్తుంటాడు ఆ భూతవైద్యుడు. కుటుంబీకులు కటిక బీదవారు కావటం వలననూ, ఆ జబ్బు కూడా కుదరకపోవటం వలననూ వారు డబ్బు యివ్వరు. ఆ భూతవైద్యుడు మాత్రం వారిని భయపెడుతుంటాడు. ఆ ఇంటి ప్రక్కననే ఉన్న ఒక అబ్బాయి, ఈ విషయాన్ని తెలుసుకొని, అక్కడకు వెళ్ళి ఆ భూతవైద్యునితో *"డబ్బు యివ్వరు, దిక్కున్నచోట చెప్పకో!"* అని డబాయించగా *"నిన్ను చేతబడిచేసి చంపేస్తా!"* అని ఆ భూతవైద్యుడు భయపెడుతాడు. ఆ పిల్లవాడు ఏమాత్రం భయపడక *"నీకంటే నాకు పెద్దమంత్రాలే వచ్చు. మళ్ళీ మాట్లాడావంటే శరభ సాళ్వ మంత్రం చదివి నిన్ను ఇక్కడనే నెత్తురు కక్కిస్తా!"* అనే సరికి ఆ భూతవైద్యుడు భయపడి అక్కడ నుంచి పారిపోతాడు. ఆ పిల్లవాడే పెరిగి పెద్దవాడై గొప్ప సంస్కర్త అవుతాడు. అన్యాయ, అక్రమ, అనాచారాలతో, మూఢనమ్మకాలతో కుళ్ళు కంపుకొడుతున్న ఆనాటి సమాజాన్ని ప్రక్షాళన చేసి, ఛాందస ప్రవృతిని పారద్రోలి నవ్యాంధ్ర నిర్మాతలలో ప్రముఖుడుగా పేరుగాంచుతాడు. నిజంగా నవ్యాంధ్ర నిర్మాతలలో మొదటి వరసలో మొదటి పీట ఆయనదే అనటంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఆ మహాపురుషుడే *'కందుకూరి'.*

విద్యార్థిగా ఉన్నరోజులలోనే కవిత్వం చెప్పేవాడు. పెరిగి పెద్దవాడై సుమారు 130 పుస్తకాలు వ్రాశాడు. ఒక్క మాటలో చెప్పాలంటే, పాఠ్యపుస్తకాలు మొదలు, పండితులకు పనికివచ్చే గ్రంథాలు కూడా వ్రాశాడు. కేవలం పండితులకే అర్థమయ్యే భాషను విడిచి పెట్టి అందరికీ సులభంగా తెలిసే భాషలో ఆయన రచనలు కొనసాగించాడు.

ఆనాటి సంఘమునకు ఉపయోగపడే రచనలు చేశాడు. ***వివేకవర్ధిని, హాస్య సంజీవిని మొదలైన పత్రికలను ప్రారంభించి, అనేక అభ్యుదయ కరమైన వ్యాసాలను ప్రజలకు అందించి వారిని చైతన్యవంతులను గావించాడు. ముఖ్యంగా స్త్రీ విద్యను ప్రోత్సహించే నిమిత్తమై 'సతీహితబోధిని' అనే మాస పత్రికను కూడా నడిపారు కందుకూరి.***

ఆయన ధనవంతుడు కాదు. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయలేదు. ఆయన చేసింది సామాన్య బడిపంతులు ఉద్యోగమే. అందులో తెలుగు మాస్టర్. అయినప్పటికీ ఆయన తెలుగు దేశానికి, తెలుగు సాహిత్యానికి గొప్పసేవ చేశారు. వచ్చే ఆదాయాన్నంతా సంఘ సంస్కరణోద్యమానికి ఖర్చు చేసిన మహనీయుడు ఆయన. తెలుగునాట ఆయన పేరు తెలియనివారే ఉండరు.

ఆ అబ్బాయికి ఎనిమిదవ యేటనే వడుగు చేశారు. అప్పటినుంచి అతడు శ్రద్ధా భక్తులతో మూడు వేళలా గోదావరి నదికి వెళ్ళి స్నానం చేసివచ్చి, విభూతి రేఖలు పెట్టుకొని సంధ్యా వందనం చేసేవాడు. భారత, భాగవత, భగవద్గీత గ్రంథాలలోని కొన్ని భాగాలు నిత్యమూ చదివేవాడు. చూడటానికి శుద్ధ శోత్రియుడులా కనిపించేవాడు. కాని పెరిగి పెద్దవాడయ్యే కొద్దీ, అర్థం లేని ఆచారాలన్నా, మూఢనమ్మకాలన్నా ఆయనకు అసహ్యం కలిగింది. వాటిని సంఘంలో రూపుమాపాలని ఆశించాడు. అంతమాత్రమున ఆయన నాస్తికుడు అనుకుంటారేమో! ఆయన ఎన్నటికీ నాస్తికుడు కాదు. **'మానవ సేవే మాధవసేవ'** అని ఆయన భావించేవాడు. తోటి మానవులకు ఉపయోగపడని వ్యక్తి ఎన్నటికీ దైవభక్తుడు కాలేడని ఆయన విశ్వాసం. ఈశ్వర చంద్ర విద్యాసాగర్, రాజారామ మోహన రాయ్‌ల ప్రభావం ఆయనమీద పడింది. వితంతువుల బాధలను వర్ణిస్తూ ***'బ్రాహ్మణవివాహం'***, లంచగొండి తనాన్ని అవహేళన చేస్తూ "ప్లీడర్ నాటకం" సతీ సహగమనమును, బాల్య వివాహాలను విమర్శిస్తూ, స్త్రీ పునర్వివాహాలను ప్రోత్సహిస్తూ ***"సత్యవతీ చరిత్ర"*** పిల్లలకు పనికి వచ్చే నీతి కథలు సంపుటి ***'నీతి కథామంజరి'*** మరియు 'రాజశేఖర చరిత్ర' మొదలగు గ్రంథములను రచించి, ప్రచురించారు. 1880సం॥లో **"కామెడీ ఆఫ్ ఎర్రర్స్"** అనే ఆంగ్లనాటకమును తెలుగులోనికి తర్జుమా చేసి **'చమత్కార రత్నావళి'** అనే పేరుతో తమ విద్యార్థుల ద్వారా ప్రదర్శనలు యిప్పించేవారు. కాళిదాసు

'అభిజ్ఞాన శాకుంతలము'ను తెలుగులోనికి అనువదించారు. 'ఆంధ్రకవుల చరిత్ర' అను గ్రంథమును కూడా రచించారు. తెలుగులో మొట్టమొదటి వచన ప్రబంధకర్త వీరేశలింగం గారే. ప్రథమంగా నాటకాన్ని తెలిగించింది ఆయనే. మహిళలకు మొదటి పుస్తకము ప్రచురించింది కూడా ఆయనే. ఆ గ్రంథములను తన స్వంత ఖర్చులతో ముద్రించి, వాటి పైన వచ్చిన ఆదాయాన్ని సంఘసంస్కరణోద్యమానికి వినియోగించేవారు. ఆయనకు 'గద్యతిక్కన' 'దక్షిణ హిందూదేశ విద్యాసాగర్' అని బిరుదులు కూడా లభించాయి.

రాజమహేంద్రవరంలో **'వితంతు శరణాలయము'** స్థాపించారు. తాను స్థాపించిన సంస్థలను నిర్వహించడానికి **'హితకారిణి'** సమాజాన్ని నెలకొలిపి, తన యావదాస్తిని ఆ సంస్థకు యిచ్చివేశారు. ఆ విధంగా పట్టుదలతో, నిరంతరం సాంఘిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తు, 1919లో మే 27న మద్రాసులోని కొమర్రాజు లక్ష్మణరావుగారి గృహంలో పరమ పదించారు **'కందుకూరి'**.

సంఘ సంస్కర్తలందరూ సాహితీవేత్తలు కాలేరు. సాహితీవేత్తలందరూ సంఘ సంస్కరణాభిలాషులు కారు. కాని, కందుకూరి వారిలో ఈ రెండూ కనిపిస్తాయి. తన రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి, సంస్కరణోద్యమాన్ని విజయవంతంగా నిర్వహించిన మహా పురుషుడు కందుకూరి వీరేశ లింగం పంతులు. అలాంటి సంఘ సంస్కర్తలు ప్రతి శతాబ్దానికి కనీసం ఒకరైన జన్మించుతే ఈ దేశం ఇంకా బాగు పడుతుందేమో!

"వినయ వివేకాదులను వృద్ధి పొందించుటకు అనుకూలపడని విద్య లేకపోయినను, దానివలన వచ్చెడి నష్టమేమియూ లేదు. సుగుణ సంపదను గడించుటకై విద్య నేర్వవలసినదే గాని, విద్యనిమిత్తమై సద్గుణములను విడువరాదు. పలువురు మూఢులైన నిరక్షరకుక్షులు చేరి చేయు హాని కంటెను, ఒక చదువుకున్న దుష్టుడు చేయు హానియే అధికము"

- కందుకూరి



డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు

"ఉస్మాన్‌గారు నాకు సన్నిహితులు. వారు కాలేజీలో మొదట నాకు సీనియర్, తరువాత నా క్లాస్‌మేట్, ఆ తరువాత నాకు జూనియర్. నేను ప్రొఫెసర్‌గా ఉన్నప్పుడు ఆయన వైస్‌ఛాన్సలర్, నేను వైస్‌ఛాన్సలర్‌గా ఉన్నప్పుడు, వారు ఛాన్సలర్"

అని ఒక సభలో ఒక గొప్పవ్యక్తి ఛలోక్తిగా మాట్లాడారు. ఆ మాటల ఆంతర్యమును అర్థంచేసుకొనిన సభికులందరూ చప్పట్లు కొట్టారు. ఆయన ఎవరో తెలుసా?భారతదేశమునకు ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఉన్నత పదవులనధిష్టించిన, ఒక మహో తత్త్వవేత్త, మేధావి. ఆయనే *డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు.* ఆయన ఉపన్యాసంలో ఛలోక్తులు, హాస్యోక్తులు తరచుగా దొర్లుతుండేవి. ఛలోక్తులు విసరటంలో ఆయనకు ఆయనే సాటి.

ఆయన ఒకసారి మన దేశంలోని ఒక పేరెన్నికగల ఆసుపత్రిలో కన్ను ఆపరేషన్ చేయించుకున్నారు. అది తృప్తికరంగా జరగలేదు. రెండో కన్ను ఆపరేషన్ కోసం లండన్ వెళ్ళే ముందు మాట్లాడుతూ ***"ఇక్కడ నన్ను శుక్రాచార్యుని చేశారు. ఇప్పుడు ధృతరాష్ట్రుని చేస్తారేమో!"*** అని భయపడి ఇప్పుడు లండన్ వెళ్ళుతున్నానన్నారు. స్వదేశంలో నున్న ఆసుపత్రుల దుస్థితిని సూటిగా చెప్పకుండా, ఛలోక్తిగా చెప్పారు. ఆ మహనీయుని మాటలను అర్థంచేసుకొనిన డాక్టర్లు సిగ్గుపడక మానరు. ***మహనీయులు సున్నితంగా హెచ్చరిస్తారు గాని, సూటిగా, కఠినంగా చెప్పరు.*** అదే వారి ప్రత్యేకత.

ఒకసారి మహాత్మా గాంధీజీ ***'ఆవుపాలను త్రాగడం కూడా మాంస భక్షణ అవుతుంది'*** అన్నారు అప్పుడు *"తల్లి పాలుత్రాగిన మనం పరోక్షంగా నరమాంస భక్షకులం కాదా?"* అని

రాధాకృష్ణ పండితులు అనేసరికి ప్రక్కన నున్న వారందరూ నవ్వారు. గాంధీజి నివ్వెర పోయారు. సమయస్ఫూర్తిగా, హాస్యంగా మాట్లాడటం రాధాకృష్ణ పండితుని స్వభావం. *కటువుగా మాట్లాడితే, అది యదార్థమే అయినప్పటికీ ఎదుటివారు బాధ పడుతారు. హాస్య ధోరణిలో మాట్లాడుతే బాధపడరు, పైపెచ్చు నవ్వుతారు. కనుక మనం కఠినంగా మాట్లాడకూడదు. కానీ అర్థమయ్యేట్లు సున్నితంగా హెచ్చరించడం నేర్చుకోవాలి. అది విజ్ఞుల లక్షణం.* ముఖ్యంగా అధ్యాపకులు అయినవారు దీనిని గ్రహించాలి, సహజంగా అల్లరి చేయటం, తప్పలు చేయటం పిల్లల లక్షణం. అధ్యాపకులు కోపగించి వారిని దండించరాదు. ఛలోక్తులతో హాస్యంగా మాట్లాడి పిల్లలను సరిదిద్దే ప్రయత్నం చేయాలి అధ్యాపకులు.

శ్రీమతి విజయలక్ష్మి పండిట్ 18 మాసాల పాటు రష్యాలో రాయబారిగా ఉన్నప్పటికీ, ఒక సారి కూడా ఆమెకు స్టాలిన్‌తో ఇంటర్వ్యూ లభించలేదు. అలాంటి పరిస్థితులలో రాధాకృష్ణన్ గారు రాయబారిగా రష్యాలో నియమింపబడినారు. అంతకు పూర్వం దౌత్యవ్యవహారాలతో ఆయనకు పరిచయమే లేదు. ఈ తత్త్వవేత్త అక్కడ నెగ్గుకొని రాగలడా? అనే సంశయం అందరిలో కలిగింది. అయితే ఆయన రోజుకు 18 గంటల పాటు పుస్తక పఠనంలోనే నిమగ్నుడై వుంటారనే సమాచారం స్టాలిన్‌కు తెలిసిందట. అది విన్నప్పటి నుంచి రాధాకృష్ణన్ గారిని చూడాలనే కోరిక స్టాలిన్‌లో కలిగింది. సాధారణంగా స్టాలిన్ ఏ దేశ రాయబారులను చూచేవారు కాదు. 1952 సం॥లో ఉపాధ్యక్ష పదవికి పోటీ చేయడానికి ఇండియాకు తిరిగి వస్తున్నప్పడు, స్టాలిన్ కోరికపై డా. రాధాకృష్ణన్ ఆయనను కలుసుకున్నారు. స్టాలిన్ ఆరోగ్య పరిస్థితిలో వచ్చిన మార్పును గమనించిన రాధాకృష్ణన్ ఆయన బుగ్గలను, తలను నిమిరి, వీపును తట్టి ***"ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకోండి!"*** అని అనేటప్పటికీ అంతటి నియంత విచలితుడై పోయాడుట. రాధాకృష్ణన్ చూపించిన అనురాగం ఆప్యాయత ఆ నియంతను కదిలించివేసి **"నేనెంతో కాలం బ్రతకకపోవచ్చును"** అని కంటతడి పెట్టాడుట స్టాలిన్. స్టాలిన్‌తో అంత సన్నిహితంగా మెలిగిన రాయబారి మరెవరూ లేరేమో! తత్త్వవేత్త కాబట్టే, అంతటి నియంత సన్నిధికి వెళ్ళగలిగాడు, ఆయన మనస్సును దోచుకోగలిగాడు రాధాకృష్ణన్. అంతర్జాతీయ రంగంలో ఆయన అంతస్థును పెంచుకోగలిగాడు. కేవలం తత్త్వవేత్తే కాదని, రాజకీయ దురంధరుడని అనిపించుకోగలిగాడు రాధాకృష్ణన్.

డా॥ రాధాకృష్ణన్ మైసూరు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉండేవారు. 1921 సం॥ మార్చిలో కలకత్తా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు డా॥ అశుతోష్ ముఖర్జీ

కోరికపై డా॥ రాధాకృష్ణన్ గారు కలకత్తా విశ్వవిద్యాలయంలో పని చేయడానికి బయలు దేరుతున్న సమయం అది. ఇంటి ముందు 'గుర్రపు బగ్గీ' వచ్చి నిలచింది. మైసూరు విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకులు వీడ్కోలు యివ్వడానికి పెద్ద సంఖ్యలో వచ్చారు. అంతా సందడిగా ఉన్నది. డా॥ సర్వేపల్లి సామానును విద్యార్థులు బగ్గీలో పెట్టారు. డా॥ సర్వేపల్లి లోపల నుంచి బయటకు వచ్చారు. కొందరు విద్యార్థులు డా॥ సర్వేపల్లిని చేతుల మీద ఎక్కించుకున్నారు, మరికొందరు విద్యార్థులు బగ్గీకి వున్న గుర్రాలను వదిలివేసి, ఆ కాడిని తమ మెడలపైన పెట్టుకున్నారు. డా॥ సర్వేపల్లిని ఎత్తుకొనిపోయి బగ్గీలో కూర్చో బెట్టారు విద్యార్థులు. ఇదంతా డా॥ సర్వేపల్లికి విచిత్రంగా కనిపించింది.. 'ఇదేమిటి?' 'అని ఆశ్చర్యంగా అడిగారు డా॥ సర్వేపల్లి. అప్పుడు ఆ విద్యార్థులు ***"జ్ఞానభిక్ష పెట్టిన అధ్యాపకునికి కృతజ్ఞతను తెలియపరచటం"*** అని ముక్తసరిగా సమాధానం చెప్పారు. విద్యార్థులే ఆ బగ్గీని స్టేషన్ వరకు లాక్కొని తీసుకొని వెళ్ళారు. చేతుల మీదగా ఎత్తుకొని, రైలు బోగీలో డా॥ సర్వేపల్లిని కూర్చోబెట్టారు. పరిసరాలలో నున్న వారందరూ, ఆ విద్యార్థులు ప్రదర్శించిన గురుభక్తిని చూచి ఆశ్చర్యపోయారు.

అధ్యాపకులను విద్యార్థులు అవహేళన చేస్తున్న ఆ సమయంలో, విద్యార్థుల ఆదరాభిమానములను చూరగొనిన ఉత్తమ అధ్యాపకుడు డా॥ సర్వేపల్లి. అంతటి అభిమానాన్ని పొందిన ఆయన ఎంత అదృష్టవంతుడు? అది ఆయన స్వరాష్ట్రం కాదు. అక్కడ ఆయన పని చేసిన కాలం కూడా రెండేళ్ళకు మించలేదు. అంత స్వల్ప కాలంలోనే విద్యార్థుల హృదయాలపై చెరగని ముద్రవేసిన ఆదర్శ అధ్యాపకుడు ఆయన. "విద్వాన్ సర్వత్ర పూజ్యతే" అనే ఆర్యోక్తిని ఆచరణ ద్వారా నిరూపించిన ఆ మహా మనీషి డా॥ సర్వేపల్లి. అందువలననే కాబోలు భారత ప్రభుత్వం ఆ మహాపురుషుని జన్మదినము అయిన సెప్టెంబరు 5వ తేదీన ***'ఉపాధ్యాయ దినోత్సవముగా'*** జరుపుకోమని ఆదేశించింది. కనుక ప్రతిఉపాధ్యాయుడు డా. సర్వేపల్లిని ఆదర్శంగా తీసుకొని, ఆయన సమాజమునకు అందించిన ఆదర్శముల నుంచి స్ఫూర్తిని పొంది, ఆదర్శ అధ్యాపకులుగా వెలుగొందు తారని ఆశిద్దాం.

"National integration cannot be built by brick and mortar, by chisel and hammer, but it has to grow silently in the minds and hearts of Men".

- Dr. Sarvepalli



లాల్ బహదూర్ శాస్త్రి

"మంత్రి పదవి ఒక మహత్తరమైన బాధ్యతే గాని, అది అధికార భోగ్యం, విలాసయోగ్యం కారాదు. సుఖ సౌకర్యాల పేరుతో మనం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయరాదు. లభించిన పదవిని సేవాదృష్టితో నిర్వహించాలి".

అని అధికారులకు చెప్పి, తన అధికార నివాసానికి ***'ఎయిర్ కండీషన్'*** తీయించి వేస్తారు. తొలిసారిగా ఆయన కేంద్రమంత్రి పదవిని అలంకరించినప్పుడు, ఆయన అనుమతి లేకుండానే, ఆయన పర్యటనలో ఉన్నప్పుడు, ఆయన అధికార నివాసానికి 'ఎయిర్ కండీషన్'ను అధికారులు చేయిస్తారు. మంత్రిగారి మెప్పను పొందవచ్చని అధికారులు సహజంగా భావిస్తారు. కాని మెప్పను పొందకపోగా, చివాట్లు తింటారు. అదే అక్కడ జరిగిన విచిత్రం. ఆయన ఎవరో తెలుసా? అత్యున్నతమైన కేంద్రమంత్రి పదవిని అధిష్టించినా, భోగవిలాసాల నాశించని, నిరాడంబరుడు, నిజాయితీ పరుడు, స్వార్థమెరగని సేవానిరతుడు, పొట్టివాడైనా, అతి గట్టివాడని పేరుగాంచి, పరిపాలనా దక్షుడుగా కీర్తి శిఖరాలనందుకొనిన కర్మయోగి ***లాల్ బహదూర్ శాస్త్రిగారు.***

'శాస్త్రి' అనేది కాశీ విద్యాపీఠం వారు ప్రదానం చేసిన Master Degree. ఆయన అసలు పేరు శ్రీవాత్సవ లాల్‌బహదూర్. ఆయనే లాల్‌బహదూర్ శాస్త్రిగా ప్రజలకు సుపరిచితులయ్యారు. భారత దేశప్రధానిగా సుదీర్ఘకాలం జవహర్‌లాల్ నెహ్రూ పాలించారు. మంచి పేరును తెచ్చుకున్నారు. ఆయన తరువాత అంతటి వారు ఎవరు? నెహ్రూలా ఆయన పాలించగలడా? అని దేశవిదేశాలలో చర్చలు జరుగుతున్న సమయంలో 1964 సం॥ మే 27న గుండెపోటుతో నెహ్రూ పరమపదించుతారు. జూన్ 9వ తేదీన లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధాన మంత్రి పదవీ బాధ్యతను చేబడుతారు.

ఆయన నిజాయితీ అందరికీ బాగా తెలుసు. కాని ఆయన సమర్ధత మీద సందేహాలు మాత్రం పూర్తిగా తీరలేదు. ఆయనది నిరాడంబరమైన వేషం. ఆడంబరం ఏ మాత్రం ఉండేదికాదు. అతి సామాన్య వ్యక్తిగా కనిపించేవాడు. గంభీరమైన విగ్రహం కాదు. పొట్టివాడు. ప్రధాని పదవి చేబట్టిన తరువాత కూడా ఆయన వేషంలోగాని, అలవాట్లలో ఏమాత్రం మార్పురాలేదు.

భోపాల్‌లో ఒకసారి ఒక ఉర్దూ కవి లాల్‌బహదూర్ శాస్త్రిగారిని కలిసి "*మీ ప్రస్తుత వేషం (ధోవతి, కుర్తా) ప్రధాన మంత్రి హోదాకి తగినట్టుగా లేదు. పైగా మీరు ప్రతిరోజు ఎందరో విదేశీయుల్ని కూడా కలుసుకోవాలాయే!*" అని అంటాడు. ఆ మాటలు విన్న లాల్ బహదూర్ శాస్త్రిగారు కోపించక, ప్రశాంతంగా వివేకానందుని మాటలు గుర్తుచేశారుట. "*చేతలనుబట్టి ఒక వ్యక్తి శీలమును నిర్ణయించాలి గాని, అతను వేషధారణను బట్టి కాదు. అతను చేసే పనులను గమనించి, అతని సమర్ధతను అంచనా వేయాలి గాని , వేషమును చూచి నిర్ణయానికి రాకూడదు. అలాగే ఒక దేశమును గురించి చెప్పేటప్పుడు, ఆ దేశ ప్రజల గుణగణాలను చూడాలి గాని, జనసంఖ్య ముఖ్యం కాదు*". ఈ దృష్టితో గనుక చూస్తే లాల్‌బహదూర్ శాస్త్రి సామర్ధ్యం, నీతి నిజాయితీలు ఎంతటివో మనకు అవగతమవుతాయి. ప్రధాన మంత్రిగా పాలన చేసిన సమయం 19 మాసములే అయినప్పటికీ, చిరస్థాయిగా గుర్తుంచుకోవలసిన ఘనకార్యాలను ఎన్నో సాధించారు శాస్త్రిగారు.

ఆయన ఎంత నిరాడంబరుడో, అంత నిజాయితీపరుడు కూడా. 1952 సం॥ నుంచి కన్నుమూసేదాకా కొన్ని నెలలు తప్ప కేంద్రంలో అనేక మంత్రి పదవుల బాధ్యతను కడు సమర్ధవంతంగా, నిజాయితీగా నిర్వహించారు. తమిళనాడులోని 'అరియలూర్' వద్ద జరిగిన రైలు ప్రమాదంలో 112 మంది మరణించినప్పుడు, నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేసారు. ఆ తరువాత కార్యాలయము నుంచి బయటకు రాగానే, మామూలు ప్రకారం ఆయనను ఇంటికి తీసుకొని వెళ్ళడానికి చిన్నకారు సిద్ధంగా ఉంటుంది. ఆ కారులో ఎక్కక, బస్సులో ఇంటికి వెళ్ళుతారు. ఇంటికి వెళ్ళి ఆయన భార్యతో '*నేటి నుంచి నాకు పదవి లేదు. కనుక ఒక్క కూరకంటె ఎక్కువ వండవద్దు*' అని చెబుతాడట. సుదీర్ఘ కాలం మంత్రి పదవులను, ప్రధాన మంత్రి లాంటి ఉన్నత పదవులను అధిష్టించినప్పటికినీ, ఆర్జించింది ఏమీ లేదు. స్వంత ఇల్లు అంటూ లేకుండానే కన్ను మూసారు *లాల్‌బహదూర్ శాస్త్రిగారు.*

ఒకసారి ప్రమాదవశాత్తు శాస్త్రిగారు ప్రయాణం చేస్తున్న కారు ఆగిపోయింది. దగ్గరలోనే వున్న పోలీసుస్టేషన్‌కు ఆయనే స్వయంగా నడచి వెళ్ళుతాడు. *'ఫిర్యాదు చేయడానికి వచ్చాను, ఇన్‌స్పెక్టర్ గారు లేరా?'* అని అక్కడ వున్న హెడ్ కానిస్టేబుల్‌ను ప్రశ్నిస్తాడు. *లేరు. ఆ బెంచీమీద కూర్చో! వస్తారు'* అని సమాధానం చెబుతాడు హెడ్ కానిస్టేబుల్. ఎంత సేపు కూర్చున్నా, ఇన్‌స్పెక్టర్ రాడు. కొంచంసేపు అయిన తరువాత *'ఇన్‌స్పెక్టర్ గారు ఎప్పటికి వస్తారు సార్!'* అని వినయంగా అడుగుతాడు. *"నువ్వేదో పెద్ద అధికారిలా! మినిష్టర్‌లా! అడుగుతావేంటయ్యా! ఇష్టం వుంటే ఉండు లేకపోతే పో!"* అని దురుసుగా మాట్లాడుతాడు ఆ హెడ్. ఇంకా కొంత సేపటికి లోపలికి వస్తూనే *'నమస్కారం సార్!'* అంటూ వస్తాడు ఇన్‌స్పెక్టర్. *'హెడ్ కానిస్టేబుల్! ఈయన ఎవరో తెలుసా! మన హోంమంత్రి లాల్ బహదూర్ శాస్త్రిగారు'* అని చెబుతాడు. హెడ్ కానిస్టేబుల్‌కు చెమటలు పట్టి ఖాకీ దుస్తులు తడిసిపోతాయి. అది గమనించిన శాస్త్రి గారు, జాలిపడి, అతని మీద ఫిర్యాదు చేయకుండా, తన పనిముగించుకొని వెళ్ళిపోతారు. ఆనాటి నుంచి ఆ కానిస్టేబుల్ ప్రవర్తనలో చాలా మార్పు వస్తుంది. ***అందువలననే గొప్పవారి ప్రవర్తన మూర్ఖులలో సహితం పరివర్తనం తెస్తుంది అంటారు.***

లాల్ బహుదూర్ మొత్తం ఎనిమిది సార్లు జైలుకి వెళ్ళారు. ఒకసారి జైలులో ఉన్నప్పుడు ఆయన ఎనిమిదేళ్ళ కూతురికి జ్వరం తీవ్రంగా వస్తుంది. తండ్రి కోసం కలవరిస్తుంటుంది. ఈ విషయం తెలిసిన 'శాస్త్రి'గారు జైలు అధికారులను పెరోల్ అడుగుతాడు. అయితే జైలు అధికారులు ***"మీ అమ్మాయిని చూడాలనుకుంటే పెరోల్ మీద వెళ్ళవచ్చు కాని ఇంకెప్పుడూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ప్రదర్శనలలో పాల్గొనని హామీ యివ్వాలి"*** అని షరతు పెడుతారు. ఆ షరతు ఆయనకు నచ్చలేదు. అయితే ఆ అమ్మాయికి జ్వరం మరీఎక్కువయింది. ఆమె మీద ఆశ వదులుకున్నారు. ఆ పరిస్థితులలో ప్రభుత్వం, లాల్‌బహుదూర్‌ను పెరోల్ మీద పంపడానికి అంగీకరించింది. జైలు నుంచి ఇంటికి వెళ్ళుతారు. అయితే తండ్రిని చూడకుండానే ఆమె కన్ను మూస్తుంది. అంత విచారంలో కూడా జైలుకు తిరిగి వస్తారు లాల్ బహుదూర్. ఆయన నిజంగా స్థిత ప్రజ్ఞుడే.

ఒకసారి గాంధీజీ వారణాసి వస్తారు. గాంధీజీ ఉపన్యాసాన్ని వినిన లాల్ బహుదూర్, ఉత్సాహంతో సహాయనిరాకరణోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళుతాడు. అప్పుడు ఆయన వయస్సు 16 సంవత్సరాలు మాత్రమే. విడుదల అయిన తరువాత గాంధీజీ సలహా మేరకు కాశీ విద్యాపీఠంలో చేరి నాలుగు సంవత్సరాలు విద్యాభ్యాసం


చేస్తారు. ఆ రోజులలో విద్యార్థులు సైకిళ్ల మీద వెళ్లి వస్తుంటే, సైకిలు కొనుక్కొనే స్తోమత లేక లాల్‌బహుదూర్ మాత్రం రోజు 16 మైళ్ళు నడిచి వెళ్లి తిరిగి వచ్చేవాడట. అయినప్పటికీ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై 'శాస్త్రి' పట్టాను సాధించిన దీక్షా దక్షుడు **లాల్‌బహుదూర్ శాస్త్రి.**

లాల్‌బహుదూర్ శాస్త్రి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, అహంకారంతో అంతకు పూర్వం చేసికొన్న ఒడంబడికలను కూడా ఉల్లంఘించి "రాణ్ ఆఫ్ కచ్" మీద సైనిక చర్యకు తలబడుతాడు. శాంతిని, సహజీవనాన్ని కోరే లాల్ బహూదూర్ ఈ దురాక్రమణను ఎదుర్కొనగలడా? అని యావత్ ప్రపంచం సంశయిస్తున్న తరుణంలో "జై కిసాన్!.. జై జవాన్!" నినాదాన్ని యిచ్చి రైతులను, జవాన్లను ఉత్తేజ పరచి పాకిస్థాన్ సాయుధ దురాక్రమణను త్రిప్పికొట్టి, ప్రపంచాధినేతల ప్రశంసల నందుకుంటారు. పొట్టివాడేకాదు, అతి గట్టివాడని నిరూపించుకుంటాడు లాల్ బహుదూర్ శాస్త్రి.

రష్యా ప్రధాని సలహా ప్రకారం, భారత పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం ప్రబలటం మంచిదికాదని భావించిన శాస్త్రిగారు యుద్ధ విరమణ సంప్రదింపులకు 'తాష్కెంట్' వెళ్ళుతారు. అలా వెళ్లిన శాస్త్రిగారు విధివశాత్తు మరల తిరిగి రాలేదు. జరగరానిదే జరిగింది. 1966 సం॥ జనవరి 11వ తేదీ రాత్రి అకస్మాత్తుగా, అనూహ్యమైన పరిస్థితిలో పరమపదించుతారు.

మాజీ రాష్ట్రపతి *డాక్టర్ సర్వేపల్లి* పేర్కొనినట్లు లాల్‌బహుదూర్ శాస్త్రి ప్రజలమనిషి. ఇది అక్షరాలా నిజం. *'ఓర్పు, పట్టుదల, గుండెదిటవు, నిజాయితీ, నిరాడంబరత, శాంతి ప్రియత్వం, వేషభాషలు, వినయవిధేయతలు, ధైర్య స్థైర్యములు - ఇవన్నియూ ఒక్కచోట కలిసిన ఆకృతియే 'లాల్‌బహుదూర్ శాస్త్రి'* అని అంటారు *సర్వేపల్లి.*

ఇది వాస్తవం. పొట్టివాడైనా అతి గట్టివాడు, నిరాడంబరుడైనా నిర్భయుడు. వేషభాషలు సామాన్యంగా కనిపించినా, సమర్థుడైన పరిపాలనాదక్షుడు. పాలించింది కొద్దినెలలే అయినప్పటికీ, ఆయన పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. పేదవాడైనా నిజాయితీ పరుడు అనిపించుకున్నాడు. ఉన్నత పదవులనధిష్టించినా సామాన్య జీవితాన్నే గడిపాడు. మనిషి వ్యక్తిత్వాన్ని పెంచేవి పదవులు కావని, సచ్ఛీలత మాత్రమేనని ఆచరణ ద్వారా నిరూపించారు లాల్‌బహుదూర్ శాస్త్రి. ఆ మహనీయుని అడుగుజాడలలో నడుద్దాం, మన జీవితాలను సార్థకం చేసుకుందాం!



సర్దార్ వల్లభాయి పటేల్

"ఎక్కడ కొన్నావురా ఈ పుస్తకం?"

"బజార్లో పుస్తకాల కొట్లోనండి!"

"నాదగ్గరే కొనాలని నీకు తెలియదా?"

"మీ దగ్గర చదువుకునేందుకేగాని బేరసారాలు చెయ్యటం కోసం కాదండీ, నేను బడికి రావడం".

ఈ జవాబు విని ఆ ఉపాధ్యాయుడు ఉలిక్కి పడుతాడు. అయినా గంభీరంగా *"ఇదిగో! ఈసారి నువ్వు ఇతరత్రా పుస్తకాలు కొన్నావో! బడికి రానివ్వను, తెలిసిందా?"* అన్నాడు.

"మీకా కష్టం ఎందుకులెండి. నేనింక బడికి రాను, సార్!" అన్నాడు ఆ బాలుడు. ఆ ఉపాధ్యాయుడు నిర్ఘాంతపోయాడు.

ఆ మరునాడు అతడేకాదు. ఆ తరగతి విద్యార్థులెవ్వరూ బడికి రాలేదు. ఆ గ్రామపెద్దలు జోక్యం చేసుకొని, అందరినీ శాంత పరిచారు. పిల్లలందరూ బడికి వెళ్ళారు.

అంత నిర్భయంగా జవాబు చెప్పిన బాలుడెవరో తెలుసా? 'బార్డోలి రైతుల భూములలో అడుగుపెడితే ప్రాణాలతో తిరిగి వెళ్ళరు" అని ఆంగ్లేయ అధికారులను హెచ్చరించి, వారికి సింహస్వప్నంగా నిలచిన *'బార్డోలి సర్దార్'* గా పేరు ప్రఖ్యాతులనందు కొనిన మహావీరుడు ఆయన.

స్వాతంత్ర్య మహోద్యమంలో అగ్రభాగాన నిలబడి, బ్రిటీష్ వారిని గజగజలాడించి, వీరోచితంగా పోరాటం కొనసాగించి **ఉక్కుమనిషి** (Iron man of India) గా కీర్తి

ప్రతిష్టలందుకొనిన ధీరుడు ఆయన. ఆయన పేరు చెబితే చాలు, రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాధినేతలు వణికి పోయేవారు. మన దేశంలో చెల్లాచెదురుగా ఉన్న 565 సంస్థానాలను భారత ప్రభుత్వం క్రిందకు తీసుకొనివచ్చిన గొప్ప రాజనీతి దురంధరుడు ఆయన. ఆయనే ***సర్దార్ వల్లభాయి పటేల్.***

ఆయన ఎప్పడూ పదవుల కోసం ప్రాకులాడలేదు. అయినప్పటికీ ప్రథమ భారత ప్రధాన మంత్రిగా ఆయన ఉండాలని, ఆనాడు మన దేశంలో ఉన్న 15 రాష్ట్రములలో, 12 రాష్ట్రములవారు బలపరిచారు. అయినప్పటికీ మహాత్మా గాంధీజీ జోక్యం చేసుకోవటం వలన, పండిత నెహ్రూ ప్రథమ ప్రధాన మంత్రి పీఠాన్ని అలంకరించారు. ఉప ప్రధాన పదవిని పటేల్ స్వీకరించారు.

పటేల్ వీధి బడిలో చదువుకునే రోజులవి. ఒకనాడు మాస్టారు ఎక్కాలు వ్రాసుకొని రమ్మనమని పిల్లలను ఆదేశిస్తాడు. మరునాడు పటేల్ దగ్గరకువచ్చి ***"ఎక్కాలు వ్రాసి తెచ్చావా?"*** అని అడుగుతాడు ఆ మాస్టారు. ***"ఆ! తెచ్చాను ... కాని"*** అన్నాడు పటేల్. ***'కానీ ఏమిట్రా'*** అని ప్రశ్నిస్తాడు మాస్టరు. ***"ప్రొద్దున స్కూల్ దగ్గరకు రాగానే, పిల్లలు భయపడి పరుగెత్తారండి!"*** అని సమాధానం చెబుతాడు పటేల్. మాస్టారుకి కోపం వస్తుంది, అర్థం కాదు ఆశ్చర్యం వేస్తుంది. పిల్లలంతా పకాలున నవ్వుతారు. ఆ మాస్టారు ఎక్కాలు వ్రాసి తెమ్మనమని 'పహడోం' అని హిందీలో చెప్పారు. కాని పటేల్ దాన్ని గుజరాతీ భాషలో అర్థం చేసుకున్నాడు. *'పహడోం'* అంటే గుజరాతీ భాషలో ఆవులూ, గేదెలూ అని అర్థం. అందువలన పటేల్ ఆవులను, గేదెలను స్కూల్‌కి తోలుకొని వస్తాడు. వాటిని చూచి పిల్లలు భయపడి పారిపోతారు. ఆ మాస్టార్‌కు కోపం వచ్చి రెండు వందల ఎక్కాలు వ్రాసుకొని రమ్మనమని కఠినంగా ఆదేశిస్తాడు. ఆ మరునాడు మరల అడుగుతాడు. పలక తెచ్చి చూపిస్తాడు పటేల్. ఆ పలక మీద రెండు వందల ఎక్కములు వ్రాయబడి ఉంటాయి. ఆ మాస్టార్ ఆశ్చర్యపోయి, ఒక చిరునవ్వు నవ్వి అతని తెలివి తేటలకు, గుండె నిబ్బరానికి, ధైర్యానికి ఆనందిస్తాడు.

న్యాయ శాస్త్రం చదవడానికి పటేల్ లండన్ వెళ్లుతాడు. అక్కడ ఉన్నప్పడు అతని కాలిపై ఒక గడ్డ లేస్తుంది. డాక్టర్‌కు చూపిస్తాడు. ఆపరేషన్ చేయాలంటాడు

డాక్టర్. పటేల్‌ను బల్లపై పడుకోపెడుతారు. అతనికి మత్తుమందు యివ్వడానికి సిద్ధమవుతారు. వద్దంటాడు పటేల్. అప్పడు ఆ డాక్టర్లు శస్త్రచికిత్స చేసి ఆ గడ్డను తీసి వేస్తారు. మత్తుమందు యివ్వకుండా ఆపరేషన్ చేస్తున్నప్పటికీ ఏ మాత్రం చలించడు, తొణకడు, బెణకడు, బాధపడడు. ఆ దృశ్యం చూచిన డాక్టర్లే ఆశ్చర్యపోతారు.

బార్డోలి శిస్తుసత్యాగ్రహంలో పటేల్ ప్రదర్శించిన ధైర్యసాహసాలను చూచి గాంధీ మహోత్ముడంతటివాడు ఆశ్చర్యపోయి ఆయనకు 'సర్దార్'అనే బిరుదును యిస్తారు. ఇలా పటేల్‌ను గురించి తెలుసుకోదగిన కథలెన్నో ఉన్నాయి. మొత్తం మీద అఖండ భారత నిర్మాతగా, 565 స్వదేశీ సంస్థానాలను భారత రిపబ్లిక్‌లో విలీనం చేసిన ఉక్కు మనిషి (Iron man of India) గా ఆయన మన దేశచరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయారు.

విశ్రాంతి ఎరుగని మహావీరుడు ఆయన. కర్తవ్య పరాయణత్వంలో అహర్నిశలూ శ్రమించడం వలన ఆయన ఆరోగ్యం బాగా దెబ్బతింటుంది. డాక్టర్ల సలహా ప్రకారం, విశ్రాంతి కోసం, ఆయన మిత్రులు బొంబాయిలోని బిర్లా మందిరానికి తీసుకొని వెళ్ళుతారు. ఆ మహావీరుడు అక్కడనే ది. 15-12-1950న శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంటాడు. జీవిత కాలంలో ఆయన చేసిన త్యాగాలు, సాధించిన విజయాలు ఈ తరంవారికి ఎందరికి తెలుసు? అసలు ఆయన ఉజ్వల జీవిత చరిత్రను తెలుసుకొని స్ఫూర్తిని పొందాలనే తాపత్రయం ఎందరిలో ఉన్నది? ఇది కొంచెం ఆలోచించవలసిన విషయమే.

"తక్కువ మాట్లాడండి, ఎక్కువ సాధించండి. మర్యాదగా మాట్లాడటానికి, పొగడ్తకున్న తేడా గ్రహించండి. 'విప్లవం... విప్లవం...' అనే కేకలు వేయకండి. ఆ కేకలు వేసే నాయకులు కార్యాచరణకు వెనుకంజ వేస్తారు. దేశంలో నాయకులకు కొదవలేదు. క్రమశిక్షణా శీలురైన అనుచరులు లేనిదే పోరాటం విజయంపొందదు. కాన అట్టి సుశిక్షితులైన సైనికులుగా తయారుకండి".

\- పటేల్



డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య

"ప్రకాశంగారికి రేపు అనేది లేదు. నాకు రేపూ, ఎల్లుండికూడా ఉన్నాయి" అని ఒకసారి ఛలోక్తిగా అన్నారు డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు. ఈ మాటలు ఛలోక్తిగా ఉన్నప్పటికీ, అంతరార్థం ఎంతో ఉన్నది. ప్రకాశంగారు రేపును గురించి ఆలోచించక తన సర్వస్వాన్ని స్వాతంత్ర్యమహోద్యమంలో సమర్పించివేశారు. ఆఖరి దశలో కటిక దారిద్ర్యాన్ని అనుభవించవలసి వచ్చింది. అయితే డా॥ పట్టాభిగారు చిన్న తనంలోనే దారిద్ర్యబాధను అనుభవించడంచేత, జీవితంలో డబ్బును విచ్చల విడిగా ఖర్చుచేసేవారు కాదు. పొదుపు చేసేవారు. ఒకవైపు వ్రాసిన కాగితాన్ని కూడా పారవేసేవారు కాదుట. ఏమాత్రం తెల్లటి కాగితం కనిపించినా, అంతవరకు కత్తిరించి, అది పెద్దదయినా, చిన్నదైనాసరే టేబుల్ మీద క్లిప్పుకు పెట్టి వుంచుకొనే వారుట. అవసరమొచ్చినప్పుడు ఆ కాగితాలను వినియోగించేవారు పట్టాభి.

మధ్యతరగతి కుటుంబీకుల ఆర్థిక స్థితిగతుల విషయంలో అవగాహన బాగా ఉండటంవలన, అనేకమంది నిరుద్యోగ యువకులకు ఉపాధి కలిపించాలని సంకల్పించుకొని బ్యాంకులూ, ఇన్సూరెన్సు కంపెనీలను స్థాపించారు పట్టాభి. 1915 సం॥లో బందరులో కృష్ణా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌ను, 1923 సం॥లో ఆంధ్రాబ్యాంకును, 1925 సం॥లో ఆంధ్రా ఇన్సూరెన్సు కంపెనీని, 1927 సం॥లో వడ్లమన్నాడు ల్యాండు మార్టిగేజ్‌బ్యాంక్‌ను, 1929 సం॥లో భారతలక్ష్మీబ్యాంకును, 1935 సం॥లో హిందూస్థాన్ ఐడియల్ ఇన్సూరెన్సు కంపెనీలను స్థాపించి ఎన్నో వేలమంది విద్యావంతులకు జీవనభృతిని కలుగజేసారు. ఈనాటికీ ఎన్నోవేలమంది ఆ సంస్థలలో చేరి జీవనయాత్రను సాగిస్తున్నారు.

భారత జాతీయ కాంగ్రెస్ స్వర్ణోత్సవాల సందర్భంలో అనగా 1935 సం॥లో "History of the Indian National Congress" అనే ఉద్గ్రంథాన్ని ఇంగ్లీషులో రచించారు. దానిని కొడాలి ఆంజనేయులుగారు తెలుగులోనికి అనువదించారు.

ఒక బొంబాయి పబ్లిషర్‌వచ్చి, ఆ గ్రంథం కాపీరైటు హక్కులు యిస్తే యాభైవేల రూపాయిలు యిస్తానంటాడు. ఆయన డబ్బుకు ఆశపడక ఆ గ్రంథాన్ని కాంగ్రెసు సంస్థకే అంకితం చేస్తారు పట్టాభి.

అబద్ధం ఆడకుండా న్యాయవాదిగా రాణించడం సాధ్యం కాదని భావించి పట్టాభి వైద్యవృత్తిని స్వీకరించుతారు. చదువు పూర్తి అయిన తరువాత పిఠాపురం సంస్థానంలో ఉద్యోగం యిస్తానంటారు మహారాజుగారు. దానిని అంగీకరించక డాక్టర్‌గా బందరులో స్థిరపడుతారు పట్టాభి. పదేళ్లలో పుష్కలంగా డబ్బు సంపాదిస్తారు పట్టాభిగారు. మద్రాసులో చదువుతున్నప్పుడే 1898 సం॥లో గాంధీజీతో పరిచయం ఏర్పడుతుంది. బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశ పర్యటన చేసినప్పుడు ఆయనతో కూడా పట్టాభికి పరిచయం ఏర్పడుతుంది. వారి పరిచయంతో పట్టాభిలో జాతీయభావాలు ఒక రూపం సంతరించుకుంటాయి. కోపల్లె, ముట్నూరిల సహకారంతో బందరులో ఆంధ్రజాతీయ కళాశాలను స్థాపించుతారు. 1921, 1929 సంవత్సరాలలో గాంధీజీ ఆ కళాశాలను దర్శించి, ఉన్నత ఆశయాలతో నడుపబడుతున్న ఆ విద్యాసంస్థను ఎంతగానో మెచ్చుకుంటారు.

1939 సం॥లో కాంగ్రెసు అధ్యక్షుడుగా సుభాస్ చంద్రబోస్ మీద పోటీ చేసి ఓడిపోతారు పట్టాభి. ఆ ఎన్నికలలో గాంధీజీ పట్టాభిని బలపరుస్తారు. **'పట్టాభి ఓటమే నా ఓటమి'** అని బహిరంగంగా గాంధీజీ వెల్లడిస్తారు. దీనిని బట్టి పట్టాభి మీద గాంధీజీకి ఎంత గౌరవమూ, అభిమానమూ, ఉండేదో అర్థమౌ తుంది. కాంగ్రేస్‌లో ప్రముఖ పాత్ర వహించిన ఆయన ఏ పదవినీ ఆశించలేదు. రాజాజీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రి పదవి చేబట్టమని ఆహ్వానించినా అంగీకరించ లేదు పట్టాభి. మధ్యప్రదేశ్ గవర్నరుగా ఐదు సంవత్సరాలుండి 1957 సం॥లో హైదరాబాద్‌లో స్థిరబడ్డారు పట్టాభి. తన స్వీయచరిత్ర వ్రాస్తూ, అది పూర్తికాక మునుపే, తన 79వ ఏట 1959 సం॥ డిశంబర్ 15వ తేదీన పట్టాభి పరమపదిస్తారు. గాంధీజీ తత్త్వాన్ని బాగా జీర్ణం చేసుకొని Indian Nationalisam, Why vote congress, National Education మొదలగు అనేక రచనలు చేశారు. అందుకే గాంధీజీ ఒకసారి ***"నేను వైశ్య సూత్రకారుడ్ని, పట్టాభి బ్రాహ్మణభాష్యకారుడు"*** అని మెచ్చుకుంటారు.

పట్టాభికి చిన్నప్పటినుంచే నిర్మొగమాటంగా, నిర్భయంగా మాట్లాడటం అలవాటు. బందరు నోబుల్ కళాశాలలో ఎమ్.ఎ. చదువుతున్నప్పుడు ఒక చిన్న సంఘటన జరిగింది. ప్రతిఒక్కరూ కళ్ళుమూసుకొని ప్రార్థనలో పాల్గొనాలి. అది ఆ కాలేజీ నియమం.

ఒకసారి ఒక పిల్లవాడు కళ్ళుతెరచి ప్రార్థన చేస్తుంటాడు. ఆ కాలేజీ ప్రిన్సిపాల్ 'క్లార్క్' ఆ విద్యార్థిని మందలిస్తాడు. పట్టాభి ప్రిన్సిపాల్ వద్దకువెళ్ళి *"కళ్ళుమూసుకొని మీరు ప్రార్థనలో పాల్గొనాలి గదా! అయితే అతను కళ్ళు తెరచిఉన్నట్లు మీకు ఎలా తెలిసింది?"* అని నిర్భయంగా అడుగుతాడు. అప్పుడు ఆ ప్రిన్సిపాల్ ఏమీ సమాధానం యివ్వడు. చిన్నప్పటినుంచే అంత నిర్భయంగా మాట్లాడటం ఆయన ప్రవృత్తి.

ఒకసారి బందరులోని విక్టోరియా మెమోరియల్ హాల్‌లో ఒక సమావేశం జరిగింది. చాలామంది పురప్రముఖులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. ఆంగ్లేయుడైన జిల్లా కలక్టర్ అధ్యక్షస్థానంలో వుండి ఆ సమావేశాన్ని నిర్వహిస్తున్నాడు. విద్యార్థిగా ఉన్న పట్టాభికూడా వెనుక బెంచీలో కూర్చున్నాడు. అయితే అధ్యక్షస్థానంలో ఉన్న కలక్టరుగారు ఒక పద్ధతిలో ఆ సభను నిర్వహించటంలేదు. వెంటనే ఆ విద్యార్థి (పట్టాభి) లేచి *'మీ ప్రొసీజర్ తప్పు సార్!'"* అని బిగ్గరగా చెబుతాడు. ఆ కలక్టర్‌గారికి అత్యంత సన్నిహితుడైన ప్రముఖ లాయర్ జే.డి. శామ్యూల్ లేచి "Who is that self advertising charlatan" (ఎవరా స్వంత డబ్బా వాయించుకునే వదరుబోతు) అని మండిపడుతాడు. అప్పుడు ఆ విద్యార్థిలేచి నిర్భయంగా ఆ ప్రొసీజర్‌లోని తప్పులను, పార్లమెంటరీ నియమ నిబంధనలను చెప్పేటప్పటికి, కలక్టర్‌తో సహా సభికులందరూ ఆశ్చర్యపోతారు. పట్టాభి మేధావి మాత్రమేకాదు. చమత్కారంగా మాట్లాడి సభికులను ఆకట్టుకోగల సమర్థుడు. ఒకసారి పట్టాభిగారిని ఒక మిత్రుడు 'అల్పాహారము'నకు ఆహ్వానిస్తాడు. డా॥ పట్టాభి ఆ అల్పాహార విందులోని Items ను గురించి చమత్కారంగా వ్యాఖ్యానించి అందరినీ నవ్విస్తాడు. "ఇచ్చే కాఫీ ఫ్రెంచిది, చక్కర జావాది, కలిపేది ఆస్ట్రేలియన్ టిన్‌మిల్క్, త్రాగేది జపాన్ కప్పుతో, కలియబెట్టేది జర్మన్ స్పూన్‌తో, మరగకాచేది అమెరికన్ స్టౌవ్‌పైన, తాగబెట్టేది బర్మాఆయిల్‌తో, తినేది గ్లాస్కో బిస్కట్లు, టేబుల్‌పైన పరచిన గుడ్డ లాంకైషైర్‌మిల్లుది, తుడుచుకునే చేతిరుమాలా టర్కిష్ నాప్‌కిన్, కాలిక్రింద కార్పెట్ డెన్మార్కుది, ఎదురుగా వుండే అద్దం బెల్జియంది. ఇకపోతే వాటిల్లో వుండే స్వదేశీయం కేవలం నీరు మాత్రమే. కాబట్టి అదొక్కటే నాకు యివ్వండి చాలు!" అని హాస్యంగా అనడంతోనే అక్కడి మిత్రులందరూ నవ్వుతారు, ఆశ్చర్యపోతారు. అంతేకాదు ఆయన స్వదేశీ అభిమానాన్ని మెచ్చుకుంటారు.

నిజాయితీ వ్యక్తి ప్రతిష్ఠను పెంచుతే, చమత్కారం అందరినీ ఆకట్టుకుంటుంది.

"Your Replies should be as quick as eagle and as sharp as needle"

'మీ సమాధానములు గరుత్మంతుని వలె వేగముగాను, సూదిమొనంత పదునుగాను ఉండాలి.

- డా. పట్టాభి

Notes....✍

ETHICS & HUMAN VALUES' LEARNING CENTRE

(E.H.V.L. CENTRE)

కార్యనిర్వహణా కమిటీ

వ్యవస్థాపకులు	:	**శ్రీ కొమరగిరి కృష్ణమోహనరావు** ఎడిటర్, 'శ్రీవాణి', మచిలీపట్నం
గౌరవాధ్యక్షులు	:	**శ్రీ అంబటి బ్రాహ్మణయ్య** పార్లమెంటు సభ్యులు, బందరు
అధ్యక్షులు	:	**శ్రీ ఎన్. చౌదరిబాబు** డైరెక్టర్, గౌతమ్ విద్యా సంస్థలు, విజయవాడ
కార్యదర్శి	:	**శ్రీ బి. హనుమంతరావు** డైరెక్టర్, అమలేశ్వరి విద్యా సంస్థలు, మచిలీపట్నం
కోశాధికారి	:	**శ్రీ సి. నాగేశ్వరరావు** డైరెక్టర్, కాకతీయ విద్యా సంస్థలు, విజయవాడ
ఉపాధ్యక్షులు	:	**శ్రీ ఎం.కె. మూర్తి** డైరెక్టర్, శ్రీ సిద్ధార్థ విద్యా సంస్థలు, రాజమండ్రి **శ్రీ మాదల సుబ్రమణ్యేశ్వరరావు** డైరెక్టర్, శ్రీ విశ్వశాంతి విద్యా సంస్థలు, ఉయ్యూరు
సహాయ కార్యదర్శులు	:	**శ్రీ టి.యస్.యస్. బాలాజి** గౌరవ సలహాదారు, విజయ్ విద్యా సంస్థలు, మచిలీపట్నం **శ్రీ కొమరగిరి చంద్రశేఖర్** ప్రిన్సిపాల్, శ్రీ బాలాజి విద్యా సంస్థలు, మచిలీపట్నం


EDUCATION BOOK